


మాటల
మధ్యలో
రాలిన
ముత్యాలు
2 వ భాగము

మాటల మధ్యలో రాలిన ముత్యాలు

2వ భాగం

కర్త

డాక్టర్ మోపిదేవి కృష్ణస్వామి
ఎం. ఏ. పి. హెచ్ డి.

ప్రచురణ :

యూనివర్సల్ హ్యూమానిటేరియన్
ఎడ్యుకేషన్ ట్రస్ట్

విశాఖపట్నం-17

ప్రథమ ముద్రణ :
1992 జనవరి గురుపూజలు

కూర్పు :
మంత్రి

వెల : [redacted]- రూపాయలు 20

ప్రతులకు :

మానవధర్మ శిక్షణ సంస్థ
23-10-7
పురుషోత్తంవీధి
సత్యనారాయణపురం
విజయవాడ-520 011

మానవధర్మ శిక్షణ సంస్థ
1-99
ముంజులూరు-521 366
బంటుమిల్లి మండలం
కృష్ణాజిల్లా

ముద్రణ : నాగేంద్రా ప్రెస్

ముఖచిత్ర కల్పన : శ్రీ కె. నాగభూషణం

ముఖపత్ర చిత్రణ : శ్రీ వి. యస్. ప్రకాష్

అరవిందుని అడుగుజాడల్లో నడుస్తూ
శ్రీమాతకు ప్రతిరూపమై మెలుగుతూ
తెనాలి ప్రాంతానికి మరోమారు
తెల్లవారేట్లు చూసిన —
శ్రీ గుళ్ళపల్లి సత్యనారాయణగారి దివ్యస్మృతికి

ప్రేమపూర్వకంగా సమర్పిస్తున్నాను.

- కృష్ణస్వామి

ఇందులో -

'ముత్యాల ముగ్గు'

మహితాత్ములయిన మాస్టర్ E. K. గారిచే మానవజాతి పునర్నిర్మాణోద్యమమునకై అంకితము చేయబడిన మనీషి మాస్టర్ మోపిదేవి కృష్ణస్వామిగారు. పరమగురువుల సందేశము జాతికి అందివచ్చుటకై వాహికగా తీర్చిదిద్దబడిన మాస్టర్ M. K. 'తన జీవితము లోకహితమునకే' అను ఎఱుక గలవారు. కావున తన మాటలు యువతరానికి ముత్యాల మాటలుగా- తన చేతలు జాతి పునర్నిర్మాణానికి చేయూతలుగా- చేయుచున్న వీరి ఒక్కొక్క రచన పసందుగా సాగిపోతున్నది. అలవోకగా అక్షర సత్యాలను ఆవిష్కరిస్తున్నది.

వీరి రచనలలో— 'మాటల మధ్యలోరాలిన ముత్యాలు' ఒక శిక్షణ గ్రంథము. సాధకుడుగా నిత్యము మన మలవరచుకోవలసినవి, మనం అనుష్ఠింపవలసినవి అయిన అంశాలు మొదటి భాగంలో ఉన్నాయి.

ఇక— ఈ రెండవ భాగంలో - సాధకుడు సమాజములోని వివిధ సన్నివేశాలను ఎలా అన్వయించుకోవాలో సమ్యక్ దృష్టిని ఎలా పెంచుకోవాలో వివరింపబడింది. 'వసిష్ఠుని ముహూర్తం....' మొదటి సన్నివేశం కాగా, 'రామాయణంలో రాయతీలు' తుది సన్నివేశంగా మొత్తం ముప్పది రెండు అంశాలు ఇందులో ఉన్నాయి.

ఏ సన్నివేశానికా సన్నివేశం 'కదిలేదీ కదిలించేదీ పెను నిద్దుర వదిలించేదీ'. మనస్సు మడతలలో కలుక్కుమంటున్న సంశయాలతో సతమతమవుతూ వచ్చిన జిజ్ఞాసువులకు చక్కని పరిష్కారం అందించి- ఆనంద బాష్పాలతో జీవిత పథంలో ముందడుగు వేయడానికి తోడ్పడుతుంది.

పుత్రకామేష్టిని ఋష్యశృంగునిచే జరిపిస్తాడు. శ్రీరామ కళ్యాణము విశ్వామిత్రునిచే నిర్వహింపబడింది. పట్టాభిషేకానికి తానుపెట్టిన ముహూర్తం అరణ్యవాసానికి దారి తీసింది. కుల పురోహితుడయిన వశిష్ఠుని ఘనత ఏమిటి ? అని అడిగిన భావుకునికి ఇలా సమాధానం వచ్చింది. "తాను సమర్థుడై ఉండికూడ- ఇతరులు సమర్థులైనవారు దొరకినప్పుడు వారికి పని

అప్పగించడంలోనే వసిష్ఠుని ఘనత ఇమిడి ఉంది. దైవకార్యానికి తాను పనిముట్టుననే ఎఱుక కలవాడు కావుననే- తాను పెట్టిన ముహూర్తం తాత్కాలికంగా కార్యసాధకం కాకపోయినా- వసిష్ఠుడు చింతించలేదు. కించపడలేదు. దైవసంకల్పం ఏమిటా అని పైకి చూచినాడు.

(వసిష్ఠుని ముహూర్తం....).

గురువుగారి మహిమలకే ముక్కువపడి చేరికయిన ఒక సాధకుడు ఆ మహిమలు వాస్తవాలు కావని తెలిసి, ఆయన ఆరాధనను వదలలేక- కొనసాగింపలేక కొట్టుమిట్టాడుతూ ఉంటే- "అనుభూతి నీకు లభించడం అనేది నీవు పూజిస్తున్న వ్యక్తిలో విచ్చుకొన్న దైవాంశ ఎంత అన్నదాని పైన ఆధారపడి ఉండదు. నీలో జరుగుతున్న సాధనపైన ఆధారపడి ఉంటుంది". ఎంచుకొన్న వ్యక్తిని పూజించడం మాననక్కరలేదు. (బంగారు సంకెల) అనే చక్కని పరిష్కారం అందుతుంది.

ఒక స్వామీజీ తమ మహోపన్యాసం మధ్యలో— మానవ సేవ నిజంగా మాధవసేవకాదు. అని వివరంలో గజిబిజిపడేసరికి విన్న శ్రోతలు ఇరకాటంలో పడ్డారు. స్వామీజీ ఇంకా నడి వయస్కులే. ఆధ్యాత్మిక పథంలో వారు ఇంకా ఎన్నో అంచెలు ముందుకు వెళ్తారు. మానవసేవ మాధవసేవ అనే అనుభూతి వారికీ దొరుకుతుంది. మనకూ అందుతుంది. 'కథ సుఖాంతమవుతుంది' అని M. K. గారు సాధకుడైన శ్రోతకు చిక్కు తీర్చారు.

ఇలా ఎన్నో - మరి ఎన్నెన్నో ? చేరవచ్చిన పిన్నలకు పెద్దలకు తమ మాటలతో ఆప్యాయంగా కలత తీర్చి వారి యోగజీవితాన్ని మలుపు తిప్పినారు. ముందు తరం వారికి గూడ పనికివచ్చే ముత్యాలు వెదజల్లుతున్నారు. తినబోతూ రుచుబడగటం ఎందుకు ? ముందుకు సాగండి. అందుకోండి.

— పరాశరం గోపాలకృష్ణమూర్తి

ఆ జ్యోతి కిరణాలు - ఆ వెలుగుల వైభవాలు

"స్వామితో మాట్లాడటమే ఒక ఎడ్యుకేషన్" అని ప్రాస్తారొక కోట ప్రముఖ పాత్రికేయుడు, ఉపన్యాస చక్రవర్తియైన తుర్లపాటి కుటుంబరావుగారు. స్వామితో మాట్లాడే సన్నివేశం కలసి వచ్చినప్పుడల్లా వారి ముఖంలో ఒక మెరుపు మెరిసినట్లవుతుంది. అదొక చూడముచ్చటైన దృశ్యంగా రూపుకడుతుంది.

"మాట్లాడే వేళలో మాష్టరుగారు సాక్షాత్తూదైవమే. ఆ క్షణాలలో మనమలా కనురెప్పలకు కూడా విశ్రాంతినిస్తూ, చూస్తూ ఉండి పోవలసిందే. ఎప్పుడు ఏ క్షణంలో ఆయన నుండి ఏ పలుకు వెలువడుతుందోనని ! వెలువడుతూ ఏ వెలుగులు విరజిమ్ముతుందోనని !" అంటూ పరవశులవుతుంటారు శ్రీ కాపూరి పూర్ణచంద్రరావుగారు.

స్వామి మాట్లాడుతున్నప్పుడు ఆ మాటలకు ఒకవైపు తానానం దిస్తూ, మరొకవైపు శ్రోతల ఆనందాన్ని గమనిస్తూ, ఇంకొక వైపున ఈ మాటలను పత్రికా ముఖంగా ప్రజలందరకు అందించే ప్రయత్నానికి మానసికంగా రూపుదిద్దుతూ మురిసిపోతుంటారు శ్రీ కందర్ప రామచంద్రరావుగారు. ఏక కాలంలో మూడు మూర్తులు ధరిస్తూ, కథను ముందుకు నడిపిస్తూ ఉంటారాయన.

"వీరి వాక్కులో ఒక కళ ఉన్నది. వీరి రచనలో ప్రత్యేకమైన ఒక శిల్పమున్నది. ఒకానొక దివ్యజ్యోతి వీరిలో నాకు గోచరించింది. ఆ దివ్యజ్యోతి కిరణాలే వీరి వాక్కులు, వీరి రచనలు! అని స్వామిని గూర్చి తమ ఆనందాన్ని తృప్తిగా వ్యక్తం చేశారు శ్రీ గూడూరు నమశ్శివాయ, మాష్టరు ఇ. కె. షష్టిపూర్తి మహోత్సవాల సందర్భంగా అధ్యక్ష స్థానం నుండి మాట్లాడుతూ.

సందర్భానుసారంగా ఆ దివ్యజ్యోతి వెలువరిస్తున్న కిరణాలే స్వామి పలుకులు-స్వాతి చినుకులుగా, మాటలూ మంత్రాలుగా, మాటల మధ్యలో రాలిన ముత్యాలుగా కూర్పు చేయబడి కావలసిన వారి మనస్సులను స్పృశిస్తున్నాయి.

సరసం ప్రధానంగా నడచినప్పుడు అవి "స్వామి పలుకులు- స్వాతి చినుకులు". సందేశం ప్రధానంగా నడిచినప్పుడు అవి "మాటలు-మంత్రాలు". అవగాహనా, సమన్వయాలు పెనవేసుకుంటూ సాగినపుడు అవి "మాటల మధ్యలో రాలిన ముత్యాలు". అన్నీ ఆ జ్యోతి కిరణాలే. ఆ వెలుగుల వైభవాలే !

సేదతీర్చి హాయినిచ్చేటప్పుడు అవి "స్వామి పలుకులు- స్వాతి చినుకులు". మేలుకొలిపి నిలబెట్టేటప్పుడు అవి "మాటలూ- మంత్రాలు. పరిస్థితులను విశ్లేషిస్తూ, పద నిర్దేశం చేస్తున్నప్పుడు అవి "మాటల మధ్యలో రాలిన ముత్యాలు". అన్నీ ఆ జ్యోతి కిరణాలే !ఆ వెలుగుల వైభవాలే !

ఆట పట్టిస్తూ రక్తి కట్టిస్తున్న వేళ అవి "స్వామి పలుకులు- స్వాతి చినుకులు". చేయూతనిస్తూ చేరదీస్తున్న వేళ అవి "మాటలు-మంత్రాలు". మనలోని లోతుపాతులను తడిమి చూపిస్తున్న వేళ, తడిమి సరిచేస్తున్న వేళ అవి "మాటల మధ్యలో రాలిన ముత్యాలు". అన్నీ ఆ జ్యోతి కిరణాలే. ఆ వెలుగుల వైభవాలే !

స్వామి మిత్రుడై మన మనస్సులను మీటుతున్న వేళ వెలువడేవి "స్వామి పలుకులు- స్వాతి చినుకులు". స్వామి నాయకుడై మనను నడిపిస్తున్న వేళ వెలువడేవి "మాటలూ-మంత్రాలు". స్వామి బోధకుడై మనకు బోధ పరుస్తున్న వేళ వెలువడేవి "మాటల మధ్యలో రాలిన ముత్యాలు". అన్నీ ఆ జ్యోతి కిరణాలే. ఆ వెలుగుల వైభవాలే.

సమాజంలో వివిధ వర్గాలకు చెందినవారు మానవ పరిణామంలో వివిధ దశలలో ఉన్నవారు వివిధ వయస్సులలో నుండి, విభిన్న పరిస్థితులలో నుండి స్వామికి చేరువై సమాజంలోని ఆయా మన స్తత్త్వాలకు, ఆ యా తరహాలకు ప్రాతినిధ్యం వహిస్తూ, స్వామితో, సావధానంగా జరిపిన సంవాద స్వరూపాలే ఈ "మాటల మధ్యలో రాలిన ముత్యాలు".

వివిధ నేపథ్యాలనుండి నడచి వచ్చిన ఆ యా వ్యక్తులను ప్రేమతో పరామర్శిస్తూ, వారి పరిస్థితులనూ, స్థితిగతులను ఒడుపుగా గమనించు కుంటూ, వారి జీవనసరళినీ, కష్ట సుఖాలను, తానుగా పట్టించుకుంటూ, వారి సంస్కారానికీ, పరిణామానికి తగిన విధంగా స్పందిస్తూ, వారి శ్రేయస్సు కోరి, వారి యెడల బాధ్యతపడి, వారితో సార్థకమైన సంభాషణలు సావధానంగా జరుపుతున్న వేళలో స్వామినుండి జాలువారే, ఆ మాటల మధ్యలో రాలిన ముత్యాలివి. మనలో ప్రతి ఒక్కరూ అవశ్యమూ అందుకోవలసిన ఆచరణీయాత్మకమైన సందేశాలివి. కన్ను పొడుచుకున్నా కానరాని అజ్ఞానమనే కారుచీకటిలో కలతచెందుతూ, కలవరపడుతూ, జీవితమనే ప్రయాణాన్ని తప్పనిసరియై బరువుగా కొనసాగిస్తున్న సామాన్య మానవుల చేతులకు అందింపబడుతున్న దీపకళికలివి. జ్ఞాన జ్యోతులివి.

స్వామి సంభాషణలలో ఒక దివ్యమైన వైచిత్రి ఉంది. ఆయన ఎవరితోనన్నా మాట్లాడుతున్నప్పుడు, మాట్లాడుతున్నట్లూ ఉంటుంది. అసలు మానవుడితోనే మాట్లాడుతూ ఉన్నట్లు ఉంటుంది. అంటే వ్యక్తిని నిమిత్తంగా స్వీకరించి, మానవజాతిని ఉద్దేశించి మాట్లాడబడిన ఒక గీతా బోధలా, ఒక వసిష్ఠగీతలా ఉంటుంది. కనుకనే ఆ మాటలన్నీ ఎప్పటి కప్పుడు రికార్డు చేయబడి, మానవజాతికి అందేటట్లుగా చూసే ప్రయత్న మొకటి ఇక్కడ నిరంతరము సాగుతూ ఉన్నది. ప్రజలనుండి ఈ ప్రయత్నానికి లభిస్తున్న ప్రతిస్పందన ఉన్నదే అది. ఈ ప్రయత్నం మరింత వేగంగానూ మరింత శ్రద్ధతోనూ సాగాలని సూచిస్తూ ఉన్నది.

మాటల మధ్యలో రాసిన వ్యాఖ్యలు మొదటి భాగంలో సాధకుడైన మానవుడు సరైన వ్యక్తిత్వాన్ని సంతరించుకోవడానికి గాను, అలవరచుకో వలసిన అంశాలను ఎన్నింటినో కూర్పుచేసి అందించడం జరిగింది. ఇప్పుడీ రెండవ భాగం సరైన వ్యక్తిత్వాన్ని సంతరించుకుంటున్న మానవుడికి జీవితాన్ని అర్థవంతంగా నిర్వహించుకోవడానికిగాను కావలసిన అవగాహనను వివిధ కోణాలనుండి అందిస్తున్నది. మొదటి భాగాన్ని కూర్పుచేసి అందించిన సోదరుడు మధుమోహన్ ఈ ద్వితీయ భాగం కూర్పుచేసే సమయంలోకూడా తగుమాత్రంగా తన సహకారాన్ని అందించాడు. అతనికి నా కృతజ్ఞతలు.

నాటి పురాణేతిహాసాలనుండి, నేటి సామాజిక స్థితిగతుల వరకు అనేకమైన అంశాలు ఈ గ్రంథంలో చోటుచేసుకున్నాయి. తెల్లవారిలేస్తే మనలో మెదిలే రకరకాల ఆలోచన లెన్నింటికో ఇందులో చక్కని సమన్వయాలున్నాయి. నిత్యజీవితంలో ఎదురయ్యే అనేకానేక సన్నివేశాలను నిండుగా, తృప్తిగా నిర్వహించడమెలాగో ఈ గ్రంథం చక్కగా నేర్పుతుంది. అర్థవంతంగా, అనుభూతిప్రదంగా జీవితాన్ని గడపదలిచే వారందరికీ ఈ గ్రంథం ఒక దిక్సూచి అవుతుంది. కూర్పరిగా పనిచేస్తున్న వేళ ఈ గ్రంథాన్ని గూర్చి నేను పొందిన అనుభూతి ఇది. గ్రంథం ఆసాంతం చదివిన తర్వాత మీరూ ఇలాంటి అనుభూతినే పొందుతారన్నది నా విశ్వాసం.

వసిష్ఠుని ముహూర్తంతో ప్రారంభమై, రామాయణం రాయతీల వరకు సాగే ఈ గ్రంథంలో మొత్తం ముప్పై రెండు సన్నివేశాలున్నాయి. ఈ ముప్పైరెండు సన్నివేశాలలోనూ కొన్ని మన మనస్సును వికసింప చేస్తాయి. కొన్ని మన హృదయాన్ని పరవశింప చేస్తాయి. కొన్ని మన మనస్సునూ హృదయం వైపుకు మళ్ళిస్తూ మనకు మైమరపును కలిగిస్తాయి.

కొన్ని పులకింతలు కలిగిస్తే, కొన్ని గిలిగింతలు పెడతాయి. కొన్ని మనలను ఆలోచింపచేస్తే, కొన్ని మనసు ఆర్ద్రమైన స్థితిలోనికి తీసుకు వెళతాయి. కొన్ని మనను నవ్విస్తే, మరికొన్ని మనను కవ్విస్తాయి. అన్నీ కలసి మనసు ఆనందింపచేస్తాయి. ఆచరణశీలురుగా మనలను తీర్చిదిద్దు తాయి. అలాంటి ఈ ముత్యాల సరాన్ని గురుపూజల శుభవేళలో మీకు అందించే అదృష్టాన్ని అనుగ్రహించు స్వామి. స్వీకరించండి. అవశ్యం ధరించండి. అమూల్యమైన ఈ ఘట్టాలను ఇక అవధరించండి.

22-4-90 మంత్రి.

హైదరాబాదు.

వసిష్ఠుని ముహూర్తం

"మాస్టరుగారూ! నాకొక అనుమానం. మీరు నివృత్తి చేయాలి దానిని" అన్నారొక పెద్దాయన. దూరప్రాంతం నుండి వచ్చినవారు మంచి జిజ్ఞాసువులు.

"ఏమిటో చెప్పండి" అన్నారు స్వామి.

"రామాయణంలో ఇంతకూ వసిష్ఠుడు చేసింది ఏమిటీ అని? పుత్రకామేష్టి చూద్దామా, ఋష్యశృంగుని పిలిపించి చేయించాడు. అస్త్ర విద్యలందామా రాముణ్ణికోరి తీసుకొని వెళ్లి విశ్వామిత్రు డందించాడు. రామాయణగాథ చూద్దామా.... వాల్మీకి మహర్షి వర్ణించి చెప్పాడు. ఇక వసిష్ఠుడు చేసింది రాముని పట్టాభిషేకానికి ముహూర్తం పెట్టడం. అది ఎలాగూ అప్పుడు జరగనేలేదు. పట్టాభిషేకం మాట అలా ఉంచి అదే ముహూర్తానికి అరణ్యాలు పట్టాడు. ఇక అతని బ్రహ్మర్షిత్వం నిరూపణ మయింది ఎక్కడ? ఒక్క విశ్వామిత్రుణ్ణి సైన్యంతో సహా బ్రహ్మదండంతో నిరోధించ గల్గినపుడు మాత్రం నిరూపణ అయింది. అంతకంటే ఇంకేమీ కనబడటం లేదు. ఇంతేనా? ఇంకేమైనా ఉందంటారా? అన్నట్లు ప్రశ్నార్ధ కంగా చూస్తున్నారా పెద్దాయన.

చిరునవ్వు నవ్వుతూ స్వామి ఇలా అన్నారు: విశ్వామిత్రుణ్ణి నిరోధించినపుడే కాదు, ఆపైన ఆయనపై విరోధించి తపస్సుచేసి ఉద్దండుడై నిలిచిన విశ్వామిత్రుణ్ణి బ్రహ్మర్షిగా గౌరవించి ప్రస్తుతించినవేళ వసిష్ఠుని బ్రహ్మర్షిత్వం మరింత వ్యక్తమైంది. అంతటితో ఆగక రామలక్ష్మణులను అతనితో పంపమని దశరథుని ఆజ్ఞాపించినవేళ వసిష్ఠుని విశిష్టత ఏమిటో

మనకింకా బోధపడుతుంది. అంతకుముందు ఘట్టమైన పుత్రకామేష్టిలో ఋష్యశృంగునికి పెద్ద పీటవేయడం వసిష్ఠుని విశాల హృదయానికి నిదర్శనం. పనిని చేయగలగడం ఎంత విశేషమో, ఆ పనిని చేయగలిగిన వాడు సమర్థులైన తన తోడివారికి ఆ పనిని పంచిపెట్టగలగటం మరింత విశేషం. వసిష్ఠుని బ్రహ్మర్షిత్వానికి ఇది ఒక నిదర్శనం.

ఇక పట్టాభిషేక ముహూర్తం సంగతి. ఇది ఇలా జరుగుతుంది అన్న అంశం సర్వాంతర్యామియైన భగవంతుడు తెలియనిస్తేనే ఋషులకైనా తెలిసేది. తెలియటం లోకానికవసరం అన్నప్పుడు మాత్రమే ఆయన తెలియనిస్తాడు. అవసరంలేదు అన్నప్పుడు తెలియనివ్వడు. భగవద్గీతలో "మత్తః స్మృతిః జ్ఞానమపోహనంచ" అన్న వాక్యానికి అర్థమిదే. "నీకు తట్టడం అన్నా నేనే, నీకు తట్టక పోవడమన్నా నేనే" అని అంటున్నాడాయన. ఏమంటారు ?

మనం టి.వి పెడతాం. కరెంటు ఉన్నది. టి.వి. కండిషన్‌లో ఉన్నది. అవతలనుండి ప్రోగ్రాం మాత్రం ట్రాన్స్‌మిట్ కావడంలేదు. అపుడు మీకేం కనబడుతుంది. ఏమీ కనబడదు. అదే 'ప్రోగ్రాం' 'ట్రాన్స్ మిట్' అవుతోంది అనుకోండి ! అప్పుడు మీకంతా కనబడుతుంది. ఋషుల శరీరాలు అలా కండిషన్‌లో ఉన్న టి.వి. సెట్లలాంటివి. సర్వాంతర్యామి ట్రాన్స్‌మిట్ చేయదల్చుకుంటే వారి ద్వారా అది లోకానికందుతుంది. లేదా ! అందే ప్రసక్తిలేదు. ఈ సత్యాన్నే ధర్మరాజుకి వివరించి చెబుతూ భీష్ముడు భాగవతంలో అంటాడు. 'అడగి మెలగుచుందు రంధులగుచు' అని, ఋషులు, మహనీయులు అయిన వారు సైతం సర్వాంతర్యామి యొక్క సంకల్పానికి అలా అణగి మణిగి ఒదిగి పని చేయవలసిందే. కనుక సర్వాంతర్యామి అందించదలుచుకుంటే అందిపుచ్చుకోవడానికి

పనికి వచ్చేది బ్రహ్మర్షిత్వం. బ్రహ్మర్షిత్వం ఉన్నది సర్వాంతర్యామి ఆదేశాన్ని అనుసరించడానికే గాని, ఆ సర్వాంతర్యామిని ఆజ్ఞాపించడానికి మాత్రంకాదు. తామనుకొన్న పని కానపుడు చుట్టుప్రక్కలవారు ఏమను కుంటున్నారని ఆ బ్రహ్మర్షులు క్రిందకు చూడరు. ఇంతకు 'ఆయన' సంకల్పం ఏమై ఉంటుంది అని వారు పైకి చూస్తారు. తామన్నది జరుగ లేదే అని అవమానాన్ని ఫీల్ కారు. ఆయన లీల ఏమిటా అని అవగాహన చేసుకోవడానికై యత్నిస్తారు. పరువు-ప్రతిష్ఠలు ఇవి అన్నీ సామాన్య మానవులకు సంబంధించినవి. ఈశ్వరేచ్ఛకు అనుగుణంగా సాగిపోవాలన్నదే బ్రహ్మర్షుల అభిమతం. వారు కోరుకునేది అదే. వారు మనకు నచ్చచెప్పేదీ అదే! ఏమంటారు ?

"అనటానికి ఇంకా ఏమైనా మిగిలి ఉంటే కదా! నా అనుమానం నిశ్శేషంగా నివృత్తయింది. అలా నివృత్తి చేయగల్గడమే మీలోని విశేషం," అన్నారా పెద్దాయన.

"ఊహూ! నాలోని విశేషంకాదు. నానుండి వ్యక్తమవుతున్న విశేషం" అన్నారు స్వామి.

"ఆ! ఆ! అమ్మో! మీరేమాత్రం పట్టాలు తప్పనివ్వరుగా!" అంటూ ఆ పెద్దాయన బండికి వేళయిందని సెలవు పుచ్చుకున్నారు.

కాళ్లను కడిగే వేళలో

అతడిని చూస్తే నాకు చాలా బాధ వేస్తోంది. అతడిని ఎలాగైనా దారిలోకి తీసుకురావాలి. అతను మళ్లీ మనిషి కావాలి. బాగుపడాలి.

అతడిని బాగుచేయడానికి నీకున్న అర్హత ఏమిటి ? అంటే నేను చెప్పలేను. నీవు లోపాలకు అతీతుడవా....అంటే నేను ఒప్పుకోలేను. నాలోను ఏవో లోపాలు ఉండి ఉండవచ్చును. ఉండవచ్చు ఏమిటి.... ఉన్నాయి. వాటిని నేను గ్రహించకపోలేదు. కానీ అతడు బాగుపడాలి.

నా కనిపిస్తూ ఉంటుంది. మనం పూర్తిగా బాగుపడిపోయామా ఏమిటి, అతడు బాగుపడాలి, అతడిని బాగుచేయాలీ అని అంటున్నాం అని.

కానీ ఏకో ఆరాటం. అతను మళ్లీ దారిన పడాలని. వ్యసనాల కతీతుడు కావాలని. అతని తెలివితేటలు సద్వినియోగం కావాలని. నలుగురి చేత చిన్నచూపు చూడబడే స్థితినుండి అతను బయటపడాలని.

అంటూ ఎదురుగా కూర్చున్న మిత్రుడు పడుతున్న ఆరాటాన్ని అర్థం చేసుకున్న స్వామి ఇలా అన్నారు :

'మీకో చిన్న ఉదాహరణ చెప్తాను. బురదలో నడిచి వచ్చినపుడు కాళ్ల కడుక్కుంటాం. ఆ కడిగేటప్పుడు ఏం చేస్తాం. ఈ కాలుతో ఆ కాలును కడుగుతాం. ఆ కాలుతో ఈ కాలును కడుగుతాం. అంటే ఏం జరుగు తోంది. రెండు కాళ్లూ ఒక కాలి బురదను ఒకటి పోగొడుతున్నాయి. ఇద్దరి మనుష్యుల మధ్య కూడా జరిగేదదే. కనుక ఒక వ్యక్తి మరొక వ్యక్తిని బాగుచేయాలీ అంటే అతడు పరిపూర్ణుడై ఉండనక్కరలేదు. సహృదయుడై ఉండగలిగితే చాలు. ఇద్దరు మనుషులు కలిసి నడిచేటప్పుడు ఒకరివల్ల

ఒకరు ఎదుగుతారు. ఒకరివల్ల ఒకరు బాగుపడతారు. ఇది సత్యం. సృష్టిలో నిత్యమూ జరుగుతున్నదిదే !

మనము తల్లి బిడ్డను పెంచుతోంది అంటాం. నేనంటానుకదా.... బిడ్డ తల్లిని పెంచుతోంది అదే సమయంలో అని. తల్లి బిడ్డను భౌతికంగా పెంచుతుంది. బిడ్డ తల్లిని మానసికంగా పెంచుతుంది. మామూలుగా ఉన్న మనిషిని తల్లిగా రూపుదిద్దుతుంది. చూడండి ! ఈ సత్యాన్ని గమనిస్తూ బ్రతికితే ఆ తల్లికి ఎంత బావుంటుంది.

అలాగే చెడిపోయిన మీ మిత్రుని బాగుపడేలా చేయాలని మీరు చూస్తున్నారు. బాగా ఉన్న మిమ్మల్ని ఎప్పటికీ చెడిపోకుండా అతను చేస్తున్నాడు. వ్యసనపరుడైన మనిషి ఏ స్థితికి దిగజారిపోతాడో అతని విషయంలో దగ్గరగా చూస్తున్న మీరు ఇంకెప్పటికీ వ్యసనపరులు కాలేరు కదా! ఆ మేరకు కావలసిన హెచ్చరిక అతని జీవితంనుండి మీ కందుతోంది. ఎలా ఉంటే జీవితం సద్వినియోగ మవుతుంది అన్న ఆదర్శం మీ జీవితం నుండి అతని కందుతుంది. ఇలా ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకుంటూ ఉండగా కథ ముందుకు సాగుతోంది. ఇదే నేను చెప్పిన ఉదాహరణలోని అంతరార్థం. ఏమంటారు ?

ఆ మిత్రుడు తృప్తిగా చూశారు స్వామివైపు. "నాకిప్పుడు ధైర్య మొచ్చిందండీ. అసలు ఆ ధైర్యం కోసమే నేనిక్కడకు వచ్చింది. ఈ ధైర్యం అన్నిచోట్లా దొరుకుతుందిటండీ! చూశారూ నా దృష్టిలో ధైర్యం దొరికేచోటు దొరికినవాడు నిజంగా అదృష్టవంతుడు.

ఇక నేను మిత్రుణ్ణి వారికి తెచ్చేందుకు రంగంలోకి దిగుతాను మరి. ఆ కథలో మీదే ప్రధానమైనపాత్ర. అతణ్ణి వినేట్టుగాచేసి మీ దగ్గరకు తీసుకురావటం నా వంతు. అతణ్ణి సరిచేసి మనిషిగా మనవలసిందని

ఆశీర్వదించడం మీ వంతు" అంటూ ఆ మిత్రుడు కథ దారికి వచ్చినంతగా తృప్తిపడుతూ స్వామిపైపు చూశారు.

నిజమేగా మరి. కథ వారికిరావడం అప్పుడే మొదలు పెట్టింది కదా !

మీవాళ్ళే మళ్ళీ

ఐదు వేల వరకూ నెలజీతం వస్తూఉంటుంది. అయితేమాత్రం ఏం లాభం ! ఈ ఉద్యోగానికి సరిపడా స్టేటస్ అదీ మెయిన్‌టైన్ చేయడానికే ఆ జీతం సరిపోతుంది. అంతజీతం అన్నమాటే తప్ప నెలాఖరున మిగిలేది ఏం ఉండదు. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్ళిచేయాల్సి ఉంది. ఇద్దరూ ఎదిగి వున్నారు. మీకు తెలుసుకదా ! మాలో కట్నాలు ఎలా ఉంటాయో? తలుచుకుంటేనే భయంవేస్తుంది. జీతంలో మిగిలేదిలేదు. స్థిరాస్థులా ఏమీ లేవు. కట్నాలా రోజురోజుకు లక్షలకు లక్షలు పెరిగిపోతున్నాయి. మాలో పొలాలలో వ్యాపారాలలో ఉన్నవాళ్ళే ఎక్కువమంది వుంటారు. వాళ్ళకి కట్నాలను తట్టుకోవటం ఏమంత కష్టంగా అన్పించడంలేదు. ఎటొచ్చీ మాలాంటి ఉద్యోగస్థులే ఎటూగాకుండా పోతున్నారు. ఏం చేయాలో ఏమిటో ? ఏమీ అంతుపట్టడంలేదు. భవిష్యత్తుపైపు చూస్తుంటే భయం వేస్తోంది మాస్టారూ ! అంటూ దిగాలుగా చూస్తున్నాడాయన. దాదాపు యాభై ఏళ్ళుంటాయి. అది విశాఖపట్నం బస్‌స్టాండ్ అన్న విషయంకూడా ఆయన స్పృహలో ఉన్నట్లులేదు.

ఆయన ఒక బస్సు ఎక్కవలసి వుంది. స్వామిబృందం మరొక బస్సు ఎక్కవలసి వుంది. ఏ బస్సూ ఇంకా రాలేదు. సన్నివేశానికి అంతరాయం కల్గించడం ఎందుకూ అని ఆలస్యం చేస్తున్నట్లున్నాయి

పాపం. లేవా అవి సహజంగా చేసే ఆలస్యం ఇక్కడ ఇప్పుడు ఇలా సద్వినియోగం అవుతోందని చెప్పవచ్చును. కురుక్షేత్రంలో రెండు సేనలకు మధ్యలో అర్జునుడికి ఆనాడు కృష్ణుడు గీతను ఎలా ఉపదేశించాడో ఏమో గాని ఇప్పుడీ సన్నివేశం మాత్రం ఈ ఘట్టాన్ని తలపిస్తోంది. కిటకిటలాడు తున్నది బస్టాండ్. బస్సులకొద, మనుష్యుల సొద ఎవరికి ఎవ్వరూ పట్టని స్థితి. ఎవరిగోల వారిది. ఆ మధ్యలో ఈ సన్నివేశం. 'మాష్టారుగారూ! నాకేది దారి' అంటున్నాడాయన.

స్వామి ఇలా అన్నారు: మీ వేదన నాకర్థమైంది. ఈ కథకి మూలం దొరకాలన్నా, ఈ సమస్యకు పరిష్కారం కావాలన్నా మనం కొంచెం వెనక్కు వెళ్ళాలి. అసలు ముద్దుముచ్చటలుగా ఉండే కట్నకానుకలను ఒక ప్రత్యేకమైన అంశంగా, ప్రతిష్ఠకు ఒక కొలబద్దగా రూపొందించింది మీ వాళ్ళే. మీ వాళ్ళు వరకట్నాన్ని ఆనాటికానాటికి పైకెత్తుతూ సాగేటప్పటికి సమాజంలోని మిగిలినవాళ్ళు కూడా మిమ్మల్ని అనుసరించసాగారు. అనుసరించి, అనుసరించి వరకట్నాన్నొక సమస్యగా, మానవ సమాజం పాలిటి ఒక భయంకర శాపంగా రూపొందించుకున్నారు. ఇవాళ సమాజంలో అందరికీ ఇది ఒక సమస్యై కూర్చుంది. పరిష్కారం మాత్రం ఎవరికీ తట్టడంలేదు. దాంపత్యానికి దేహాలమధ్య శ్రుతి కుదరడం ముఖ్యం. మనస్సుల మధ్య శృతికుదరటం అంతకంటె ముఖ్యం. ప్రధానమయిన ఈ రెండంశాలనీ వదలి ధనానికి పెద్ద పీట వేస్తున్నారూ అంటే, ఈ అవివేకాన్ని ఏమనాలి.

నాకొక్కటే తడుతోంది. ముద్దుముచ్చటలుగా మాత్రమే సాగుతూ వస్తున్న వరకట్న విషయాన్ని ఈ రూపానికి తెచ్చింది మీవాళ్ళే. ఇప్పుడు పరిష్కారం చూపవలసింది కూడా మీవాళ్ళే. మీవాళ్ళే పూనుకొని కట్న ప్రసక్తి లేకుండా వివాహం చేసుకోవడం అనేదాన్ని ఒక ఫాషన్‌గా

రూపొందించాలి. అప్పుడు సమాజంలోని మిగిలినవాళ్ళు కూడా మళ్ళీ మిమ్మల్ని అనుసరిస్తారు. ఏమంటారు ?

ఇది జరిగేదేనా అనుకోకండి. చరిత్ర గమనించినవారికి కాదేదీ అసాధ్యమని తెలుస్తుంది. ఒకప్పుడు కన్యాశుల్కం సమస్య అయింది. అదిపోయి వరకట్నం ఒక సమస్యగా రూపొందింది. ఇప్పుడు ఇదిలేని స్థితి మాత్రం మనం ఎందుకు రూపొందించుకోకూడదు. రూపొందించు కోకపోతే కొన్నాళ్ళలో వరకట్నాలు పోయి మళ్ళీ కన్యాశుల్కాలు వస్తాయి.

ఇలా అంటున్నారేమిటి అనుకోకండి. ఇవాళ మనం ఏం చేస్తున్నాం. మన సృష్టి, మానవ సృష్టి అయిన వరకట్న సమస్యకు దడిసి దైవ సృష్టిని కించపరుస్తున్నాం. మనని మనం సరిదిద్దుకోవలసిందిపోయి దైవాన్ని తప్పు పడుతున్నాం. ఆడపిల్లలు పుట్టకూడదు అనుకుంటున్నాం. పుడితే దీనంగా ముఖం పెడుతున్నాం. మైనస్ పుట్టిందంటున్నాం. పుట్టిన తర్వాత బాధ పడటం ఎందుకని మనలో కొందరు స్కానింగ్ మొదలయిన ఆధునిక సౌకర్యాల ద్వారా పుట్టబోతున్నదెవరో తెలుసుకుని, ఆ పుట్టబోయేది ఆడపిల్లే అయితే అప్పుడే అబార్షన్ చేయించేసుకుంటున్నారు. ఎంత దారుణం. ఇలా అయితే కొన్నాళ్ళలో ఏమవుతుంది ? ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతుంది. మగపిల్లల సంఖ్య పెరిగిపోతుంది. మగపిల్లలు మళ్ళీ కన్యాశుల్కమిచ్చి ఆడపిల్లల్ని తప్పకుండా కొనుక్కోవలసి వస్తుంది. ఏమంటారు ?

అందుకే నేనంటున్నది.... మీవాళ్ళే పూనుకొని వరకట్నం లేకుండా వివాహం చేసుకోవడమన్నది ఒక ఫాషన్‌గా రూపొందించాలి. సమాజం దాన్ని అనుసరించాలి. మీ సమస్య అనటంకన్నా ఇది అందరి సమస్య అలాంటి ఈ సమస్యకు పరిష్కారమిదే. ఆత్మవిశ్వాసం కలిగి

ఉన్ననాడు మనం సాధించలేనిదిలేదు. ఎవరికివారు వంటరిగా ఎదుర్కోవ డానికి ప్రయత్నించి అలసిపోవడంకన్నా నలుగురూ చేతులు కలపగలిగిన నాడు అసలేదీ సమస్యకాదు. సతీసహగమనం లాంటి సమస్యలకే కాలం చెల్లిపోయింది. ఇవి మాత్రం ఉంటాయంటారా, మనం గట్టిగా తలుచుకోక గాని.

స్వామి సూటిగా ఆయనలోనికి చూస్తున్నారు. ఆ చూపులు ఆయన లోని ఆత్మవిశ్వాసాన్ని రగుల్కొల్పుతున్నట్లున్నాయి. ఆయనకు తెలియ కుండానే ఆయన నిటారుగా నిలబడుతున్నాడు.

స్వామివైపు కృతజ్ఞతను కురిపించే కన్నులతో చూస్తూ ఇలా అన్నాడాయన. 'మీరన్నది జరుగుతుంది మాస్టారూ! సమాజాన్ని నిజస్థితి లోనికి మేల్కొలిపి నడపగల మీలాంటివాళ్ళున్నప్పుడు ఎందుకు జరగదు. తప్పక జరుగుతుంది, సమాజం కూడా మార్పును కోరుతోంది. ఆ మార్పును తెచ్చుకోవటానికి కావలసిన ధైర్యం మీవంటివాళ్ళ నుండి అది అందుకున్నవేళ తప్పకుండా రావలసిన మార్పు వస్తుంది. రావలసిన మార్పు వస్తుంది.

మార్పు వస్తుంది. మార్పు వస్తున్నది. అన్నదానికి సూచనగా ఎక్కవలసిన బస్సులు అంతలో అక్కడకు చేరుకుంటున్నాయి. అతడి నుండి వీడ్కోలు నందుకొని స్వామి ముందుకుసాగారు.

పెళ్ళివారి ప్రయాణం

విశాఖలోని మన కార్యాలయంలో ఒకరోజు రాత్రి ప్రవచనం తరువాత సోదరులు కొందరు స్వామితో ముచ్చటిస్తూ కూర్చున్నారు.

సంభాషణల మధ్యలో ఒకతనిలా అడిగాడు. "మాష్టరుగారూ! దివ్య జీవనాన్ని గడపటానికి మీరు సూచిస్తున్న మార్గం ఎంతో సూటిగా వున్నది. సులువుగా బోధపడుతోంది కూడా. మార్గదర్శిగా మీ వంతు కర్తవ్యాన్ని మీరెంతో బాధ్యతతో నిర్వహిస్తున్నారు. కానీ ఈ మార్గం, ఈ విధానం ప్రతి ఒక్కరికీ అందాలీ అంటే ఎంతకాలం పడుతుంది! అసలదెలా సాధ్యపడుతుంది? అని అనిపిస్తూ ఉంటుంది. అందరికీ అందడం అసాధ్యంగా గోచరిస్తున్నప్పుడు మరి మీలాంటివాళ్ళు చేస్తున్న కృషంతా ఊరికే వృథా అయిపోతున్నట్లే కదా!"

అతని గొంతులో ఒక విధమైన బాధ ధ్వనిస్తోంది. స్వామి చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నారు: "మీ బాధ నాకు అర్థమయింది. మనం చెబుతున్న ఈ దివ్య జీవన విధానం ఈ కొద్దిమందికే అందుతోంది. ఈ విధంగా సాగితే మనం ఆశించిన జాతి పునర్నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుంది అన్నది నీ బాధ. కలుగవలసిన తపనే ఇది. కానీ కంగారు పడవలసిన పనిలేదు. ఒక పదేళ్ళక్రితం పల్లెటూళ్ళ నొకసారి గుర్తు తెచ్చుకో. ఏ పెళ్ళికో తరలి వెళ్ళాలంటే అప్పుడేం చేసేవారు? వరుసగా పదులకొద్దీ ఎడ్లబండ్లు గూళ్ళుకట్టి ప్రయాణానికి సిద్ధం చేసేవారు. పెళ్ళి వారంతా ఆ బళ్ళమీద బృందాలు, బృందాలుగా ముచ్చటలు చెప్పుకుంటూ బయలుదేరేవారు. ఒక రాత్రివేళ బళ్ళన్నీ కలసి కదిలేవి. ఒకదానివెంట ఒకటి సాగిపోయేవి. అందులో మొదటి బండిని నడిపేవానికి మాత్రమే పెళ్ళి జరిగే గ్రామానికి దారి తెలిసేది. మిగిలిన బళ్ళన్నీ ఆ బండిని అనుకరిస్తూ సాగిపోవడమే. చూశావా! ఇక్కడ దారి తెలిసింది, ఆ

ముందు బండివానికి మాత్రమే. మిగిలిన బళ్ళను నడిపేవారికి గానీ, ఆ బళ్ళల్లో కూర్చుని కబుర్లు చెప్పుకునే వారికిగానీ, పెళ్ళి జరిగే ఊరికి దారి తెలియదు. తెలియకపోయినా వాళ్ళకేం ఇబ్బందిలేదు. దారి తెలిసినవాడు ముందుండి నడుపుతున్నాడు గదా! అది చాలు! అలాగే ఇప్పుడు కూడా అలా దారితెలిసి నడుపగలిగిన వాళ్ళని తగిన సంఖ్యలో మనం రూపొందించాలి. ఇక చాలు. వాళ్ళవెంట సాగిపోతుంది. ఏమంటావ్! ఆ దారి తెలిసి నడుపగలిగిన వాళ్ళను సృష్టించడానికే ఈ ప్రయత్నమంతా.

ఆ అడిగిన యువకుడు స్వామివైపు అలాచూస్తూ ఉండిపోయాడు కొంతసేపు. 'ఎంతో తపనపడి అడిగిన ప్రశ్నకు ఇంతలో ఎంతగా సమన్వయించి సత్యదర్శనం అందించారు మీరు.' అన్నట్లు చూస్తున్నాడతను. 'ఆ దారి తెలిసి నడిపే వాళ్ళల్లో నన్నూ ఒకనిగా స్వీకరించండి.' అంటూ ఆ చూపులతో అడుగుతున్నాడు.

అలాగే అన్నట్లు స్ఫూర్తిమంతంగా చూస్తున్నారు స్వామి.

ఎంత బూటకం

ఆనాటి ఉదయం డిస్పెన్సరీ చివరికి వచ్చినట్లుగా ఉంది. క్రొత్తగా వచ్చిన కేసు ఒకటి చూస్తున్నారు స్వామి. ఆ పరిశీలనలో ఉండగా ఆ వ్యాధిగ్రస్తుడైన యువకుడు ఇలా చెప్పాడు : రెండేళ్ళక్రితం మా తండ్రిగారు పోయారు. ఆ తర్వాతనుండి ఈ అనారోగ్యం ప్రారంభమయింది.

స్వామి ఇలా అడిగారు. మీ తండ్రిగారు పోయినపుడు మీరు బాధపడ్డారా? భయపడ్డారా?

అతడు కొంచెం నివ్వెరపోయాడు. "బాధతోపాటుగా భయం కూడా

పడ్డాను. ఆయన పడుకునే గది మా గదికి ప్రక్కనే. పోయిన తర్వాత ఆ గదిలో ఆయన తారాడుతున్నట్లయ్యేది. దానితో భయం వేసేది."

"భయమెందుకు ? ఆ తారట్లాడేది మీ నాన్నగారే కదా !" అన్నారు స్వామి.

అదేమిటండీ అలా అంటారన్నట్లు చూశాడు అతను.

"ఏమిటోయ్ అలా చూస్తావు. శరీరం విడిచిపెట్టినంత మాత్రంచేత మీ నాన్నను చూసి మీరు భయపడాల్సినంత పనేముంది? మీ నాన్న మీ నాన్న కాడా ? ఇప్పటిదాకా నాన్నగా ఉండి మీకు కావాల్సినవన్నీ చూశాడు కదా ! అంతలోనే మీరుచూసి భయపడి దయ్యమనవచ్చా ? బ్రతికున్నప్పుడు నాన్ననూ, పోగానే దయ్యమా ? బావుందయ్యా మన ప్రేమ. చాలా గొప్పగా ఉంది. తారట్లాడుతున్నాడు అంటావ్. శరీరం లేనివాడు తారట్లాడక ఏం చేస్తాడు ? నిన్నొక్కడ్నే అంటున్నాననుకోమాక ! మన వాళ్ళందరి నమ్మకాన్ని దృష్టిలో పెట్టుకునే అంటున్నాను. బ్రతికున్నప్పుడేమో మా తల్లీ, మా తండ్రీ, మా అన్న, మా తమ్ముడు, నా భార్య, నా బిడ్డ అని కౌగలించుకుంటారా, పోంగానేనేమో భయపడిపోయి ఎగిరిగెంతి తాయత్తులు కట్టించుకొస్తారా ? ఇవన్నీ చూస్తుంటే ఈ ప్రేమలన్నీ ఎంత బూటక మనిపిస్తుంది నాకు. ఎంత అమానుషమయ్యా ఇది ? ఆ పోయినవాళ్ళపట్ల ఎంత అవమానకరం మన ప్రవర్తన. ఆలోచించు, నువ్వేకాదు మనందరం కలిసి ఆలోచించాల్సిన అంశమే ఇది.

మొత్తంమీద బలే టాపిక్ తీసుకొచ్చావయ్యా ! ఇంతకూ....వ్యాధి అక్కడనుండి ప్రారంభమైనదంటావ్" అంటూ కేస్‌షీటు పేజీలను త్రిప్పి చూడసాగారు స్వామి.

నుదిటివ్రాత

ఉదయం డిస్పెన్సరీ కొంతవరకు నడిచింది. మధ్యలో విరామం లాంటి సమయమది. ఎదురుగా కూర్చుని మందు వ్రాయించుకుంటున్న ఆమె, పేషెంట్ మాత్రమేగాక సోదర బృందంలో ఒకరు. కుర్చీలో వెనక్కి జరిగి రిలాక్స్ అవుతున్న మాష్టరుగారిని చూస్తూ తన పరిస్థితిని సంక్షిప్తంగా చెప్పడం ప్రారంభించిందామె. ఇల్లూ, భర్తా బిడ్డలూ, అయిన వారు, కానివారూ ఇందరి మధ్యలో గల తన జీవితాన్ని ఊహించుకుంటూ ఒక నిట్టూర్పు విడిచిందామె. ఆమె ముఖంలో అలసట కనబడుతోంది.

"ఎందుకలా ఇదైపోతావ్ ? 'బి స్పోర్టివ్' " అన్నారు స్వామి.

"ఏమి స్పోర్టివ్ మాస్టరుగారు ! ఈ నుదుటివ్రాత ఎలాఉంటే అలా జరుగక తప్పదుకదా !" అన్నది ఆమె.

సూటిగా చూస్తూ ఇలా అన్నారు స్వామి : నీవన్నది తప్పు. నుదుటి వ్రాత జరిగి తీరాలనిలేదు. ఆ వ్రాత నీ చేతనుబట్టే ఉంటుంది. నీచేత నీ చేతిలోనే ఉంది. మన సంప్రదాయంలో రెండు విశ్వాసాలున్నాయి. అందులో ఒకటి నిజమైనది. రెండవది కానిది. "శివుని ఆజ్ఞ లేకపోతే చీమైనా కుట్టదు" అంటారు పెద్దలు. అంటే దైవాజ్ఞను అనుసరించే ఈ సృష్టిలో సమస్తమూ జరుగుతాయని. ఇది యదార్థం. 'నుదుటివ్రాత జరుగక తప్పదు' అంటారు. ఇది తప్పు. మనచేత మారుతున్నకొద్దీ మన వ్రాత మారుతుంది. మన వ్రాత మారుతున్నకొద్దీ దైవాజ్ఞ మన శ్రేయస్సుకు అనుగుణంగా లభిస్తుంది. మనచేత వృథాపోదు. మన ప్రయత్నం వృథా కాదు. కనుక వ్రాత ప్రకారం జరుగుతుంది కదా అని మనిషి కూర్చుండి పోకూడదు. ఎలాగూ జరిగేది జరుగుతుంది కదా అని ఇంట్లో కూర్చుంటే మీ వంటింట్లో వంట అవుతుందా ? ఏం ? అక్కడెందుకలా అనుకోవు ? అలా అనుకుంటె వంటకాదని నీకు తెలుసు కనుక. మరి జీవితాన్ని గూర్చి

ఎందుకనుకుంటున్నావు. జరిగేదేదో జరుగుతుందని ? అలా అనుకుంటే బద్ధకించడానికి వీలుంటుంది కనుక, మనది చిత్రమైన దేశం. ఇక్కడ మంచీచెడు రెండూ కలగా పులగంగా చెలామణి అయిపోతూ ఉంటాయ్. దేవుడి ఆజ్ఞ ప్రకారమే అంతా జరుగుతుంది-అన్న వాక్యం ప్రక్కనే, 'ఎలా వ్రాసిపెట్టి ఉంటే, అలా జరుగుతుంది. నుదుటివ్రాతను మార్చగల వాడెవడు ?' అన్న వాక్యం కూడా చేరి చెలామణి అయిపోతూ ఉంటుంది. కనుక విచక్షణా జ్ఞానాన్ని వినియోగించి ఏది పెద్దల వాక్యమో, ఏది కాదో మనం గుర్తించగలగాలి. మనిషిని బద్ధకస్తుని చేసేది, నిర్వీర్యుణ్ణిచేసి కూర్చోపెట్టేది పెద్దల వాక్యమెలా అవుతుంది? కాబట్టి ఇలాంటి డైలాగులు మాను. నీ ప్రయత్నం నీవుచెయ్. ఆ చేయడంలో ఏమరుపాటు చెందవద్దు, అలసత్వాన్ని వరించవద్దు. ఇక ఫలితమంటావా ? అది దైవానికి వదిలి పెట్టు. దైవాజ్ఞను విశ్వసించవలసింది అక్కడే.

"ఏం బోధపడిందా ? మొత్తంమీద బలే వేదాంతం చెప్పావ్. నువ్వేకాదు. ఇటీవల ఈ జాతిలో చాలమంది ఈ వేదాంతం చెబుతున్నారు. మనం దేవాజ్ఞకు కట్టుబడాలి గాని, నుదుటివ్రాతకు కట్టుబడాల్సిన పనిలేదు. నుదుటివ్రాత ఎవరి ఆధీనంలో ఉందో వాడి ఆజ్ఞకు కట్టుబడటమే మనం చేయవలసింది. ఆ ఆజ్ఞాధికారం గలిగిన దైవం' నిరంతరం కర్మాచరణలో నిమగ్నం కమ్మని మనని ఆదేశిస్తున్నాడు. నిట్టూర్చవలసిన పనిలేదని హెచ్చరిస్తున్నాడు. ఇక పద ! జరుగుతున్న దానిపైపు కాక చేయవలసిన దేమిటో అటువైపు చూడు !

ఆమె కొంచెం కోలుకున్నట్లు కనిపించింది. ఆమెలో కొంత ఆశ్చర్యమూ కనిపించింది. తరతరాల నమ్మకాలపైన గొడ్డలివ్రేటు పడినట్లు అయినదికదా ! మరి కనిపించదా ?

మానసిక భోజనం

సాయంత్రం 6-40 అవుతోంది. ప్రేయరు పూర్తయి తమ గదిలో ప్రశాంతంగా కూర్చొని వున్నారు స్వామి. అవతలగదిలో కాలక్షేపం చేస్తున్న తమ బంధువుకు కబురుపెట్టారు.

పిలుపుకు కారణం ఏమిటా? అన్నట్లు ఆలోచనగా చూస్తూ ప్రవేశించాడతను.

"ఏమిరా! నీవు వచ్చి నాలుగురోజు లైందనుకుంటాను!"

"అవునన్నయ్యా!"

"ఈ నాలుగురోజులు ఇక్కడ జరుగుతున్న కార్యక్రమాలు నీ గమనికకు వచ్చేవుంటాయ్!"

"ఊ!.... గమనిస్తున్నా నన్నయ్యా!"

"ఉదయం సాయంత్రం ప్రేయరులో ఎక్కడెక్కడివారూ వచ్చి పాల్గొంటున్నారు కదా! నీ విక్కడే ఉంటున్నవాడివి. నీవుకూడా వారితో కలిసి పాల్గొంటే ఇంకా బాగుంటుందేమో?"

"నేను మానసికంగానే ప్రార్థన చేస్తుంటా నన్నయ్యా! అందుకని ప్రత్యేకించి ఏ ప్రార్థనా కార్యక్రమాలు పెట్టుకోలేదు!"

"భోజనం కూడా మానసికంగా చేసేస్తే బాగుంటుందేమో? చూడు. అలా చేయటానికి ప్రయత్నించు."

అతడికి నవ్వొచ్చింది. సిగ్గుకూడా వేసింది. కాని సిగ్గు ఎందుకు వేస్తుందో అతనికింకా బోధపడినట్లుగా లేదు. తలను కొద్దిగా వంచుకొని ఏం చేయాలో తెలియక తేలనవ్వు నవ్వుతూ నేలవైపు చూస్తున్నాడు.

స్వామి ఇలా అన్నారు: మన పెద్దలు మనలాగ మానసికంగా ప్రార్థన చేసుకోలేకకాదు, ఇవన్నీ ఏర్పాటు చేసింది. మన తర్వాత వాళ్ళకు కూడా మార్గమందాలి అంటే మనయొక్క స్థాయీ దర్శనాలతో నిమిత్తం

వారింటికి చేరేటప్పటికి వారి గుమ్మంలో నిలబడి "ఏమండీ! మీరింత భక్తులు కదా! మన జాతికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టాం. మీరు కూడా కొంత బాధ్యత స్వీకరించాలి అని అంటే, ఆ భక్తులంటారుగదా, "భలేవారండీ! మా పనులే మేం చేసుకోవడానికి అవకాశంలేక ఆ దేవుడి ముందు ఏకరువు పెట్టి, ఆ పనులు జరిగేటట్లు చూడాల్సిన బాధ్యతను ఆయనకు అప్పగించి మేం వస్తుంటే, మీరేంటండీ మధ్యలో ఈ గోల. దేశం అంటారు, జాతి అంటారు. అవేం వద్దులెండి బాబూ! ఏదో మా బ్రతుకేదో మేం బ్రతగ్గలిగితే అంతేచాలు!" అని జవాబు చెబుతారు.

అంతేగాని దేశం, జాతి బావుంటేనే వాళ్ళ బ్రతుకూ బావుంటుందని వాళ్ళకు తట్టదు. ఈ విధంగా తాము చేయవలసిన పనులను కూడా దేవుడికి అప్పగించి కాలక్షేపం చేసే సోమరులు ఎక్కువ మందిమి మన దేశంలో తయారవుతున్నాం గనుకనే ఇతర దేశాలవాళ్ళు సేవాకార్యక్రమాల పేరిట మన దేశంలోనికి ప్రవేశించి, క్రమంగా దేశాన్ని ఆక్రమించుకోగల్గుతున్నారు.

అయినా మనలో ఎక్కువమందికి చీమ కుట్టినట్లుగానయినా లేదు. లేకపోగా పెద్ద ఎత్తున డబ్బులు చెల్లించి మనంకూడా ఆ వైద్యాలయాల దగ్గర, ఆ విద్యాలయాల దగ్గర 'క్యూ'లు కడుతున్నాం. 'క్యూ'లు కట్టడానికైనా ప్రాణం ఒప్పుతోంది కాని, ఈ క్యూలు కట్టే సమయంలో ఈ పనిని మన జాతికి మనమే ఎందుకు చేసుకోలేం? అన్న ఆలోచన మాత్రం రావడం లేదు. ఈ విధంగా ఆస్తికతగా చెలామణీ అవుతున్న అలసత్వం మనది."

స్వామి కనులు తెరిచే ఉన్నారు కాని, ఆ కనులు బయటికి చూడటంలేదు. లోపలికి చూస్తున్నట్లున్నాయి. జాతి మనస్తత్వం యొక్క అట్టడుగువాకా చొచ్చుకొనిపోయి పరిశీలిస్తున్నట్లున్నాయి. ఆయన దేహం మూర్తీభవించిన జాతిస్వరూపంగా కన్పిస్తుంది.

భక్తుల రద్దీ

"పూజలంటే వస్తారు జనం. అభిషేకాలంటే వస్తారు. యజ్ఞయాగాలంటే వస్తారు. రావడమే కాదు డబ్బులు కూడా దండిగా ఇస్తారు. వారానికి ఒకరోజో, రెండు రోజులో దేవాలయాలకు కోరి మరీ వెళతారు. మరి దేశానికీ, జాతికి పనికివచ్చే పనులకు రమ్మంటే ఎక్కువమంది రారేం? నాకదే ఆశ్చర్యంగా వుంటుంది. ఆస్తికులూ, ఆరాధనా ఇంతగా కన్పిస్తున్న ఈ దేశంలో ఆర్తుల్ని ఆదుకోవాలీ, జాతిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలీ అంటే అంతగా రారేం? మరి వీళ్ళంతా దేవుడి దగ్గరకు వెళ్ళటమెందుకు? క్రతుకాండలెందుకు?" అంటూ ఎదురుగా కూర్చున్న మిత్రుడు వేదనాభరితమైన గొంతుతో అంటున్నాడు.

వినవలసినంతసేపూ విని చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నారు స్వామి: ఒక చిన్న సత్యం చెప్పనా? దేవుడి దగ్గరకు వెళుతున్న వాళ్ళలో ఎక్కువమంది ఎందుకు వెళుతున్నారనుకుంటున్నారు. భక్తితో, శ్రద్ధతో, దేవుడిపైన ప్రేమతోనే ఇంతమంది వెళుతున్నారనుకుంటున్నారా? ఊహూ! వ్యక్తిగతంగానూ, కుటుంబగతంగానూ తాము చేయవలసిన పనులలో ప్రధానమైన వాటినన్నింటిని ఆ దేవుడికి అప్పగించి రావడానికి వెళుతున్నారు. ఈ పనులు మేం చేయకుండానే జరిగేటట్లు చూడాలి. అప్పుడే మీ మహిమ అని చెప్పిరావడానికి వెళుతున్నారు. నీచేత ఊరికే పని చేయించుకోంలే! నువ్వు ఈ పనులన్నీ చేసిపెడితే ఇదిగో ఈ తలపైన వెంట్రుకలన్నీ నీకిస్తాం. ఇదిగో ఇన్ని కొబ్బరికాయలు కొడతాం. కావాలీ అంటే మరొకసారి నీ కళ్యాణం జరిపిస్తాం- అని రకరకాల ఆశలు చూపించి మరీ వస్తున్నారు.

ఎవరైనా మీబోటివాళ్ళొకరు బయలుదేరి ఆ భక్తుల గుడి నుండి

వారింటికి చేరేటప్పటికి వారి గుమ్మంలో నిలబడి "ఏమండీ! మీరింత భక్తులు కదా! మన జాతికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టాం. మీరు కూడా కొంత బాధ్యత స్వీకరించాలి అని అంటే, ఆ భక్తులంటారుగదా, "భలేవారండీ! మా పనులే క్షేమం చేసుకోవడానికి అవకాశంలేక ఆ దేవుడి ముందు ఏకరువు పెట్టి, ఆ పనులు జరిగేటట్లు చూడాల్సిన బాధ్యతను ఆయనకు అప్పగించి క్షేమం వస్తుంటే, మీరేంటండీ మధ్యలో ఈ గోల. దేశం అంటారు, జాతి అంటారు. అవేం వద్దులెండి బాబూ! ఏదో మా బ్రతుకేదో క్షేమం బ్రతగ్గలిగితే అంతేచాలు!" అని జవాబు చెబుతారు.

అంతేగాని దేశం, జాతి బావుంటేనే వాళ్ళ బ్రతుకూ బావుంటుందని వాళ్ళకు తట్టదు. ఈ విధంగా తాము చేయవలసిన పనులను కూడా దేవుడికి అప్పగించి కాలక్షేపం చేసే సోమరులు ఎక్కువ మందిమి మన దేశంలో తయారవుతున్నాం గనుకనే ఇతర దేశాలవాళ్ళు సేవాకార్యక్రమాల పేరిట మన దేశంలోనికి ప్రవేశించి, క్రమంగా దేశాన్ని ఆక్రమించుకోగల్గుతున్నారు.

అయినా మనలో ఎక్కువమందికి చీమ కుట్టినట్లుగానయినా లేదు. లేకపోగా పెద్ద ఎత్తున డబ్బులు చెల్లించి మనంకూడా ఆ వైద్యాలయాల దగ్గర, ఆ విద్యాలయాల దగ్గర 'క్యూ'లు కడుతున్నాం. 'క్యూ'లు కట్టడానికైనా ప్రాణం ఒప్పుతోంది కాని, ఈ క్యూలు కట్టే సమయంలో ఈ పనిని మన జాతికి మనమే ఎందుకు చేసుకోలేం? అన్న ఆలోచన మాత్రం రావడం లేదు. ఈ విధంగా ఆస్తికతగా చెలామణి అవుతున్న అలసత్వం మనది."

స్వామి కనులు తెరిచే ఉన్నారు కాని, ఆ కనులు బయటికి చూడటంలేదు. లోపలికి చూస్తున్నట్లున్నాయి. జాతి మనస్తత్వం యొక్క అట్టడుగువాకా చొచ్చుకొనిపోయి పరిశీలిస్తున్నట్లున్నాయి. ఆయన దేహం మూర్తీభవించిన జాతిస్వరూపంగా కన్పిస్తుంది.

"సత్యాన్ని సున్నితంగా చెప్పారు మీరు. సూటిదనం, సున్నితత్వం మీ వాక్కుకు సహజమైన అలంకారాలు" అన్నాడతడు.

'అలంకారాలు సరే, అసలు విషయాన్ని మనమిపుడు చూడవలసింది. ఈ వాక్కును మెచ్చుకునేవారు కాదు ఇప్పుడు కావల్సింది. తమ జీవితాలను మలచుకునేవారు కావాలి. ఈ జాతి అలసత్వం అనే పెనునిద్దర నుండి లేవాలి. అప్పుడే ఈ నా వాక్కుకు సార్థకత. అపుడే ఈ నా మనసుకు సంతృప్తి. బాధ్యతలను దేవుడికి అప్పగించే స్థితినుండి దేవుడిపేరిట ఈ ప్రపచం యెడల బాధ్యత పడే స్థితికి నా జాతి ఎదగాలి."

"మీలాంటి పెద్దల కృషి వృథా పోతుందంటారా?" అన్నాడు మిత్రుడు. విశ్వాసం అతని ముఖంలో తొణికిసలాడుతోంది.

"వృథా పోదు. వృథా పోవడంలేదు. కానీ మరింత సద్వినియోగం కావలసిన అవసరం మాత్రం వుంది. జాతి తమతో తిరుగాడుతున్న పెద్దలను సద్వినియోగం చేసుకోవడంలో ఇంకా శ్రద్ధ పెట్టవలసి వుంది. వర్షాకాలాన్ని వ్యవసాయదారుడు సద్వినియోగం చేసుకున్నట్లుగా, లేకపోతే కాలం వెళ్ళిపోతుంది. వ్యవసాయదారుడూ వెళ్ళిపోతాడు. మళ్ళీ ఆ కాలం రావాలీ అంటే జాతి ఆలోచించుకోవాలి. చిత్రం, జాతియొక్క అలసత్వమే పెద్దలను సద్వినియోగం చేసుకోవడంలో కూడా తీవ్రంగా అడ్డుపడుతోంది. ముందు అలసత్వం అక్కడ వదలాలి. అపుడు మిగతావన్నీ అవే వదిలి పోతాయి. శ్రీకృష్ణుడు "శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" అన్న మాటకు అర్థం ఇదే. జాతి అశ్రద్ధ నుండి ఆ శ్రద్ధలోనికి మేలుకోవాలి."

"ముందు నన్నాశీర్వదించండి! అశ్రద్ధ నుండి ఆ శ్రద్ధలోనికి మరింతగా మేలుకొనాలని. శ్రద్ధగా పనిచేద్దామన్న నాకే అప్పుడప్పుడు ఏమరుపాటున అశ్రద్ధ కమ్ముకొస్తుంది. ఇక జాతిస్థితి ఎలా ఉన్నదన్నదీ

నేనర్థం చేసుకోగలను. మీ చుట్టూ తిరుగుతున్న మేమే ఈ జాతికి ప్రతినిధులం. మమ్మల్నిబట్టి ఈ జాతి పరిస్థితిని సమీక్షించవచ్చు. మా కథలు, మా కుటుంబాల కథలు అవే ఈ జాతి కథలు.

నాకు తెలుసు మీరేం చేస్తున్నారో. జాతిని చూపిస్తూ వ్యక్తిని సంస్కరిస్తారు. వ్యక్తిని చూపిస్తూ జాతిని కర్తవ్యోన్ముఖం చేస్తారు. మాలో ఏ ఒక్కరితో మీరు మాట్లాడినా అవి మానవజాతి మొత్తాన్నీ ఉద్దేశించి మాట్లాడినవే అవుతాయి. వాటిని రికార్డు చేయాలేగాని సరిక్రొత్త భగవద్గీత రూపొందుతుంది. ఆ భగవద్గీత నేటి మానవుణ్ణి అలసత్వం అనే విషాదయోగం నుండి ఇవతలకు లాగుతుంది!" అంటూ ఆ మిత్రుడు ఉత్సాహంతో కర్తవ్యోన్ముఖుడై చూస్తున్నాడు.

"ఇక లేద్దామా ?" అన్నారు స్వామి.

"మీరు ఇంతకుముందే నన్ను లేపి నిలబెట్టారు. ఇప్పుడీ లేవడం ఉన్నదే అది శరీరానికి మాత్రమే వర్తిస్తుంది" అంటూ చేతులు జోడించి శలవు తీసుకున్నాడాయన.

ఉదయం డిస్పెన్సరీ పూర్తయింది. ఖమ్మం నుంచి వచ్చిన రాధాకృష్ణమూర్తిగారు ఆ ప్రక్కనే కూర్చుని ఉన్నారు, వైద్యసేవ ఆనందంగా పరికిస్తూ.

తమ ప్రక్కన కూర్చున్న కోటేశ్వరరావుగారికి రాధాకృష్ణమూర్తి గారిని పరిచయం చేస్తూ ఇలా అన్నారు స్వామి : పెద్దలు రాధాకృష్ణమూర్తి గారు మీకు పరిచయమయ్యాడు కదా ! ఈయన రామభక్తులు. రాముడంటే ఈయనకు ప్రాణం. ఈ రామభక్తి సామాన్యమైనది కాదు. విశేషమయినది. చిన్ననాటినుండి ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నవారీయన. ఎన్నెన్నో సిద్ధాంతాలను తరచి చూసినవారు ఈయన. చివరికి ఆయనకు ఒక ఆలోచన వచ్చింది. ఈ సృష్టి రూపుకట్టుకున్న తరువాత నిప్పులాగ నడిచిన మానవుడు ఎవడు ? సహృదయమూ, సామర్థ్యమూ సమపాళ్ళలో కలిగిన మానవుడు ఎవడు ? అని చరిత్ర పుటలను తిరగవేయగా, తిరగవేయగా సృష్టి కథను అవలోకనం చేయగా, చేయగా ఆయనకు కనిపించింది ఒక్కడే. అతడే శ్రీరామచంద్రుడు. అంతే ! ఇక రాముడికి అంకితమై పోయారు. ఆంజనేయుడిగా జీవించటం మొదలుపెట్టారు. ఎవరు దగ్గరైనా ఈయన చెప్పేదొక్కటే. ఒక్కసారి రాముని వైపు తేరిపార చూసే ప్రయత్నం చేయండి అని. అవకాశమున్నంత మేరకు ఆ తత్త్వాన్ని ఆక ళించుకోండని, జీవితాన్ని ధన్యం చేసుకోండని, ఇవీ ఆయన చెప్పే మాటలు. ఇదీ రాధాకృష్ణమూర్తిగారి మాట సూక్ష్మంగా.

రాధాకృష్ణమూర్తిగారి కనులు రామ దర్శనాన్ని పొందుతూ ఆనంద భాష్పాలు రాలుస్తున్నాయి. 'యత్రయత్ర రఘునాథ కీర్తనం' - అన్న శ్లోకాన్ని గుర్తుకు తెస్తున్నారాయన.

స్వామి ఇంకా ఇలా అన్నారు : పందొమ్మిది వందల ఎనభై ఎనిమిదిలో వసంత నవరాత్రుల సందర్భంగా ఖమ్మంలో నా ప్రవచన

కార్యక్రమం ఏర్పాటయింది. అప్పుడే వీరు నాకు పరిచయం. రోజూ సాయంత్రమయ్యేటప్పటికి ఈ పెద్దాయన, చేతి కర్రతో సహా నా ముందు ప్రత్యక్షమయ్యేవారు. ఇరువురం కలిసి, రాముణ్ణి గూర్చి ముచ్చటించుకుంటూ వేదికను చేరేవాళ్ళం. ప్రవచనం పూర్తి కాగానే, అలా ప్రక్కగా నాకోసం నిలబడి ఉండేవారాయన. ఇరువురం కలిసి ప్రవచనంలో వెలికి వచ్చిన విశేషాలను ముచ్చటించుకుంటూ బసకు చేరేవాళ్ళం. నన్నలా బసకు చేర్చి నేను రిలాక్స్ అవడం చూసుకుని, రేపు కలుద్దాం అని చెప్పి, అప్పటికి ఇంటికి వెళ్ళేవారాయన. రోజూ రామదూత ఇలా వెంటబెట్టుకొని వెళ్ళి రామాయణం చెప్పించుకుంటున్నాడా !' అనిపించేది.

రాధాకృష్ణమూర్తిగారి కన్నులు మరొక్కసారి చెమ్మగిల్లాయి. 'బాష్పవారి పరిపూర్ణలోచనం' అన్న శ్లోక భాగాన్ని గుర్తుకు తెస్తున్నాయి. ఆ బాష్పధారల మధ్యలో నుండే చూస్తూ ఇలా అన్నారాయన : 'అపూర్వ అనుభూతి. వర్ణించ నలవికానంత అనుభూతి. రామాయణం చెప్పబడు తున్న ప్రతి చోటికీ అవకాశమున్నంతవరకు నేను వెళుతూ ఉంటాను. నా రాముణ్ణి నాకు చూపించగలరేమో వారు అని చూస్తుంటాను. రామాయణం చెప్పడం వేరు. రాముణ్ణి చూపడం వేరు. కృష్ణస్వామిగారు చెబుతున్నప్పుడు రాముడు నాకు నిండుగా కనిపించాడు. అంతే ! ఇక నేనాయన వెంట నడి చాను. నా మనస్సును దోచుకున్న రాముణ్ణి కనులార చూడాలని అను కోవటం సహజమే గదా ! ఏమి చెప్పారు కృష్ణస్వామిగారు ! వాల్మీకి అడిగాడుట, నాకిలాంటి నాయకుడు కావాలని, నారదుడు చెప్పాడుట ఇదిగో నీచే కోరబడుతున్న నాయకుడు ఈ శ్రీరామచంద్రుడే'. అని అంతే ! ఈ ఘట్టం తొమ్మిది రోజులు నడిచింది. తొమ్మిది రోజులూ నిండైన రాముని మూర్తి అలా కనులముందు మెరిసి వర్తించింది. ఆ ఋషులిద్దరి మాటల తోనే రామాయణగాథ మొత్తం నడచిపోయింది. అపూర్వ అనుభూతి. అదే మమ్మల్ని ఇలా కలిపింది.

పులకితగాత్రులై అలా పారవశ్యంలో మునిగి తేలుతున్న రాధాకృష్ణ మూర్తిగారిని చూస్తుంటే అక్కడున్న వారందరికీ, 'ఆంజనేయుడు చిరంజీవి అంటారు గదా ! ఒకవేళ అతడు మనకు గోచరించడం జరిగితే, ఇలాగే ఈ రాధాకృష్ణమూర్తిగారిలాగే ఉంటాడేమో !' అనిపించింది.

కొద్ది క్షణాలు నడిచిన తరువాత కోటేశ్వరరావుగారు ఇలా అన్నారు : ఒక చిన్న సందేహం. 'యోగవాసిష్ఠం శ్రీరాముడికి వశిష్టుల వారు చేసిన బోధ. భగవద్గీత శ్రీకృష్ణుడు అర్జునుడికి చేసిన బోధ. కాని భగవద్గీతకు వచ్చినంత ప్రచారం యోగవాసిష్ఠానికి రాలేదేమిటి ? ఎందుకని ఇలా జరిగిందంటారు ?'

'దీనికి కందిరాజు వారేమంటారు ?' అన్నారు స్వామి.

'ఇది చిత్రమైన ప్రశ్న. దీనికి సమాధానం మీనుండి వస్తే వినాలని ఉంది.' అన్నారు కందిరాజు రాధాకృష్ణగారు.

చిరునవ్వుతో స్వామి ఇలా అన్నారు : యోగవాసిష్ఠం రాముడికి వసిష్ఠుడందించిన మేలుకొలుపు. భగవద్గీత అర్జునుడికి శ్రీకృష్ణుడందించిన చేయూత. లోకంలో మేలుకొలుపుకన్న చేయూత కావలసినవారే ఎక్కువ మంది ఉంటారు. అందువలన యోగవాసిష్ఠంకన్న భగవద్గీతకు ప్రాచుర్యం ఎక్కువ వచ్చింది.

విషాదంలోపడి కొట్టుకుపోతూ, మార్గమిదేనా అని అడిగిన మానవుడికి చేయూతనిచ్చి, నిలబెట్టి జీవించడానికి కావలసిన సమన్వయాన్ని ఇచ్చి అతడిని సాధకునిగా రూపొందిస్తుంది భగవద్గీత. ఆపైన మానవుడిలో కావలసిన మేలుకొలుపును వచ్చేటట్లుగా చేస్తుంది యోగవాసిష్ఠం. కనుక భగవద్గీత మీదుగా యోగవాసిష్ఠం దగ్గరకు వెళితే చాలా బాగుంటుంది.

'బాగుంది. చాల బాగుంది మీ సమన్వయం' అంటూ మురిసిపోయారు రాధాకృష్ణమూర్తిగారు. తృప్తి కలిగిందన్నట్లుగా చూశారు కోటేశ్వరరావుగారు.

మళ్ళీ అంతా రామమయమై నిలిచింది వాతావరణం.

ఉద్యోగ ప్రయత్నమా!

"ఇప్పుడు ఈ వెళ్ళిన పెద్దాయన మీకు తెలుసు కదా!" అడిగారు స్వామి, ఎదురుగా సావధానంగా కూర్చున్న మిత్రుణ్ణి ఉద్దేశించి.

"తెలియకేమి? బాగా సన్నిహితులే కదా!" అన్నాడా మిత్రుడు. స్వామి మిత్రుడి కళ్ళల్లోకి చూస్తూ ఇలా అన్నారు. "ఇప్పుడాయన్ని గూర్చి తెలుసుకోవలసింది నిజంగానే చాలా ఉంది. ఇటీవల ఆయనలో చాలా మార్పు వచ్చింది. ఇప్పుడాయన మాటలు వింటూంటే ఎంత ఎదిగాడీయన అనిపిస్తుంది.

పూర్వం తెలిసింది నలుగురికీ చెప్పాలన్న తాపత్రయ ముండేదాయనకు. చిత్రంగా ఇప్పుడదీ కరిగిపోయింది. దాని స్థానంలో నిరంతరమైన కృషి చోటు చేసుకుంది. మంత్ర శాస్త్రాన్ని గురించీ, జ్యోతి శాస్త్రాన్ని గురించీ, హస్త సాముద్రికాన్ని గురించీ చాలా లోతులకు వెళ్ళి పరిశోధన చేస్తున్నదాయన మనస్సు. ఈ వయస్సులో రిటైరయినాక ఈ వృద్ధాప్యంలో ఇంకా ఇవన్నీ ఎందుకు అని ఎవరికైనా అనిపించవచ్చు. పోనీ ఆ విద్యలను ప్రదర్శించే ఉద్దేశమూ అతనికి లేదు. ఆ విద్యలను దర్శించాలన్న సంకల్పం మాత్రం ఉంది.

ఇంతకు ముందే ఆయన అన్నారు కదా! "ఈ శరీరం ఇంకెంతో కాలముండదు. పడిపోయే లోపల ఈ శరీరాన్ని సద్వినియోగం చేసే ప్రయత్నంలో ఉన్నాను నేను ఈ పరికరాన్ని వీలైనంత ఎక్కువ ఉపయోగించి ఆత్మపరంగా వీలైనంత ఎక్కువ ఎదుగుదలను పొందాలన్నది ఇప్పటి నాయీ కృషికి కారణం. అందుకని మిగిలిన పనులు వీలైనంత తగ్గించుకొని ఈ కృషిలోనే ఉండిపోతున్నాను" అని.

ఆయన మాటలు నాకు ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కూడా కలిగిం

చాయి. "శరీరమాద్యం ఖలుధర్మ సాధనమ్" అన్న పెద్దల మాటకు భాష్యం చెప్పారాయన.

ఇక్కడింకొక విశేషముంది. ఇప్పుడాయన జ్యోతిర్విద్యపై కృషి చేయడం ఆ విశేషం. ఆ విద్యను అధ్యయనం చేయడంలో ఆయన సృష్టి వ్యూహాలను దర్శిస్తున్నారు. క్రమంగా సౌరమండలంతో తాదాత్మ్యం చెందు తున్నారాయన. మూల కారణాన్ని ముట్టుకునే యత్నంలో ఉన్నారాయన. ఆ యత్నంలో ఆయన ఉండగా ఆ అనుభూతిని ఆయన పొందుతూ ఉండగా ఎప్పుడో అప్పుడు ఆ శరీరం రాలిపడిపోతుంది. నిజంగా ఆయన చాలా అదృష్టవంతుడు !

"అబ్బ ! ఎలాంటి అంశం చెప్పారండీ. వింటూంటే ఆ దర్శనం నాకే కలుగుతోంది. జీవితాన్ని సద్వినియోగం చేసుకోవటాన్ని గూర్చి ఎటో వెళ్ళిపోతున్న ఈ మనిషికి మరొక్కసారి గుర్తు చేశారు మీరు. ఆయన కథ చెబుతూ నన్ను హెచ్చరించారు. నిజంగా క్షణం పోతే మళ్ళీ వస్తుంద టండీ ! కానీ రాదని తెలిసికూడా ఆయనకు వచ్చిన ఆ ఎరుక అందరికీ రాదే ! అదే వస్తే ఎంత బాగుంటుందండీ ! కనీసం ఇప్పటికైనా జాగ్రత్త పడాలి !" అన్నాడా మిత్రుడు. ఏవేవో అనుభూతులతన్ని చుట్టుముడుతూ ఉండగా-

స్వామి మళ్ళీ ఇలా అన్నారు, "పెద్దలొకరు ఒకప్పుడు నాతో అన్నారు. "మిగతా వారిలాగానే మీరు కూడా "పార్ట్‌టైమ్"గా చేయవచ్చు గదా ఈ పనిని. "ఫుల్‌టైమ్"గా తీసుకొని రిస్కును ఫేస్ చేయడం ఎందుకు ? ఉద్యోగం చేస్తూ ఈ పనినీ చేయవచ్చుకదా !" అని.

నేనిలా అన్నాను : నా దృష్టిలో ఆదాయంకన్నా ఆయుర్దాయం చాలా విలువైంది. అందుకని ఆయుర్దాయాన్ని సాధ్యమైనంతగా సద్విని

యోగం చేయాలన్న సంకల్పంతో నేనీ ఉద్యమ రూపాన్ని స్వీకరించాను. ఈ ఉద్యమమే నా ఉద్యోగం.

"చాలా చక్కగా చెప్పారండి. అలా చేయడానికే కాదు చెప్పడానికి కూడా చాలా కలేజా ఉండాలి" అన్నాడా మిత్రుడు అభినందనగా చూస్తూ.

ఉద్యోగం అంటే అర్థమేమిటి ? "ప్రయత్నమ"ని కదా ! ఉద్యోగ పర్వమంటే అర్థమేమిటి ? తమకు రావలసిన రాజ్యభాగం కోసం పాండవులు ప్రయత్నం చేసిన పర్వమని కదా అర్థం. మన వాళ్ళిప్పుడా అర్థాన్ని మరిచిపోయారు. మర్చిపోయి ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నామంటున్నారు. ఉద్యోగమంటే ప్రయత్నమన్న అర్థం పోయి "జాబ్" అన్న అర్థం వచ్చేసింది. ఇంకేముంది ! ఆ ఉద్యోగ మొచ్చిన తరువాత అంటే "జాబ్" వచ్చిన తర్వాత ఇక ఉద్యోగమే ఉండదు. అంటే ప్రయత్నమే ఉండదు. జీవితంలో ఎదుగుదల ఆగిపోయి "రొటీన్" మాత్రమే నడుస్తూ ఉంటుంది చాలామంది విషయంలో.

జీవితంలో ప్రయత్నం నిరంతరం కొనసాగుతూనే ఉండాలి. మనం చేసే పనిపాటులన్నీ ఆ ప్రయత్నంలో భాగాలేనని మనకు తెలియాలి. సాగుతున్న ప్రయత్నాన్ని బట్టి మనిషి పొందే ఎదుగుదల ఉంటుంది. కనుక మానవుడు నిరంతరం ఉద్యోగి కావాలి.

స్వామివదనం గంభీరంగా ఉంది. మానవ జీవితాల పోకడలవైపు దృష్టిని సారించి తమ వాక్కును అను సంధిస్తున్నారాయన. ఆ సమయాన అప్రయత్నంగా వ్యక్తమవుతున్న గాంభీర్యమది.

స్వామి మళ్ళీ ఇలా అన్నారు : ఎవరైనా శరీరాన్ని విడిచిపెట్టబోతుంటే సామాన్యంగా మనకేమనిపిస్తుంది. ఇంకో పది నిముషాలైనా బ్రతికితే బాగుండునని ! మరి జీవించి ఉండగా ఎన్ని నిముషాలు గడి

పేస్తున్నాం మనం. అప్పుడా నిముషాల విలువ మనకేమన్నా తెలుస్తోందా ! ప్రాణం కడబడుతున్నప్పుడు ఇంకో పదినిముషాలైనా బ్రతికించు అని దేవుడిని అర్థించే మనిషి జీవించి ఉన్నప్పుడు మరి కాలంపైన శ్రద్ధ పెట్టి లేక పోతున్నాడేం ? మరి కాసేపు బ్రతకాలని కోరుకుంటున్న నీవు, బ్రతికి నంతకాలం ఏం చేశావని దేవుడడిగితే మనిషి చెప్పే జవాబేమిటి ?

మిత్రుడు తల పంకించాడు. పచ్చి నిజాలు చెబుతున్నారు మీరు. సూటిగా తుపాకి పెట్టినట్లుగా అడుగుతున్నారు మీరు. ఈ రోజు నిజంగా శుభదినం. మనని గూర్చి మనను ప్రశ్నించుకున్న పర్వదినమిది. అన్నట్టు ఈ రోజు మీ పుట్టిన రోజటకదా ! క్రింద ఆ అమ్మాయి ఇందాక స్వీట్ చేతికిస్తూ చెప్పింది. అనుకోకుండా జన్మదిన సందేశాన్ని మీ నుండి ఇలా అందుకోగల్గాను. ఎంత అదృష్టమండీ! ఎంత హాయిగా గడిచిందీ సమయం. ఎంత వెలుగుగా గోచరిస్తున్నదీ జీవితం.

నిజమేనండీ ! ఇవాళ అమకోకుండా అనుకోవలసిన మాటలను కున్నాం మనం. అనుక్షణం గుర్తుకు రావలిసిన వాక్యాలివి. ఇకలేద్దామా మరి" అంటూ మిత్రునికి చేయి అందించారు స్వామి.

శంక తొలిగింది

ఖమ్మం నుంచి వచ్చిన రాధాకృష్ణమూర్తిగారు వచ్చి స్వామి ప్రక్కనే ఆసీనులై, జరుగుతున్న వైద్యసేవలోని ఆనందానుభూతిని పంచుకుంటున్నారు. కాసేపటిలో వైద్యసేవ పూర్తయి స్వామి ఇక రాధాకృష్ణమూర్తిగారివైపు తిరిగారు.

'ఇక చెప్పండి మీ కబుర్లు'— అన్నారు స్వామి.

'కబుర్లన్నీ బాగానే ఉన్నాయి. ఇలా వీలు దొరికినప్పుడల్లా రావడం, జరుగుతున్న కార్యక్రమాలను చూసి ఆనందించటం, మధ్యలో ఇలా విరామం దొరికితే పురాణేతిహాసాల్లోని ఏ అంశాలో మిమ్మల్ని అడిగి, మీరు వానిని వివరించి చెపితే, ఆనందాతిరేకంతో వింటూ ఉండటం, ఇదీ మా 'పని' అంటూ రాధాకృష్ణమూర్తిగారు కన్నులను పెద్దవిచేసి స్వామి వైపు చూస్తూ కూర్చున్నారు. కన్నులతోపాటు చెవులుకూడా పెద్దవి కావటానికి ప్రయత్నిస్తున్నట్లున్నాయి ఆయనకి.

'అయితే ఈ పూట అంశమేమిటో చెప్పండి. ఇక దానిలోనికి వెళదాం'— అన్నారు స్వామి.

'భాగవతంలో ప్రహ్లాద చరిత్ర ఉంది. ఆ ప్రహ్లాదుణ్ణి గురించి వర్ణిస్తాడు మొదట. వర్ణిస్తూ అంటాడు కదా ! 'పరస్త్రీలు ఎదురైతే వారిని మాతృమూర్తులుగా చూస్తూ, తొలగిపోయేవాడు' అని; మళ్ళీ ఆ తరువాతి కథలో, 'అతని వయస్సు ఐదేళ్లు'- అంటాడు. అయినప్పుడు ఈ వర్ణనను మనం ఎలా అర్థం చేసుకోవాలి? మామూలుగా చూస్తే ఈ అంశాలు పొసిగేటట్లుగా లేవే! ఈ అంశాలను చూడటానికి కావలసిన చూపు ఎటువంటిది అనేది ఇక మీరు అందించాలి.

జిజ్ఞాస నిండిన చూపులతో అలా స్వామిపైపు చూస్తూ కూర్చుండి పోయారు రాధాకృష్ణమూర్తిగారు స్వామి ఎప్పుడు ఏమి చెపుతారోనని.

స్వామి ఇలా అన్నారు: భాగవతంలో ఈ ప్రహ్లాద చరిత్రను నారదుడు ధర్మరాజుకు చెపుతాడు. మొదట అతను ప్రహ్లాదుణ్ణి గురించి ప్రస్తావిస్తాడు. ఆ ప్రస్తావించడంలో ప్రహ్లాదుని యొక్క పవిత్రమైన వ్యక్తిత్వాన్ని గురించి పరిపూర్ణమైన వర్ణన చేస్తాడు. ఆ వర్ణనలోని ఒకానొక అంశమే మీరు నన్ను అడిగింది.

ఆ వర్ణనమ విన్న ధర్మరాజు, 'అలాంటి దివ్యమైన మూర్తికి సాక్షాత్తు తండ్రియైన హిరణ్యకశిపుడే, ఎలా ఇబ్బందులపాలు చేయగలిగాడు?'- అని అడుగుతాడు. అప్పుడు నారదుడు ప్రహ్లాదుని చిన్నప్పటి సన్నివేశాలను ప్రత్యేకంగా మళ్ళీ వివరిస్తాడు. ఆ వివరించిన సన్నివేశాలలోని ప్రహ్లాదుని వయస్సు అయిదు సంవత్సరాలు. అదీ కథ! అంతేగాని, మొదటగా వర్ణింపబడిన ప్రహ్లాదుని జీవిత వైభవానికి సంబంధించిన వయస్సు కాదిది.

అంటే ఇక్కడేం జరిగిందన్నమాట. నారదుడు మొదట ప్రహ్లాదుని వ్యక్తిత్వాన్ని మొత్తాన్ని వర్ణించాడు ఆ పైన అలాంటి వ్యక్తియొక్క చిన్నతనం ఇలా గడిచింది- అని ఇలా చెప్పాడు. మనం కూడా చాలసార్లు ఇలా చేస్తూ ఉంటాం. ఏ గాంధీమహాత్ముడి గురించో చెప్పేటప్పుడు ఆయన ఇలాంటివాడు, అలాంటివాడు అంటూ ఆయన గుణగణాలను ముందుగా వర్ణించి, అలాంటి ఆయన జీవితంలో ఒకసారి ఏం జరిగిందంటే అంటూ వివరిస్తాం.

ముందుగా చేయబడిన వ్యక్తిత్వ వర్ణన ఆ వ్యక్తిని గురించి ఒక చక్కని అవగాహనను అందిస్తుంది. ఆ పైన చేయబడిన జీవిత సన్ని వేశాల వివరణ, హృదయాలకు చక్కగా హత్తుకుంటుంది. ఈ సన్ని

వేశాలు హృదయానికి హత్తుకోవాలి అంటే, ముందుగా ఆ వ్యక్తిత్వాలకు సంబంధించిన ఒక పరిపూర్ణమైన దర్శనం, ఆ కథను స్వీకరిస్తున్నవాడికి కలగాలి. కథా కథనంలో ఇది ఒక చక్కటి ఒడుపు.

'తృప్తి కలిగిందా?' అన్నట్లు చూశారు స్వామి.

'దివ్యంగా ఉంది మీరు ఇచ్చిన వివరణ. ఎన్నినాళ్ళగానో, నాలో చోటుచేసుకుని ఉన్న శంక ఇట్టే తొలగిపోయింది'- అంటూ నమస్కరించారు రాధాకృష్ణమూర్తిగారు.

అటుచూడు

'నేనెందుకని పనిని పూర్తిగా చేయలేక పోతున్నాను?'- అని ఆలోచిస్తే ఒక మూడు లక్షణాలు నాకు కనిపిస్తున్నాయి. ఒకటి జ్ఞాపకశక్తి లేకపోవటం, రెండవది పనులు వాయిదావేసే లక్షణం, మూడవది బద్ధకం. ఈ మూడు అవలక్షణాలు కలిసి పనికి తగిన వ్యక్తిగా నన్ను రూపొందనీయటంలేదు!- అంటూ నిట్టూర్చిందొకామె.

ఆ నిట్టూర్పును గమనించి స్వామి ఇలా అన్నారు :

ఇలా అవలక్షణాలను తలుచుకుంటూ కూర్చోవటంవల్ల అవి మరింత బలపడతాయి తప్ప, నిన్ను వదిలిపెట్టవు. ఎన్నివిధాలైన అవాంతరాలున్నప్పటికీ, ఈ ఉద్యమంతో ఆత్మీయమైన బంధం పెంచుకోబట్టేకదా, నీవు ఇక్కడికి పద్ధతిగా రాగలుగుతున్నావు. అలాగే ఉద్యమం యెడల, ఉద్యమ లక్ష్యం యెడల మరింత ఆత్మీయతను పెంచుకునే ప్రయత్నం చేయి. అప్పుడు ఈ అవలక్షణాలన్నీ వాటికవిగా నిన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతాయి. మనిషిని చెదరకుండా నిలబెట్టగలిగేది అతడి లక్ష్యం మాత్రమే. దానిపైపే అతడు చూడవలసింది. ఇక అదే అతడిని చూసుకుంటుంది.

ఒక ఉదాహరణ చెపుతాను చూడు. దీపారాధన కుందులను రెండింటిని తీసుకున్నామనుకో, రెండింటిలోనూ రెండు కుండ వత్తులను కూడా వేశాం. నూనె పోశాం. వత్తులు సరిగ్గా ఉండేటట్లుగా చూశాం. ఒక వత్తిని వెలిగించాం. మరొక దానిని వెలిగించలేదు. కొంతసేపు ఆగి చూడు. ఈ వెలిగించబడిన వత్తి అలాగే నిలబడి చక్కగా వెలుగుతూ ఉంటుంది. వెలిగించకుండా అలాగే అట్టిపెట్టిన వత్తి ఉందే అది ఒక ప్రక్కకు ఒరుగుతుంది నువ్వు దానిని సరిచేశావనుకో, మళ్ళీ కాసేపాగి చూస్తే, మరో ప్రక్కకు ఒరిగి ఉంటుంది. అక్కడేం జరుగుతుందో గమనించావా? వెలిగింపబడిన వత్తి అలాగే నిలబడి ఉంటున్నది. ఎందువల్ల? అది అలా ఉండేటట్లుగా ఆ వెలుగుతున్న వెలుగు మొగ్గే చూచుకొంటుంది. రెండవ దానిలోని వత్తి వెలిగింపబడలేదు. దానిని నిలబడేటట్లు చూసుకునేందుకు అక్కడ వెలుగు మొగ్గలేదు. అలాగే మనమొక మహత్తరమైన లక్ష్యానికి అంకితమైనప్పుడు, నిరంతరం ఆ లక్ష్యస్మరణలోనే ఉంటూ, ఆ లక్ష్యం కొరకే పనిచేస్తున్నప్పుడు, ఆ లక్ష్యమే మనను అన్నివిధాలా సంస్కరించి, తనకు తగిన విధంగా మనను మలచుకుని, నిలబెట్టుకుంటుంది. కనుక మనం చూడవలసింది అటువైపు. 'పరం దృష్ట్వా నివర్తతే'- అన్న గీతా వాక్యానికి అర్థమిదే.

ఆమెకు మార్గం బోధపడింది. ఆ బోధపడటాన్ని తృప్తిగా వెలుగుతున్న ఆమె వదనమే సూచిస్తోంది.

సంస్థల్లో ఆడా-మగా

ఆ సంస్థల్లో ఆడవాళ్ళకే ప్రాధాన్యం. అనాదిగా ఆడవారికి అన్యాయం జరిగిందనీ, అది గమనించిన మేము ఆడవారికి ప్రత్యేక స్థానాన్ని, ప్రథమ స్థానాన్ని ఇస్తున్నామని వారంటారు. వారు సంస్థకు అధిపతిగా కూడా ఆడవారినే ఎంచుకుంటారట. మగవారికి కూడా అందులో చోటుంటుంది గాని, ఆడవారి తరువాతనే. 'అన్నయ్యా, అక్కయ్యా' అని ఒకరి నొకరు పిలుచుకుంటూ ఉంటారు అక్కడ. వివాహానికి, సంతతికి వారు అంతగా ప్రాధాన్య మివ్వరు. బ్రహ్మచారులుగా ఉండిపోవటాన్నే వారు ప్రోత్సహిస్తారు. పెళ్ళి చేసుకుంటే కాదనరు గాని, ఆ ఆలోచనకు అంత ఇష్టంగా ముఖం పెట్టరు. బ్రహ్మచారులుగా ఉండిపోయినవారిలో, ఆ సంస్థలో స్త్రీల సంఖ్యే ఎక్కువగా కనబడుతుంది. ఆ సంస్థను నడిపిస్తున్నదీ, నిర్వహిస్తున్నదీ ప్రధానంగా స్త్రీలేనని చెప్పాలి. ఇదొక చిత్రమైన పరిణామంగా కనిపిస్తుంది. ఈ పరిణామం దేని ఫలితం అంటారు ? దీని గమ్యం ఏమిటంటారు ?

స్వామి ఇలా అన్నారు : మీ పరిశీలన బాగుంది. నడివయస్సు దాటకుండానే చాలా అంశాలు ఆకళించుకోగలిగారు మీరు. ఎప్పుడు కలిసినా ఇలాంటి లోతైన అంశాలు ప్రస్తావనకు తెస్తూ ఉంటారు. సరే వినండి చెబుతాను : "సనాతన ధర్మం" స్త్రీమూర్తికి ప్రథమ స్థానాన్ని ఇచ్చింది. "మాతృదేవోభవ"– అంటూ మొదటి నమస్కారం ఆమెకే అందజేసింది. మనువు కూడా "స్త్రీలు పూజింపబడినచోట దేవతలు పరవశిస్తూ తిరుగుతారనీ, స్త్రీలు ఇబ్బంది పెట్టబడినచోట ఇక సమస్యల పాలైపోతారని హెచ్చరించాడు.

మన ఋషులు గృహస్థాశ్రమానికి పెద్దపీట వేశారు. సంతతి అనే దారాన్ని తెంచవద్దు అన్నారు. వేదోపనిషత్తులను దర్శించి ఇచ్చిన ఋషు

లలో గృహస్థులే ఎక్కువ మంది. గురుకులాలను నడిపినవారిలో కూడా ఎక్కువమంది గృహస్థులే. మానవ జీవితాన్ని "చతురాశ్రమాలుగా" రూపొందించారు వారు. విద్యార్థి దశను బ్రహ్మచర్యాశ్రమ మన్నారు. ఆ విద్యను సమాజానికి సద్వినియోగం చేసే దశను గృహస్థాశ్రమం అన్నారు. ఇది వివాహంతో ప్రారంభమవుతుంది. ఇప్పుడు మనం రిటైర్‌మెంట్ అంటున్నామే. ఆ దశను మనవారు వానప్రస్థాశ్రమం అన్నారు. అంటే ఏమిటి ? సమాజానికి చేసిపెట్టేటందుకు కావలసిన ఓపిక శరీరానికి తగ్గింది. తగ్గేటప్పటికి బిడ్డలు చేతికి అందివచ్చి ఉంటారు. కనుక ఆ పనిని వారికి అప్పగించి, మీరు విశ్రాంతి పొందండి !" అన్నారు. అయితే ఇన్నాళ్ళ్నా పనిచేసినందుకు, మీరు ఎంతో అనుభవాన్ని సంపాదించి ఉంటారు. ఆ అనుభవాన్ని యువకులకు ఈ వానప్రస్థాశ్రమంలో పంచిపెట్టండి. వారికి కావలసిన గైడెన్స్ ఇవ్వండి. వారి నిత్యజీవితాలలో మాత్రం అతిగా కలుగజేసుకోకుండా జాగ్రత్త పడండి". అని చెప్పారు. మీ గైడెన్స్ లేక పోతే, యువకులకు దారి తెలియదు. అలాగని మీరు అతిగా కలుగజేసు కుంటే వారి ప్రయాణం సాగదు. ఈ సూక్ష్మాన్ని గ్రహించి, వానప్రస్థాశ్ర మాన్ని ఒడుపుగా నడుపుకోమన్నారు. అంటే శరీరానికి పని తగ్గి, మన స్సుకు మాత్రం తగు మాత్రంగా పని చెప్పమన్నారన్నమాట. ఆటుపైన ఆ మనస్సుకూడా అలసిపోయిన స్థితి వస్తుంది. శరీరములో పనిచేస్తున్న శక్తియుక్తులు ఒకటొకటిగా నిష్క్రమించే దశ వస్తుంది. ఈ స్థితిని వారు "యత్యాశ్రమము" అన్నారు. అంటే ఏమిటో తెలుసునా ? మీరు లోకానికి స్వయంగా చేయవలసిన పనిని చేశారు. ఆ పైన మీ అనుభవాన్ని పంచిపెట్టడం ద్వారా లోకానికి సహకరించారు. మీ క్రియబడిన శక్తియుక్తులు సద్వినియోగమై మీ నుండి నిష్క్రమిస్తున్న స్థితిలో ఇక మీరు కేవలం సర్వాంతర్యామితో శ్రుతిని కలిపి నిలవండి. పండిన పండులా, ఒక పండు టాకులా మీనుండి మీ శరీరం అనాయాసంగా రాలి పడిపోతుంది, అంటూ

పరిపూర్ణమైన మానవ జీవితానికి రూపుదిద్దారు ఋషులు. ప్రత్యేక సందర్భాలలో తప్ప వారెవరూ వివాహమాడకుండా ఉండిపోయే ప్రయత్నం చేయలేదు. ఆకలి ఎటువంటిదో, దప్పిక ఎటువంటిదో, దాంపత్యాభిలాషకూడా అటువంటిదే! అది ఒక పవిత్రమైన 'అగ్ని'. మన తరువాత తరాలు నిలబడేటందుకుగాను, మననుండి పనిచేస్తూ, మనచేతకూడా పనిచేయిస్తున్న అగ్ని అది. ప్రకృతి సహజమైన అంశమది. ప్రకృతికి సహజమైన అంశాలను మనం వ్యతిరేకించకూడదు. పవిత్రంగా నిర్వహించుకోవాలి. అంటే ఆ అంశాలు మనలో ఎందుకు ఏర్పాటవుతున్నాయో గ్రహించుకొని, అందు కొరకు మాత్రమే వాటిని వినియోగిస్తూ, దైవమయంగా జీవించగలగాలి అన్నది మగ ఋషుల ఉపదేశం. ఇది వారు ఒసగిన పరిపూర్ణమైన జీవన విధానం.

ఋషుల ధర్మంలో స్త్రీ, పురుష విభాగానికి సద్వినియోగమున్నదీ. 'దైవమే సృష్టికార్య నిర్వహణార్థమై స్త్రీ, పురుషులుగా తనను తాను విభాగించు కొంటున్నాడు' అని వారు దర్శించారు. ఆ విభాగాన్ని సద్వినియోగం చేయమన్నారు. విభేదాలకు ఏమాత్రం ఇందులో చోటు లేదన్నారు. అంటే ఇక్కడ ఎక్కువ తక్కువలు చూడటానికి అవకాశం లేదన్న మాట. అలా చూస్తే, దైవాన్నే చిన్నచూపు చూసిన వాళ్ళమౌతాం. విభాగాల యొక్క వినియోగాలను మరచి, విభాగాలకి విలువలను కట్టే ప్రయత్నం. అది సమాజంయొక్క పతానావస్థకు దారితీస్తుంది - అన్నది పెద్దల ఉపదేశం.

'మరి ఋషుల దర్శనం ఇంత పరిపూర్ణంగా ఉన్నప్పుడు బ్రహ్మచర్యానికి, ఆధ్యాత్మికతకూ ముడి పెట్టడం అనేది ఎలా ప్రారంభమైనదంటారు? ఎప్పటినుండి ప్రారంభమైనదంటారు?' అన్నాడతను ఆశ్చర్యంగా చూస్తూ.

స్వామి ఇలా అన్నారు: 'ఇలా ముడిపెట్టటం అనేది బుద్ధుని కాలం

నాటినుండి ప్రారంభమైంది. బుద్ధుడు ఎంతటి అవతారమూర్తో అంతటి ఆవేశమూర్తికూడా! భూతదయ, కరుణలతో నిండిన ఆవేశ స్వరూప మతనిది. కనుక బ్రహ్మచారులుగా ఉండిపోతే సాధకులు సమాజానికి ఎక్కువ సేవ చేయగలుగుతారు' అని అతనికి అనిపించింది. అంతే. అతడు దానిని వెంటనే అమలు పరిచాడు. సేవకొరకు సన్యాసాశ్రమమన్నది బుద్ధుని సృష్టియే. మళ్ళీ ఆ సన్న్యాసులలోనికి పురుషులతోపాటు స్త్రీలను కూడా స్వీకరించాడు. అతడు స్త్రీలను చిన్నచూపు చూడలేదు. కాని, సేవ చేయటానికి సన్న్యాసం స్వీకరించటం అవసరమని మాత్రం అతడు అనుకున్నాడు. ఈ విధంగా సేవా బోధలకు సన్న్యాసాశ్రమ స్వీకారం బాగుంటుందనే పద్ధతిని పట్టుకొచ్చాడు. బుద్ధుడి తరువాత వచ్చిన ఆదిశంకరులు కూడా బౌద్ధానికి జవాబు చెప్పడం కోసం, మరల ఈ పద్ధతినే స్వీకరించారు. ఇక అప్పటినుండి తత్త్వబోధకు, సన్న్యాసాశ్రమానికి ముడిపెట్టటమనేది ఒక సంప్రదాయమై కూర్చుంది. ఆధునిక కాలంలో వివేకానంద వంటి మహనీయులు కూడా ఈ పద్ధతినే కొనసాగించారు. అయితే వివేకానందుడు తత్త్వబోధకే పరిమితమైన సన్న్యాసులను సేవకులుగా కూడా రూపొందమని, బుద్ధుడు ప్రేమతో హెచ్చరించాడు.

ఈ సంప్రదాయం ప్రారంభమయిన తరువాత క్రమంగా స్త్రీలను చిన్నచూపు చూడటం అనేది కూడా సమాజానికి అలవాటయింది. దీనికి విదేశీ దండయాత్రలు కూడా చాలా దోహదం చేశాయి. ఆ దండయాత్రలవల్ల స్త్రీ స్వేచ్ఛను తాత్కాలికంగా అరికట్టవలసి వచ్చింది. సమాజ రక్షణ కోసం ఆ నాడు అది అవసరమైంది. కాని, ఆ తరువాత అది అలవాటైకూర్చుంది. క్రమంగా గృహిణి గృహోపకరణాల్లో ఒకటిగా మిగిలిపోయింది. సరిగ్గా ఈ కాలంలోనే తత్త్వప్రచారకులు స్త్రీలను తక్కువచేసి చెప్పడం ప్రారంభించారు. కాంతా కనకాలు బంధ కారణాలు అన్నారు. దాంపత్య ధర్మంలో ఇద్దరికీ ప్రమేయం ఉన్నప్పుడు ఒక్కరే బంధకారణం ఎలా అవుతారు?


స్త్రీ, పురుష సంబంధమనే దాన్ని పవిత్రంగా చూసుకోవాలి అని చెప్పే బదులు ఇలా చెపుతూ వచ్చారు. ఈ చెప్పడం సృష్టికి విరుద్ధం కదా! అది ఒక పాపకార్యమై కూర్చుంది. దాంపత్య ధర్మాన్ని చిన్నచూపు చూడటం ఒక తప్పు. స్త్రీ జాతిని చిన్న చూపు చూడటం రెండవ తప్పు. సైన్స్‌లో ఒక సూత్రం చెపుతారు. మనం చేసిన ఏ చర్యకైనా ప్రతిచర్య ఒకటి ఉండి తీరుతుందని (For every action there is an equal and opposite reaction) ఈ సృష్టి సూత్రం మనం చెప్పుకుంటున్న అంశానికే వర్తించింది. ఈ జరుగుతూ వచ్చిన దారుణానికి ప్రతిచర్యగా ఇప్పుడు మీరు చెప్పిన సంస్థల లాంటివి రూపు కట్టుకోవడం జరుగుతున్నది. "స్త్రీలే ప్రధానము. తత్త్వబోధకు వారే ఎక్కువ అర్హులు. మా సంస్థలలో మొదటి పీట వారికే. వారి ప్రకారమే మిగిలినవన్నీ జరుగుతాయి. దాంపత్య ధర్మం విషయంలో కూడా స్త్రీలు పురుషులను ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచుతారు. తమ పవిత్రతను నిలబెట్టుకుంటారు. పురుషుల్ని దరి చేర నీయకుండా బ్రహ్మచారిణిలుగా ఉండిపోతారు. ఏ విధంగా చూసినా, అన్ని కోణాలలోనూ స్త్రీమూర్తిదే పైచేయి. పురుషుడు ఆమె అడుగుజాడల్లో నడువ వలసినవాడు", ఇలాంటి నమ్మకాలు, సూత్రాలతో ఈ పుట్టుకువచ్చిన సంస్థలు పనిచేయడం మనం చూస్తున్నాం. కొన్ని శతాబ్దాలు పురుషుడు స్త్రీని నిందిస్తూ దూరంగా ఉంచే ప్రయత్నం చేశాడు. దానికి ప్రతిచర్యగా ఇప్పుడు కొన్ని శతాబ్దాలనుండి స్త్రీ ఇలాంటి సంస్థల ద్వారా పురుషుణ్ణి నిందించి దూరంగా నిలబెడు తున్నది. ఇదీ సారాంశం. 'నిందకు ఫలం నిందేకదా!' ఇప్పుడు అదే అనుభవానికి వస్తున్నది.

'మరిప్పుడు దీనికి పరిష్కారమేమిటంటారు?" అడిగాడతను నిట్టూర్పులు విడుస్తూ.

స్వామి ఇలా అన్నారు : మనం మరచిపోయిన సనాతన ధర్మాన్ని మరల గుర్తు చేసుకోవడమే దీనికి పరిష్కార మార్గం. మన ఋషుల

సంప్రదాయాన్ని మరల అమలుపరచటమే ఇప్పటి మన కర్తవ్యం. ప్రజలకు తిరిగి సనాతన ధర్మాన్ని తెలియజెప్పాలి. చతురాశ్రమ విధానంలోని పవిత్రతను, పరిపూర్ణతను వారికి విడమరచి చెప్పాలి. రామాయణ, భారత, భాగవతాది పవిత్ర గ్రంథాలను మళ్ళీ ప్రజలకు చేరువ చేయాలి. 'వాటిని ఆదర్శంగా గొని నిండైన గృహస్థులుగా జీవించి, తరిద్దాము ! అని ప్రజలకు నొక్కి చెప్పాలి. మళ్ళీ మన తాత్త్వికమైన దృక్పథాన్ని మనం పట్టా లెక్కించుకోగలగాలి. అప్పుడు ఇటు స్త్రీ నిందా ఉండదు. అటు పురుష నిందా ఉండదు. విడివిడిగా సంస్థలూ, వాటి అవసరాలు ఉండవు.

'మీరు చక్కగా చెప్పారు. మూలానికి తీసుకుని వెళ్లారు. అందు మూలాన 'ఇప్పుడు ఏం జరుగుతూ ఉన్నది?' అనేది వెంటనే అర్థమైంది. అలాగే 'ఇప్పుడు చేయవలసింది ఏమిటి ? అన్నది కూడా స్పష్టమయింది' - అంటూ పారవశ్యంతో చేతులు జోడించాడతను.



దేవుని బదులు

చిన్నతనంలోనే కుటుంబ బాధ్యతలు మీద పడ్డాయి. తమ్ముళ్ళని పెంచి పెద్దచేసి స్థిరపరచాను. చెల్లెళ్ళను పెంచి, పెళ్ళిళ్ళు చేశాను. బంధు మిత్రులచేత బొనసుపించుకున్నాను. ఇక అక్కడనుండి నాకు తెలిసి సమాజంలో ఎక్కడ ఏ మంచి పని జరుగుతున్నా యథాశక్తిగా పాలు పంచుకున్నాను. ఇంటికి ఎవరు వచ్చినా ఈ రోజుకీ, భోజనం చేయకుండా వెళ్ళనివ్వను. విస్తళ్ళ కట్టలు కట్టలు అలా కదలిపోతూ ఉంటాయి. భోజనాల పంక్తులు అలా నడచిపోతూ ఉంటాయి. నాకు తెలిసి నేను మంచి చేశానే తప్ప చెడు చేయలేదు. అలాంటి నాకు దేవుడు ఈ స్థితిని ఎందుకు తీసుకు వచ్చాడు. దేవుడు కనిపిస్తే ఇదే అడుగుదామనిపించింది. ఇప్పుడు ఆ దేవుడికి బదులుగా మిమ్మల్ని అడుగుతున్నాను. ఇప్పుడు నాకీ స్థితి ఎందుకు వచ్చింది ? ఇప్పుడు నాకా దేవుడిమీదే అసహ్యం వేస్తోంది. నాకీ దేవుడు ఇచ్చిన బహుమానం ఇది! ఇంత చక్కని బహుమాన మిచ్చే వాడేం దేవుడు ?

ఇప్పుడు నాకు కాన్సర్ వచ్చిందంటున్నారు. ఇంకా కొద్ది రోజులే బ్రతకడానికి అవకాశముంది అంటున్నారు. కాని, నాకు బ్రతకాలని ఉంది. దేశం నలుమూలలా చూడాలని ఉంది. ఊటీలాంటి ప్రదేశాలలో అలా హాయిననుభవిస్తూ, కొన్నాళ్ళపాటు అక్కడే ఉండిపోవాలని ఉంది. భార్యా బిడ్డల్ని ఇంకా కొన్నాళ్ళు చూసుకోవాలని ఉంది. వయస్సురీత్యా చూసినా, ఇప్పుడు నాకేమంత వయస్సు వచ్చిందని దేవుడిలా చేశాడు ? అసలు నాకు పట్టుకుంది, అసలు నేను చేసిన దోషమేమిటని ? నాకేం కనబడ్డం లేదు. మీరు చెప్పగలిగితే చెప్పండి. నేనేం దోషం చేశాను ?

చెప్పబడుతున్న దంతా ప్రశాంతంగా వింటున్న స్వామి అతడిని కూడా ప్రశాంతపడనిచ్చి, చుట్టూ కూర్చున్న వారందరివైపు ఒక్కసారిగా

చూశారు. అందరూ ఇప్పుడేం జరగబోతుందా? అని చూస్తున్నారు. ఇలా ఆర్తితో ఆక్రందిస్తున్న ఇతనికి వచ్చే జవాబు ఎలా ఉంటుందా? అని ఆతృతతో చూస్తున్నారు. ఆ ఆర్తుని ప్రక్కన అతని భార్య ఉంది. కొంచెం ప్రక్కగా అతని స్నేహితులే మరో ఇద్దరున్నారు. ఇక ఇటు ప్రక్కన కార్యకర్తల సముదాయం. అందరికీ ఉత్కంఠను కలిగిస్తున్నదా సన్నివేశం.

స్వామి ఇలా అన్నారు: పరిశుభ్రత అంటే మీకు ఇష్టమేనా?

'చచ్చేంత ఇష్టం. పరిశుభ్రత అంటే పడిచస్తాను నేను. దీనికి తగినట్లుగా మా కుటుంబ సభ్యులు కూడా నడుచుకుంటారు. పరిశుభ్రతకు లోటు రానివ్వరు. అది....మరీ.... నేనంటే భయంవల్ల కానివ్వండి, భక్తి వల్ల కానివ్వండి, లేదా నా ప్రోత్సాహం వల్ల వాళ్ళ కలిగిన అలవాటు వల్ల కానివ్వండీ! ఇల్లు మొత్తం అలా ఉండాల్సిందే'.

'సరే బాగుంది. పరిశుభ్రంగా లేని ప్రదేశాలకు మీరెప్పుడైనా వెళ్ళవలసి వచ్చిందనుకోండి. వెళ్ళి అక్కడ కొన్నాళ్ళు ఉండవలసి వచ్చిందనుకోండి. మీకేమనిపిస్తుంది? మీరేం చేస్తారు?' అని అడిగారు స్వామి.

నేనసలు అలాంటి చోట్లకు వెళ్ళను. వెళ్ళినా ఎక్కువసేపు ఉండను. ఒకవేళ ఉండవలసి వచ్చినా, ముళ్ళమీద పడిన గుడ్డలాగా ఉండి, పని పూర్తి చేసేసుకుని వచ్చేస్తాను. ఇంకొకసారి అలాంటి చోటికి వెళ్ళను. ఒకవేళ వెళ్ళ వలసివస్తే నా బదులు ఇంకెవరినయినా పంపి, నేను తప్పుకుంటాను.

'ఒకవేళ అలాంటివాళ్ళు మీ ఇంటికే వస్తే?'— అడిగారు స్వామి.

'రారు. అందరికీ తెలుసు మా ఇంటి పరిస్థితి. ఒకవేళ వచ్చినా, పద్ధతిగా లేకపోతే వారిని సహించేదిలేదు. పద్ధతి నేర్చుకోవడమో, ప్రక్కకు తప్పుకోవడమో అది వాళ్లు నిర్ణయించుకోవాలి.

జీవితంలో పద్ధతి లేకపోతేనే సహించనివాడిని, జీవితంలో లేకపోతే సహిస్తానా? అలాంటివాళ్ళను చాలా దూరంగా ఉంచుతాను. దరిచేరనివ్వను. వాళ్ళ ప్రసక్తి నా దగ్గర ఎవరన్నా తెచ్చినా సహించను. ఆ తెచ్చిన వాళ్ళను దూరంగా ఉంచేస్తాను. పద్ధతి ఉన్నవాళ్లు అంటే ఎంత ఇష్టపడతానో, పద్ధతి లేని వాళ్లు అంటే నాకంత అసహ్యం. వాళ్లు నా మనస్సులో మెదలడానికి కూడా అంగీకరించను'.

'పద్ధతి ఉన్నవాళ్ళను ప్రేమించడం బాగానే ఉంది. పద్ధతి లేనివాళ్ళను అసహ్యించుకోవటం ఎందుకు?'.

'వాళ్ళకు పద్ధతి లేదుగనుక!'

'లేకపోతే అసహ్యించుకోవాలా?'

'అసహ్యించుకోకుండా నేనుండలేను'.

'వారిలో మార్పు తెచ్చేటందుకు ప్రయత్నించవచ్చుగా?

'అది నా పద్ధతి కాదు'.

'మరి అసహ్యించుకోవడం పద్ధతి అంటారా!'

'అది నా పద్ధతి. నేనంతే!'

'మీచేత దూరంగా ఉంచబడిన వారి సంఖ్య పెరిగిందనుకోండి'.

'అనుకోవడమెందుకూ! పెరిగింది. ఈ కాలంలో పద్ధతి ఉన్నవాళ్లు ఎంతమంది ఉంటారు గనుక?'

'మరి అలాంటప్పుడు మీ మనస్సుకు అసహ్యించుకునే పని పెరుగుతోందేమో!'

'అందులో ఆశ్చర్యమేముంది?'

అయితే మీ ఇప్పటి స్థితికి కూడా ఆశ్చర్యపడవలసిన అవసరం దు. మీరు చాల బాధలో ఉన్నారు. నిజానికి మీకిలా చెప్పకూడదు. కాని,

మీరు దేవుణ్ణే తప్పు పడుతున్నారు కనుక ఆయన ప్రతినిధిగా మీతో ఇంత సేపటినుండి మాట్లాడుతున్నాను. పద్ధతిలేని వాళ్ళందరినీ అసహ్యించుకోవడంలోపడి, మీ మనస్సు ఆ ఏహ్యాభావానికే నిలయమైంది. దానికితోడు నాలాగా పద్ధతిలో ఉన్నవాళ్లు ఇంకెంతమంది ఉంటారు? అనే అహంకారం కూడా మీలో బాగా పెరిగింది. ఆ అహంకారం, ఏహ్యాభావాన్ని మరింతగా రెచ్చకొట్టింది. మానసికమైన ఆ దారుణ లక్షణమే క్రమంగా ఇప్పటి మీ వ్యాధిగా రూపుధరించింది. ఆలోచించుకోండి. మంచిపనులు చేయడంవేరు, మంచిగా ఉండడంవేరు, మీరు మంచిపనులు చేశారు. కాని, మానసికంగా మంచిగా ఉండలేకపోయారు. పద్ధతి లేని వాళ్ళను చూసి, జాలిపడవలసింది పోయి, వారిని చేరదీసి బాగుచేయవలసిందిపోయి, మీరు వారిని ద్వేషించారు. చెప్పండీ! ఈ ద్వేషాన్ని దైవం మెచ్చుకోవాలంటారా!

'అద్వేష్టా సర్వ భూతానాం మైత్రః కరుణ ఏవచ! అన్నది భగవానుని వాక్యము. జీవరాసులలో వేటినీ ఎన్నడూ ద్వేషించవద్దు. నీకు తగినట్లుగా ఉన్నవారితో మైత్రిచేయి. నీకుతగినట్లుగా ఉండలేక పోతున్నవారిని చూసి జాలిపడు. కరుణతో వారికి చేయూతనందించు.' ఇది భగవానుని సందేశం.

సృష్టిలో ఉన్న జీవరాసులలో దైవమే తప్పులు పట్టడం మొదలు పెట్టాడనుకోండి. ఇంకెవరు మిగులుతారు, చెప్పండీ! కనుకనే అతడు తప్పులు పట్టడు. అందరినీ ప్రేమిస్తాడు. అందరికీ బాగుపడే అవకాశమిస్తాడు.

చూడండీ! మంచివారిపైనా, చెడ్డవారిపైనా సూర్యుని వెలుగు, చంద్రుని వెన్నెలా ఒకేలా పడేలా చేస్తున్నాడా దైవం. ఆ వెలుగు వెన్నెలలు ఆయన ప్రేమ ధరించిన వెల్లువలు. ఆయనే అలా వీరు, వారవి చూడక, ఎక్కువ తక్కువలను ఎంచక, అందరినీ ప్రేమలో ముంచెత్తి

పేస్తుంటే, మనం తద్భిన్నంగా ప్రవర్తించవచ్చునా చెప్పండి! 'భక్తి' అంటే ఏమిటి? ప్రేమ! దేవుణ్ణి ప్రేమించడం! అంటే ఏమిటి! దేవుడిలాగా ప్రవర్తించడం, అలా ప్రవర్తించేటందుకు నిరంతరం ప్రయత్నం చేస్తూ ఉండటం! మరి ఇలాంటి ప్రయత్నం ఎంతవరకూ మీలో సాగిందీ అన్నది మీరు ఆలోచించుకోవలసిన మాట.

అతను కొంత అసహనంగా కనబడ్డాడు. ఈ చెప్పబడుతున్న మాటలు అతనికి కొంచెం బాగానే ఇబ్బంది కలిగిస్తున్నట్లున్నాయి. అతని భార్య కన్నులలో మాత్రం నీళ్ళు తిరగటం కనిపించింది. ప్రక్కన కూర్చుని ఉన్న అతని మిత్రులు ఈ లభిస్తున్న వివరణకు ఆశ్చర్యానంద భరితులవుతున్నారు. సోదర బృందంవారు అలా ఏకాగ్ర చిత్తంతో సందేశాన్ని అందుకుంటున్నారు.

స్వామి ఇంకా ఇలా అన్నారు! చూడండి! ఈ నా మాటలు మీకు కొంచెం ఇబ్బందిని కలిగిస్తున్నట్లున్నాయి. ఎందువల్లనంటే ఇవి మీ నమ్మకాల మూలాలను కదిలించి వేస్తున్నాయి కనుక! మీ జీవితం మొత్తాన్ని పరీక్షకు నిలబెడుతున్నాయి కనుక! ఆత్మ పరిశీలన చేసుకోవలసిన స్థితి మీకు ఎదురైంది కనుక! చూడండి! ఇది మీకు ఇబ్బందిని కలిగిస్తున్నా: దైవం మీ యెడల ప్రేమతో మీ కందిస్తున్న సందేశం! ఇన్ని నాళ్ళు మీరు దేవుడంటే విశ్వాసంగా ఉంటూ వచ్చారు ఆయన పేరిట చాల మంచి పనులు చేశారు. ఇప్పుడు ఈ తీవ్రమైన అనారోగ్యం ఏర్పడటంతో మీకా దైవంపైనే విశ్వాసం సడిలే స్థితివచ్చింది. అదే జరిగితే మీ జీవితం నరకమౌతుంది. అలా జరగటం దైవానికి ఇష్టం లేదు. ఆయన ప్రేమ మూర్తి! కనుక ఇలా కలుగజేసుకున్నాడు. సర్దుకోవలసినది ఏమిటో తెలియ చెబుతున్నాడు. శేష జీవితాన్ని, ఆయన చేస్తున్న సూచనను అమలు పరచుకోవడానికి వినియోగించండి. ఈ దేహం, ఈ జీవితం ఆయనే ఇచ్చినవి.

ఇవి ఇలా ఎన్నాళ్ళు నడుస్తాయన్నది ఆయనకే వదిలేయండి. దేహాలను ఎందుకు, ఎలా వినియోగించుకోవాలో మనకన్నా బాగా తెలిసిన వాడాయన. ఏమంటారు? మీరేమీ అనవద్దు. మీ వైపుకు మీరు చూడండి. దైవం చెప్పి నట్లు చేయండి. ఇక సెలవు".

సన్నివేశంలోని ఎవ్వరూ ఇక మాట్లాడగలిగిన స్థితిలో లేరు. వెలు వడిన సందేశం అతనితోపాటుగా అందరి మనస్సులకు కూడా అంతర్ముఖ త్వాన్ని అనుగ్రహించినట్లుగా ఉంది.

బంగారు సంకెల

'స్వామీ, నా మనస్సంతా కల్లోలితంగా ఉంది. ఒక పెను తుఫానులో చిక్కుకుపోయి ఉన్నాను నేను. దిక్కుతోచని స్థితి ఇది. అన్నం సయించదు. నిద్ర పట్టదు. పని నడవదు. బ్రతుకు సాగదు. నేనేం చేయను?' — అంటూ స్వామి పాదాలను చుట్టుకుపోతున్నా డొక యువకుడు.

స్వామి అతడిని మెల్లగా లేవదీసి కూర్చోబెట్టి, వెన్ను నిమురుతూ 'నీ బాధ ఏమిటో చెప్పు ముందు. ఏం చేయాలో నేను చెపుతాను' — అన్నారు.

ఆ యువకుడి కనులవెంట బొటబొటా కన్నీరు శరీరమంతా ఒక విధమైన కంపం. ఉద్వేగంతో వణుకుతున్నాడతను. తమాయించుకోలేక పోతున్నాడు.

స్వామి అలా అతని వెన్ను నిమురుతూనే ఉన్నారు.

కొంతసేపటికి స్వామి స్పర్శతో తనని తాను కూడదీసుకుని ఇలా చెప్పడం ప్రారంభించాడు : "మాస్టారూ! క్లుప్తంగా నా కథను చెపుతా

నండీ! ఈ మధ్య నేను మీకు కనబడలేదుకదా! ఉద్యోగరీత్యా చాల దూర ప్రాంతాల్లో ఉండిపోయాను. ఇటీవలే ఇక్కడికి వచ్చాను. రాకుండా ఉండి పోయినా బాగుండేదేమో! అని ఇప్పుడనిపిస్తోంది. వచ్చినప్పటి నుండే మాష్టారూ! నాకీ దుస్థితి సంప్రాప్తించింది".

'అసలేం జరిగిందయ్యా?' అడిగారు స్వామి.

కన్నీళ్ళను తుడుచుకుంటూ, పెదవుల వణకును అదుపు చేసుకుంటూ అతను ఇంకా ఇలా చెప్పాడు. 'ఏం లేదు మాష్టారూ! అసలేం జరిగిందంటే ఉద్యోగానికి వెళ్ళబోయేముందు ఇక్కడొక రెండు సంవత్సరాలు ఉద్యోగ ప్రయత్నం చేసుకుంటూ ఖాళీగా ఉండిపోయాను నేను. ఖాళీగా ఉన్న ఆ సమయంలో యూనివర్సిటీలో ఒక ప్రొఫెసర్ గారికి చేరువయ్యాను. ఇంతింతని చెప్పలేనంతగా చేరువయ్యాను. వారి బిడ్డలలో ఒకడినై, ఇంకా చెప్పాలంటే అంతకంటే ఎక్కువైన్లే తిరిగాను. ఆయన మాటే నా బాటగా సాగాను. వారి ఇల్లే నా దినచర్యకు కేంద్రమయింది.

ఆ కథ అలా నడుస్తూ ఉండగా, ఆయన నాకొక మహిమాన్వితుణ్ణి గురించి చెప్పడం ప్రారంభించారు. ఆ మహిమాన్వితుడు సాక్షాత్తు అవతార మూర్తేనని నా హృదయంలో ముద్రవేశారు. ప్రక్కన కూర్చోబెట్టుకొని ఆ మహిమాన్వితుని పూజించటం ఎలాగో నేర్పారు. ఆ మహిమాన్వితుని స్మరణలోనే దినచర్యను నడుపుకోమని ఆదేశించారు.

'నేను ఎవరంటే ఇష్టపడుతున్నానో, ఆయనకు ఇష్టదైవం కదా ఈ మహిమాన్వితుడు' అని నేనూ ఇష్టపడసాగాను. ఆయన చెప్పినట్లుగా ఆ మహిమాన్వితుని పూజలో, స్మరణలో జీవితాన్ని నడపసాగాను.

ఇంతలో నాకు ఉద్యోగము వచ్చింది. చాల దూర ప్రాంతంలో వచ్చింది. వెళ్ళాలా! వద్దా? అన్న మీమాంస వచ్చింది. నేను ఆలోచించడ

మెందుకు? అని నేను ఇష్టపడే ఆ ప్రొఫెసర్‌గారినే అడిగాను. ఆయన 'ఇదంతా ఆ మహిమాన్వితుని అనుగ్రహమే' — నన్నారు. మహిమాన్వితుని ఛాయాచిత్రాన్ని చేతికిస్తూ, ఇదే ఇక నిన్ను నడిపిస్తుంది' అన్నారు. నేను వారికి నమస్కరించి, వెళ్ళి ఉద్యోగంలో చేరాను. వారిచ్చిన ఆ చిత్రాన్ని పెట్టుకొని, వారి ఆదేశం మేరకు ఆ స్మరణలోనే దినచర్యను గడపసాగాను.

నాకూ, ప్రొఫెసర్‌గారికి మధ్య ఉత్తరాలు నడుస్తూ ఉండేవి. క్రమంగా నేను ఆ ఉత్తరాలలో ఒక మార్పును గమనించాను. మొదట్లో ఆయన మహిమాన్వితుని గురించి ఎక్కువగా వ్రాస్తూ చివరగా యోగ క్షేమాల గూర్చి కొద్దిగా వ్రాసేవారు. కాని, కాలం గడుస్తున్నకొద్దీ, ఉత్తరాలలో మహిమాన్వితునికి చోటు తగ్గుతూ వచ్చింది. క్రమంగా ఆ ప్రసక్తే రావడం మానేసింది. నేనువ్రాసే ఉత్తరాలలో ఆ ప్రస్తావన ఎంతతెచ్చినా, వారినుండి నాకు వచ్చే ఉత్తరాలలో ఆ ప్రస్తావన ఉండేదికాదు. "ఏమిటా ఇది" అనుకున్నాను. అంతకంటె ఇంకా ఏమీ నేను అనుమానించలేదు. ఎందుకని అంటే నేను వారిని అనుమానించలేను గనుక.

ఇంకా కొన్నాళ్ళకి ఉత్తరాలు రావటంకూడా తగ్గింది. ఎప్పుడో ఒకసారి, అరసారి మాత్రమే ఆయననుండి ఉత్తరాలు వస్తూ ఉండేవి. అప్పుడూ నేను అనుమానించలేదు. బహుశ పనుల వత్తిడిలో ఉండి వ్రాయలేకపోతున్నారు అనుకున్నాను. ఆయన్ని ఇబ్బంది పెట్టడం ఎందుకని నేను వ్రాయడం కొంత తగ్గించాను. ఇలా మా మధ్య ఒక విధమైన మౌనం కొంతకాలం రాజ్యమేలింది. ఆయన నా కందించిన ఆ మహిమాన్వితుని స్మరణలోనే ఈ మౌనాన్ని తట్టుకొనే ప్రయత్నం చేశాను. ఆ స్మరణను మరింత అధికం చేశాను. ఆ స్మరణ లేనిదే ఉండని స్థితికి వచ్చాను. అది మరి, ఆయన నా జీవితానికి కానుకగా ఇచ్చింది కదా ఆ స్మరణ! ఆయన మీద నాకున్న ప్రేమనంతా, ఆయన చూపించిన ఆ మహి

మాన్వితుడి పైకే మరలించాను. దేశంకాని వేశంలో అలా ఆ స్మరణలోనే బ్రతుకు గడిపాను.

ఇక్కడికు రాగానే వెంటనే ఆయన దగ్గరకు వెళ్ళాను. ఆశ్చర్యం వేసింది. ఆ ఇల్లంతా ఇప్పుడు క్రొత్తగా ఉంది. మహిమాన్వితుడి ఫొటో లన్నీ అక్కడ ఇప్పుడు మాయమైపోయాయి. ఆ స్మరణ లేదు. ఆ ప్రస్తావన లేదు, అసలా ఊసే అక్కడ లేదు. కుటుంబ సభ్యులంతా కూడా క్రొత్తగా కనిపించారు నాకు. వారు నన్ను మామూలుగానే పలకరించారు గాని, నాకేమిటో అంతా క్రొత్తగా ఉన్నట్టనిపించింది. కారణం అది వరకు సంవత్సరాల తరబడి అక్కడే మరొక వాతావరణంలో తిరిగిన వాడిని కనుక! 'ఏమిటీ పరిస్థితి?' అని ప్రస్తావించలేకపోయాను. ఎందువల్ల నంటే ఆయన చూపులు అలా ఉన్నాయి. 'పొరపాటున ఆ ప్రస్తావన ఏమైనా తెస్తావేమో. ఇక్కడ అలాంటివాటికి అవకాశం లేదు' అన్నట్లుగా.

నాకు బుర్ర తిరిగిపోయింది. నేను ఎక్కడున్నానో నాకు తెలియని పరిస్థితి ఏర్పడింది. తట్టుకునే పరిస్థితిలో లేను, కాని ఈ విషయంలో నన్ను పట్టుకొని ఓదార్చేటందుకు మాత్రం ఎవ్వరూ సిద్ధంగా లేరని బోధపడింది. ఏమీ తోచక అక్కడ నుండి వెళ్ళాలని లేకపోయినా వెళ్ళిపోయాను.

ఆ తరువాత కొన్నాళ్ళకి వారిక్కీ, నాకూ ఆత్మీయులైనవారి ద్వారా జరిగిందేమిటి? అన్నది తెలుసుకోగలిగాను. అదేమిటీ? అంటే, ఈ ప్రొఫెసర్‌గారు తన బిడ్డలకు ఆ మహిమాన్వితుని సాన్నిధ్యంలో, సారధ్యంలో నిర్వహించ బడుతున్న కాలేజీలలో చేర్పించారట, పనిపేశా తీసుకు వెళ్ళిమరీ! ఆ పిల్లలు చాలా చురుకైనవారు. తెలివైనవారు. కేవలం విశ్వాసంతో సరి పెట్టుకునేవాళ్ళు కాదు వాళ్ళు. ఆ కారణాన, అక్కడ చదువుకుంటూనే ఆ మహిమాన్వితుని చర్యలను సూక్ష్మంగా పరిశీలించడం మొదలు పెట్టారు. ఈ మహిమలను ఆయన ఎలా చేస్తున్నాడు? అని వాళ్ళు తీవ్రంగా పరిశీలించ

సాగారు. పరిశీలిస్తే వాళ్ళకు తేలింది ఏమిటి? అంతే, ఏ వస్తువులనూ ఆయన సృష్టించడం లేదు. గదులలో ప్రత్యేకించి భద్రంగా ఏర్పాటు చేయ బడినవాటిని, తన చేతులలోనికి రప్పిస్తున్నాడంతే. ఆ వస్తువులన్ని వివిధ మార్గాలద్వారా సేకరించిగాని, లేదా ప్రత్యేకించి కొనిపించిగాని, అక్కడ చేర్చుతున్నవే! ఈ అంశం తెలియడంతో ఆ కుర్రవాళ్ళ విశ్వాసం యొక్క మూలాలు కదలిపోయాయి. ఆ పైన వారు మరింత దగ్గరగా ఆయనను పరిశోధించి, తాము గ్రహించినది సత్యమేనని మరల మరల రూఢి చేసుకున్నారు. రూఢి అవుతున్నకొద్దీ, వారికి ఆయనంటే ఏహ్య భావం కలగడం మొదలుపెట్టింది. ఇక అక్కడ ఉండలేకపోయారు. ఇంటికి వచ్చి తల్లిదండ్రులను కూర్చోబెట్టి, తాము పసిగట్టిందంతా చెప్పు కొచ్చారు. తల్లిదండ్రులు బిడ్డల్ని నమ్మారు. ఇక అంతే! మహిమాన్వితు డికి ఆ ఇంటిలో చోటు లేకుండా పోయింది. ఆ స్మరణ అక్కడనుండి నిష్క్రమించింది. వారిప్పుడు ఆయన నెవరైనా తలిస్తేవాలు మండి పడు తున్నారు. ఇలా వాళ్ళు మహిమాన్వితునితో చెల్లు చీటీలు పుచ్చుకున్న తరువాత నేను ఇక్కడికి రావడం, ఆ ఇంటికి వెళ్ళడం జరిగింది. గుండె పిండేసినట్లయింది నాకు. ఏం చేయాలో ఏమీ పాలుపోని స్థితిలో పడి పోయాను.

మాష్టారూ! ఇప్పుడు చెప్పండి, నేనేం చేయాలో. ఇప్పుడు చెప్పండి, నేనా స్మరణను కొనసాగించాలా? మానాలా? సాగుతున్న స్మరణ కాబట్టి కొనసాగించాలనిపిస్తుంది. దాని నెవరు నాకు అందించారో, వారే మానే శారు కాబట్టి, నేనూ మానేస్తే ఎలా ఉంటుంది? అనిపిస్తుంది. అలవాటుపడి పోయిన నాకు ఆ మహిమాన్వితుని రూపం గుర్తుకొస్తూ ఉంటుంది. ఆ వెంటనే వీళ్ళిప్పుడున్న పరిస్థితీ గుర్తు కొస్తుంది. ఇప్పుడు నేనేం చేయాలి? వాళ్ళనీ ఈ స్మరణ చేయండి అని చెబుదాము అంటే మా కంటే నీ కెక్కువ తెలుసునా? అని అడగరూ! పోనీ నేను కూడా వారితోపాటు

మానేద్దామంటే ఇన్నినాళ్ళ అభ్యాసం నన్ను విడిచిపెట్టడం లేదే! ఈ సంఘర్షణలో నేను నలిగిపోతున్నాను. నా మనస్సు అలసి పోతున్నది. ఏదో చూస్తున్నవాళ్ళకి తిరుగుతున్నట్లు కనిపిస్తున్నాను తప్ప, ఈ సంక్షోభానికి నేనే తట్టుకోలేక పోతున్నాను. మాష్టరుగారూ! ఏం చేయాలో మీరే చెప్పాలి ఇప్పుడు. నన్ను ఒడ్డుకు చేర్చవలసినవారు మీరే! అంటూ అతడు స్వామి పాదాలపై వాలిపోయాడు.

అతణ్ణి లేవనెత్తి ప్రక్కన కూర్చోబెట్టుకుని, వెన్ను నిమురుతూ, కన్నులలోనికి చూస్తూ ఇలా అన్నారు స్వామి: 'ఇంతకూ ఇబ్బంది ఎక్కడ వచ్చిందీ? అంటే మహిమల్ని విశ్వాసానికి పునాదులుగా, తీసుకోవటం వల్ల వచ్చింది. వాళ్ళ మహిమలను చూస్తూ ఏవేవో ఊహించుకున్నారు. ఏవేవో కథలు చెప్పుకున్నారు. ఏవేవో ప్రచారాలు చేసుకున్నారు. తీరా దగ్గరకు వెళ్ళి చూసేటప్పటికి ఆ మహిమలు వాళ్ళనుకున్న పంథాలో జరగటం లేదు. దానితో వాళ్ళ నమ్మకం పునాదులు కదిలిపోయాయి. అంతే! వాళ్ళు ఆయన్ని ద్వేషించసాగారు.

నిజమైన మహిమలు జరుగుతాయి తప్ప, చేయబడవు. తమనుండి ఆ మహిమలు జరుగుతున్నట్లుగా ఆ మహాత్ములకు కూడా ఎరుకలో ఉండకపోవచ్చును. అవి లోకహితార్థమై వారినుండి జరుగుతూ ఉంటాయి. ఆ మహాత్ములు వాటిని పెద్దగా పట్టించుకోరు కూడా. ఎందుకనంటే వారి దృష్టి లోకహితం మీదనే ఉంటుంది కనుక! ఇక మహిమలు చేయబడుతున్నాయి అంటేనే వాటికి ఆధారం ఎక్కడో అక్కడ ఉన్నదీ అని అర్థం. జరిగే మహిమలకు దైవం ఆధారమైతే, చేయబడే మహిమలకు ఈ చేసే పెద్దవాడు ఏదో ఒక విధమైన పెద్ద ఏర్పాటు చేసుకునే ఉంటాడు అని అర్థం.

ఇంకా కొంచెం పైకి వెళ్ళిచూస్తే అసలు ఈ సృష్టిలో మహిమ

అనేదే లేదు. 'మహిమ' అని ఏదైనా చెప్పవలసింది ఉంది అని అంటే అది ఈ సృష్టియొక్క వ్యక్తీకరణమే. ఈ సృష్టి వ్యక్తమవటమే ఒక మహిమ. 'ఏతావానస్య మహిమా' అని వర్ణిస్తున్నది పురుషసూక్తం. చూస్తే మొత్తాన్ని ఈ దైవం యొక్క మహిమగా చూడు. లేదా! అసలు నీవు ఆశ్చర్యపడేది ఏదీ ఈ సృష్టిలో లేదు! అన్నది పెద్దలమాట. మన ఉద్దేశంలో మహిమ అంటే ఏమిటి? మనకింకా అంతుపట్టని దాన్ని మహిమ అంటున్నాం. మనమింత వరకు అలవాటుపడని దానిని చూస్తే ఆశ్చర్యపడుతున్నాం. అదేదో అంతుపడితే, దానిని చూడటానికి మనం అలవాటు పడితే, అదీ ఈ సృష్టిలోని ఒకానొక లక్షణమని మనకు తెలుస్తుంది. ఇప్పుడు చెప్పు. మనం వాడుతున్న 'మహిమ' అనే మాటకు అర్థం ఏమిటి? 'మనకింకా తెలియనిది' అని తెలియనిదానిని చూచినప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేయడం జిజ్ఞాసువుల లక్షణం. వెర్రిగా గంతులువేస్తూ కేరింతలు కొట్టడం ఆవేశపరుల లక్షణం. దివ్యజ్ఞాన సమాజ స్థాపకురాలైన బ్లావెట్స్కీ అంటుంది కదా ఒకచోట- 'అసలు ఆశ్చర్యపడ వలసిందిగాని, మహిమగా పరిగణించవలసింది గాని ఈ సృష్టిలో ఏదీలేదు. అలా ఏదైనా కనబడుతూ ఉన్నదీ అంటే దానిని మనం అర్థం చేసుకోవలసి ఉన్నది అని. అలా చెప్పటమే కాదు. అలా చెబుతూనే. మనం అనుకుంటున్న మహిమ లెన్నింటినో ఆవిడ స్వయంగా చేసి చూపించింది కూడా! చేసి చూపిస్తూ, అవి ఎలా నిర్వహింపబడతాయో శాస్త్రీయంగా వివరణ చేసిందామె.

అనాదిగా మనవాళ్ళు వ్యక్తులద్వారా వ్యక్తమయ్యే దివ్యమైన గుణగణాలను బట్టి ఆయా వ్యక్తులను దివ్యాంశ సంభూతులుగా దర్శిస్తూ వస్తున్నారు. గుణగణాలనుబట్టి గాక, కేవలం మహిమలూ, మాయలు పట్టుకొని వాటినే దివ్యత్వంగా పరిగణించి పరుగెత్తటం అనేది ఈ కలియుగ లక్షణం.

దివ్యత్వం వ్యక్తమయ్యేది ప్రవర్తనలో. ఒక వ్యక్తిలో దివ్యాంశ వెలుగుతున్నదా? లేదా? అని చెప్పవలసింది అతని ప్రవర్తనను బట్టి, జీవన విధానాన్ని బట్టి. అంతేగాని మహిమలు, ఇతర విషయాలను బట్టి కాదు. ప్రవర్తన జీవన విధానాలపై నుండి ఇతర విచిత్ర అంశాలపైకి దృష్టి మళ్ళడం దిగజారిన మన జీవనస్థాయికి నిదర్శనం. పవిత్రమైన వారి ప్రవర్తనను గమనించుకుంటూ, మన ప్రవర్తనను మంచిగా మలచుకోవడానికి ప్రయత్నించాలి గాని, మహిమలు మొదలైన వాటిని మాత్రమే పట్టుకొని అదే దివ్యత్వమని వ్రేలాడితే ఇదిగో ఇలాగే జరుగుతుంది.

ఇక నీవు చెప్పిన మహిమాన్వితుడి విషయానికి వస్తే, మీవాళ్ళు క్రొత్తగా కనిపెట్టి, కంగారు పడిపోవలసింది ఏమీలేదు. కొంచెం ఆవేశాన్ని తగ్గించుకొని, ముందుకు చూసి ఉంటే వారికి ఈ అంశం ఎప్పుడో తెలిసి ఉండేది. రకరకాల కంపెనీల వస్తువులు ఆయన గాలిలోనుండి తీసి ఇస్తున్నాడు. ఆ వస్తువులపైన ఆ కంపెనీల పేరు, వివరాలూ, ముద్రలూ అన్నీ యథాతథంగా ఉంటున్నాయి. అంటే అర్థమేమిటి? ఇవేవీ నేను సృష్టించలేదు. ఇవన్నీ ముందుగా తెప్పించి అట్టిపెట్టబడినవే. మీ కివ్వాలని పించి, మీకు తీసి ఇస్తున్నాను అనేనా! ఇంకేమయినా ఉందా దాని అర్థం? ఆయన్ని గురించి మనమే ఏవేవో అనేసుకొని, మళ్ళీ కొన్నాళ్ళకి మన వైపు దిగిన తరువాత 'చూడండీ, ఆయన అలా లేదు' అంటే ఆయనేం చేస్తాడు? పాపం ఆయన అప్పుడు ఎలా తీస్తున్నాడో, ఇప్పుడూ అలాగే తీస్తున్నాడు. ఇవన్నీ ఆవేశపరులు తాముగా కోరి సృష్టించుకుంటున్న ఇబ్బందులు.

'అయితే అవి ఆయన అలా ఎందుకు తీయాలి? అవతల గదిలో పెట్టిన దానిని వెళ్ళితెచ్చి ఇవ్వవచ్చును గదా! లేదా కొన్ని తెచ్చి తనదగ్గర అట్టిపెట్టుకుని ఇవ్వవచ్చుగదా! అనవచ్చు కొందరు. అది ఆయనకు సంబం

ధించిన అంశం. ఆయన అలా తీయడమనేది ఒక కళగా అభ్యాసం చేశాడు. అనేక విద్యలలో అదొక విద్య. ఆ విద్యను అభ్యసించి జనంమీద ప్రయోగించ దలచాడాయన. ప్రయోగం ఫలించింది. జనం పెద్ద ఎత్తున ఆయనకు దగ్గరయ్యారు. జనంతోపాటు ధనమూ ఆయనకు చేరువైంది. జనాన్ని, ధనాన్ని కలిపి, సమాజానికి అవసరమైన మంచి పనులు కొన్నింటిని చేయించడం ప్రారంభించాడాయన. మంచి పనులు ప్రారంభం కావటంతో ఆయనకు కొంత మంచి పేరు రావడం ప్రారంభించి, క్రమంగా ఆ పేరు పెరగసాగింది. జనాన్ని ఆకర్షించడానికి ఈ విద్యను ఎందుకు ప్రదర్శించాడు అన్నదానికి ఆయన ఆలోచన ఆయనకు ఉండి ఉండవచ్చును. కేవలం మంచి మాటలు చెప్పి, మనం ఎందరిని మళ్ళించగలం? ఇలాంటిదేదో అవలంబిస్తే జనం వద్దన్నా మనదగ్గరకు చేరుతారు అనుకున్నాడేమో ఆయన. లేదా ఈ విద్యను ప్రదర్శించడం వల్ల, ఇది ఒక దివ్యత్వంగా పరిగణింపబడటం వల్ల తొందరగా తననుకున్నది సాధించగలననుకున్నాడేమో! అది ఆయన చెప్పాలి. మొత్తంమీద జన సమీకరణ బాగా చేశాడు. ధన సమీకరణ బాగా చేస్తున్నాడు. జనశక్తి, ధనశక్తుల సద్వినియోగం కూడా బాగానే చేస్తున్నాడు. ఇంతవరకూ అందరూ అంగీకరించ వలసిందే. తప్పక ఆయనను అభినందించ వలసినదే!

అయితే ఇంకా కొంచెం పైకి వెళ్ళిచూస్తే ఒకే ఒక సూక్ష్మాంశమున్నది. అదేమిటి అంటే, 'తనకు అలవడిన విద్యను ఆయన సద్వినియోగం చేస్తున్నాడా? సద్వినియోగం చేసుకుంటున్నాడా? అన్నది. సద్వినియోగం చేయడం అంటే దైవానికి సమర్పణగా, నిష్కామకర్మగా ఆచరించటం అన్నమాట. సద్వినియోగం చేసికోవడం అంటే ఆ సత్కార్యాచరణలో కొంత కామం అంటే కోరిక కలిగి ఉండటం అన్నమాట. ఆ కామం భౌతికమైనదే కానక్కరలేదు. మానసికమైనది కావచ్చు. భౌతికమైనా, మానసికమైనా కోరిక కోరికే! కీర్తి ప్రతిష్ఠలు లభించాలను కోవటం

కూడా కోరికే. ఇంకెవరికీ లభించనంతగా మనకు లభించాలను కోవడం ఇంకా పెద్దకోరిక. అలాంటిదేదైనా ఆయనలో ఉన్నదా? లేదా? అనేది అది ఆయనకూ, దైవానికీ సంబంధించిన అంశం.

ఎందుకని ఈ అంశాన్ని వివరించవలసి వస్తున్నదీ అంటే, అనేక సార్లు ఆయన తనను ఒక అవతారమూర్తిగా ప్రకటించుకుంటున్నాడు. నిజంగా అవతారమూర్తే అయి ఉన్నప్పటికీ అది మనం గ్రహించుకోవాలి గాని, ఆయన ప్రకటించుకోవలసిన అంశం కాదుకదా! అలా పదే పదే ప్రకటించుకోవటం చూస్తూ ఉంటే, అవతారమూర్తి అని అనిపించుకోవా లనే కోరిక ఈయనలో ఉన్నదీ అని అనిపించక మానదు. అదే నిజమైతే అది ఒక బంగారు సంకెల. ఎందువల్ల ఇలా చెప్పవలసి వస్తున్నదీ అంటే రామకృష్ణాది అవతారమూర్తు లెవ్వరూ ఇలా పదే పదే తాము అవతార మూర్తులమని ప్రకటించుకోలేదు. ప్రజలే వారి అవతార తత్త్వాన్ని దర్శించి కీర్తించుకున్నారు. ఈ అంశం గమనింప తగినది. తాను అవతార మూర్తిగా ప్రసిద్ధి చెందాలని ఆయనకు అనిపించి, అందుకు తన కలవడిన ఈ విద్యను ఉపకరణంగా వాడుకొని, జన ధనాలను సమీకరించి, పదిమందికీ పనికివచ్చే మంచి పనులను శ్రద్ధగా చేస్తున్నాడాయన అని అనుకోవడానికి అవకాశ ముంది. ఒకవేళ అదే నిజమయితే అది ఆయనకు సంబంధించిన అంశం. దైవం ఆయనను సరిచూడవలసిన అంశం. దేశానికీ, ప్రజలకూ సంబం ధించినంత వరకూ మాత్రం ఆయన మంచిమాటలే చెపుతున్నాడు. మంచి పనులే చేస్తున్నాడు!

ఇక నీ స్మరణకు సంబంధించి అంటావా? దానిని నీవు నిశ్చింతగా కొనసాగించుకోవచ్చు. ఎందువల్లనంటే ఈ సృష్టి మొత్తం దైవస్వరూ పమే. ఇందులోని ఏ వస్తువునుగాని, ఏ వ్యక్తినిగాని దైవానికి ప్రతీకగా స్వీకరించే అవకాశం నీకుంది. నీవు దేనిని స్వీకరించి చిత్తశుద్ధితో ఆరాధిం

చినా దైవం నీకు తప్పక ప్రసన్నమవుతాడు. కనుక నీవు అలవాటుపడిన స్మరణను నీవు మానవలసిన పనిలేదు. నీవు అలవాటుపడిన రూపాన్ని త్యజించవలసిన అవసరమూ నీకు లేదు.

ఇ. కె. మాష్టరుగారు ఒక చిత్రమైన వాక్యం చెపుతూ ఉండేవారు. 'రాతిని దేవునిగా మలచుకుని, తద్వారా దైవాన్ని దర్శిస్తూ, మానవుడు తరిస్తున్నాడు. మానవుడు తరిస్తున్న ఆ సమయంలోనే ఆ దేవునిగా మలచ బడిన రాయి, తన పరిణామక్రమంలో తానూ ముందుకు వెళుతున్నదీ' అని. అలాగే నీవు ఒక వ్యక్తి రూపంలో దైవాన్ని దర్శించావు. ముందుకు సాగుతున్నావు. సాగిపో. నీవు ఎవరిలో అయితే దైవాన్ని దర్శస్తున్నావో, ఆ వ్యక్తికీ ఒక సాధనా, ఒక ప్రయాణమూ ఉన్నాయి. అది అతడు చూసుకుంటాడు. అతడిపైనున్న దైవం చూసుకుంటాడు. కనుక నేను కొలుస్తున్న ఇతనిలో దైవాంశ ఎంత అని నీవు కొలుస్తూ కూర్చుండవలసిన అవసరం లేదు. అనుభూతి నీకు లభించడమనేది నీవు పూజిస్తున్న వ్యక్తిలో విచ్చుకున్న దైవాంశ ఎంత అన్నదానిపైన ఆధార పడి ఉండదు. నీలో జరుగుతున్న సాధనపైన ఆధారపడి ఉంటుంది. కనుక మనం చూడవలసింది మనవైపే. మన ప్రయాణంవైపే. ఏమంటావ్?

ఆ యువకుని కన్నులవెంట ఆనందం బాష్పాలై కురుస్తోంది అతని కన్నుల్లో కృతజ్ఞతా భావం మెరుస్తోంది. జోడించబడిన అతని చేతులు, సాధనలో కుదురుకున్న అతని యోగస్థితిని తెలియజేస్తున్నాయి. స్వామి హస్తం అతని వెన్నును నిమురుతోంది.

దగ్గరగా చూశాను

ఆ రోజు ఆదివారం. స్వామి విజయవాడలో ఉన్నారు. అది తెలిసి సోదర బృందంలో చాలమంది స్వామిని చూడవచ్చారు. సాయంత్రం ప్రేయరు చక్కగా సాగింది. తరువాత కార్యక్రమమంటూ ప్రత్యేకించి లేకపోవడంతో స్వామితో కలసి కబుర్లు చెప్పుకోవడమే కార్యక్రమంగా రూపొందింది. సరససల్లాపాలతో ఆ సమయం రసవత్తరంగా నడుస్తున్నది.

మధ్యలో ఒకామె అన్నది. "మొన్న అమ్మ చదివి వినిపించింది భారతం - ధర్మాద్వైతం. ఎంత బాగుందో! చదువుకున్న దానికంటే ఎవ రైనా చదువుతుంటే వింటూ ఉంటే బాగుంటుంది".

ఆమె తృప్తిగా చూస్తున్నది.

స్వామి ఇలా అన్నారు : "నీవు చెప్పినదానిలో ఎంతో నిజం ఉంది. చదువుకున్న దానికంటే, ఎవరిచేతైనా చదివించుకొని విన్నప్పుడు చాల బాగుంటుంది. చదువుతున్నప్పుడు కనపడేవి పదాలు. చదివించుకొని వింటున్నప్పుడు ఆ పదాలు శబ్దాలవుతున్నాయి. ఆ శబ్దాలు మన మనస్సుకు ఆయా దృశ్యాలుగా గోచరింప జేస్తున్నాయి. అందుకే మన పెద్దలు పురాణ పఠనాలను ఏర్పాటు చేశారు. పురాణం చెప్పేటప్పుడు ఏం చేస్తారు? ఇద్దరు వ్యక్తులు వేదికమీద కూర్చుంటారు. ఒకరు మూలగ్రంథం చదువుతూ ఉంటారు. మరొకరు వ్యాఖ్యానం చేస్తూ ఉంటారు. గ్రామస్థులందరూ వింటూ ఉంటారు. మనం ఒక్కళ్ళమే కూర్చుని ఆ పురాణాన్ని చదువు కుంటే అంత అనుభూతి కలుగుతుందా!"

"కలగదండీ" - అన్నదామె.

"అంతేకాదు. ఈ పురాణ ప్రవచనంలో ఇంకో ప్రయోజనం ఉంది. చదువుకోవాలి అంటే చదువు రావాలి. చదువుకోవటం చేతకావాలి. అదే

పురాణ ప్రవచనం వినటానికి ఇసేమీ అక్కరలేదు. హాయిగా మనస్సు పెట్టి వింటేచాలు. ఆ మనస్సును కూడా ఒకసారి అటువైపు పెడితేచాలు. ఆపైన ప్రవచనకర్తల కంఠనాదం, వ్యాఖ్యాన వైభవమే దానిని నిలబెట్టు కుంటుంది. ఒక విధమైన యోగస్థితి పురాణ ప్రవచనం జరుగుతున్నంత సేపూ అందరూ అనుభవిస్తారు. ఎంత అదృష్టమది!" అన్నారు స్వామి.!

అందరూ ఆనందంతో వింటూ ఉన్నారు.

అంతలో ఒకామె అన్నది: 'నా పరిస్థితే మరీ దారుణం మాస్టారూ! వచ్చిన చదువా అంతంత మాత్రం. పోనీ కూడబలుక్కుని చదువుకుందా మంటేనా ఒకటే కళ్ళనొప్పులు. పుస్తకాలుండీ ప్రయోజనం లేకుండా ఉంది".

ఆమె దీనంగా చూస్తోంది.

స్వామి ఇలా అన్నారు. "మీ అమ్మాయి ఉందిగా, అమ్మాయి చదువుతూ ఉంటే నీవు వినవచ్చుగదా".

"ఆ! దాని చదువుతోటే దానికి సరిపోతోంది. ఇంక నాకెక్కడ చదివి వినిపిస్తుంది. దాని చదువొకటి అది చదువుకుంటే చాలు. ఈ ఉద్దే శ్యంతోనే దానికి పనులుకూడా ఏమీ చెప్పను, ఇంతచేసినా దానికి వచ్చిన చదువే కనపడటం లేదు" అన్నదామె బాధగా.

స్వామి చిరునవ్వుతో ఇలా అన్నారు: "ఇంత చేసినా అమ్మాయికి చదువురావటం లేదంటావు! రాకుండా ఉండటానికి చేయవలసినదంతా చేశావు".

ఆమె ఆశ్చర్యంగా చూసింది.

స్వామి ఇంకా ఇలా అన్నారు. "కదామరి! నీ చదువు నువు చదువుకో, నీ చదువు నీవు చదువుకో!" అంటూ ఆ అమ్మాయికి మీరు

చేస్తున్నదేమిటో తెలుసునా! ఒంటరిదాన్ని చేయడం. ఇంట్లో మీరు కలవ నివ్వరు. మనసు విప్పి మాట్లాడే అవకాశం ఇవ్వరు. అప్పుడా అమ్మాయి ఏం చేస్తుంది. సహవాసలగత్తెలవైపు మొగ్గుచూపుతుంది. ఆ సహవాస గత్తెలు మంచివాళ్ళయితే ఫరవాలేదు. వాళ్ళది చెడ్డ సంస్కారమైతే ఏమవు తుంది? అమ్మాయి జీవితం మనం ఊహించని మలుపులు తిరుగుతుంది. అప్పుడు నెత్తీ, నోరు కొట్టుకొని ఏం లాభం?

చదువంటే వాళ్ళ క్లాసు పుస్తకాల్లో మాత్రమే ఉన్నదనీ, చదువు చెప్పేవాళ్ళంటే వాళ్ళ టీచర్లు మాత్రమేనని మనం భ్రమపడుతున్నాం. భ్రమపడి కావలసిన ఫీజులు కట్టి, పుస్తకాలు కొనిపెట్టి కళ్ళు మూసుకొని కూర్చుంటున్నాం. మనం కళ్ళు తెరిచేటప్పటికి కథలు అనుకోని మలుపులు తిరుగుతాయి. అప్పుడిక కలవరపడిపోతాం.

చదువంటే నాలుగు గోడల మధ్య చెప్పింది కాదు. ఇంట్లో పని నేర్చుకోవటమూ చదువే ! నలుగురితో కలసి జీవించగలగడమూ చదువే ! మనం చదువుకోవాలే కానీ, అడుగడుగునా ఉన్నది చదువే. పిల్లలు ఆ వయస్సుకు తగ్గ పనిపాటలు నేర్చుకోవాలి. అలాగే రాబోయే జీవితాన్ని వాళ్ళెలా నిర్వహించాలో ఒక అవగాహన వాళ్ళకు అందేటట్లుగా చూసు కోవాలి. ఏ రాత్రిపూటో పడుకోబోయే ముందు ఒక అరగంటసేపు రామాయణమో, భారతమో, మీ అమ్మాయిని చదివి వినిపించమని అడిగి, అది చదువుతుంటే మీ దంపతులూ, మిగిలినవాళ్ళూ విన్నారనుకో. అప్పుడేం జరుగుతుంది ? మానవ జీవితం అంటే ఏమిటో, దాన్ని నిర్వ హించుకోవడం ఎలాగో అందరకూ కలసి తెలుస్తుంది. అందరూ కలసి ఈ గోష్ఠిలో పాల్గొనడం ద్వారా మీ కుటుంబ సభ్యుల మధ్య ఒక అవ గాహన ఏర్పడుతుంది. ఒక శ్రుతి కుదురుతుంది. ఒకళ్ళకి ఒకళ్ళుగా జీవించడం అంటే ఏమిటో, నలుగురూ కలిసి అనగలుపుకుని జీవించటంలో ఎంత అనుభూతి ఉందో మీకు తెలుస్తుంది. లేకపోతే ఎవరికి వాళ్ళయి

పోతారు. ఒక లాడ్జికీ, మీ ఇంటికీ తేడా ఉండదు. ఎవళ్ళ రూమ్‌లో వాళ్ళు, ఎవళ్ళ గొడవలో వాళ్ళు ఉన్నప్పుడు అది లాడ్జి అవుతుంది కానీ ఇల్లు కాదు. తల్లిదండ్రులు ఆ లాడ్జి ప్రొపరయిటర్‌లు అవుతారు. లాడ్జి ప్రొపరయిటర్‌కూ లాడ్జిలో దిగిన వాళ్ళకూ ఎలాంటి సంబంధం ఉంటుందో మీకూ, మీ పిల్లలకూ అలాంటి సంబంధమే ఉంటుంది. మీ పిల్లల్లో ఎవరు ఎక్కడికి ఎందుకు పోతున్నారో మీకు తెలుసునా ? మళ్ళీ ఎప్పుడు ఏ తీరులో తిరిగి వస్తున్నారో మీకు తెలుసునా ? మరి మీ ఇల్లు లాడ్జి కాక మరేమిటి ?"

ఆమె దీనంగా చూస్తూ, "ఇప్పుడు అంతే జరుగుతోందిగా మాష్టరు గారూ !" అన్నది.

స్వామి స్ఫూర్తివంతంగా చూస్తూ, 'అంతే జరుగుతోందా ? అంతే జరిగేటట్లు మనం చేస్తున్నామా ! మా బంధువుల్లో ఒక కుటుంబముంది. ఆయనకు రెండు వివాహాలు. మొదటి భార్య కాన్పు కష్టమయి చనిపోతే, రెండవ వివాహం చేసుకున్నారు. ఇద్దరు తల్లుల బిడ్డలు కలసి మెలసి ఒకే ప్రాణంగా జీవిస్తూ ఉండేవారు. పెద్దామె బిడ్డ ఈ పినతల్లి భోజనం చేసే టప్పటికి చేతికి వక్కపొడి అందించేవాడు. రాత్రి అయ్యేటప్పటికి ఆ తల్లికి పక్క సర్ది పెట్టేవాడు. తమ్ముళ్ళను, చెల్లెళ్ళను కంటికి రెప్పగా చూచుకునే వాడు. ఆ తమ్ముళ్ళు చెల్లెళ్ళు కూడా ఆ అన్న దేహంలో అవయవాలుగా తాదాత్మ్యం చెంది వర్తించేవారు. ఇందరిని చూస్తున్న ఆ తండ్రి సాక్షీ మాత్రుడై ఆనందించేవాడు.

ఇంత పద్ధతిగా, ఇంత ప్రేమతో చిరకాలం వీళ్ళు జీవిస్తూ రావడానికి కారణ మెక్కడ ఉన్నదా అని దగ్గరగా చూశాను నేను. తెల్లవారు ఝామున నాలుగున్నర అయ్యేసరికి స్నానం చేసి కుటుంబ సభ్యులందరు ఆ ఇంట్లో ఉన్న హాలులోకి చేరుకునేవారు. నాలుగున్నర నుండి అయిదు

గంటల వరకు దైవప్రార్థన చేసుకునేవారు. ప్రార్థన పూర్తి కాగానే తల్లి దండ్రులతో ఆరోజు తమ కర్తవ్యాలను గుర్చి తగుమాత్రం మాట్లాడి, వలసిన సలహాలను అందుకొని దినచర్యలోనికి దిగేవారు. రాత్రి ఎనిమిదిన్నర కల్లా భోజనాలు పూర్తి చేసుకుని ఒక గంటసేపు ఏ భాగవతమో పుచ్చుకుని గొంతెత్తి గానం చేస్తూ ఉండేవారు. ఆ అను భూతిలో పడకలను చేరుకునేవారు. ఇది వాళ్ళ అభ్యాసం. ఈ అభ్యాసమే వాళ్ళను కలిపి ఉంచింది. కలిసి మెలసి ఉండేలా చూసింది. మనం కూడా ఇలా జీవిస్తే బాగుంటుందేమో చూడు మరి.

ఆమె ఆర్ద్రంగా చూస్తోంది. జరిగిన తప్పుకు పశ్చాత్తాపపడుతోంది. నిర్వహించవలసిన కర్తవ్యానికి ఉన్ముఖమైన మనస్సుతో స్వామి పాదాలకు నమస్కరించి లేచింది.

స్వామి ఇలా అన్నారు : "అందరూ ఒకచోట బ్రతకటం చాలదు. ఒకటిగా బ్రతకటం చేతకావాలి. పెద్దవాళ్ళకూ, పిల్లలకూ చక్కటి ప్రీతి కుదరాలి. అందరూ కలసి అందరికోసం జీవించాలి. పెద్దలు యువకులతో చేతులు కలపాలి. ఆ యువకులు పిన్నలకు చేతులు అందించాలి. ఎవరికి వారుగా కాక, ఒకరికోసం ఒకరు బ్రతకాలి. అప్పుడు మన కుటుంబమే ఒక దేవాలయమవుతుంది. దేవాలయానికి మనం వెళ్ళేది అందుకోసమే, మన ఇల్లు ఒక దేవాలయంగా చేసుకోవటానికే"!

అందరూ ఇది అందరికీ కావలసిన సమన్వయమే ననుకుంటూ ఆదో అనుభూతితో నిలిచారు.

చేయడానికే తపస్సు

తెల్లవారుఝామున నాలుగున్నర అవుతోంది. సోదర బృందంలోని ఒకామె వ్యాధి తీవ్రతకు తాళలేక మందుకని వచ్చారు. స్వామి ఆమెను కూర్చోబెట్టి చూపులతోనే పరిస్థితిని గమనించి కావలసిన మందు వేశారు. మందుపనిచేస్తూ ఉంది.

స్వామి ఆమెను తమ మాటలతో అనునయిస్తున్నారు. మాత్రలు పనిచేశాయో, లేక మాటలు పనిచేశాయో, లేక ఆ రెండూ కలసి పని చేశాయో కానీ, ఆమెకు వ్యాధి తీవ్రత తగ్గింది. క్రమంగా వాతావరణం ప్రశాంతమయింది. మూలుగులు ముచ్చటలుగా రూపొందుతున్నాయి. బాధతో బరువుగా వచ్చినవారు చిరునవ్వుతో తిరిగి వెళ్ళడానికి లేచారు. స్వామి ఆమెను ప్రేమతో సాగనంపుతున్నారు. ఆ సమయం ప్రేమమయం! ఆ సమయం సందేశ మయం!

ప్రశాంతంగా కూర్చొని ప్రసన్నంగా చూస్తున్న స్వామితో ప్రక్కనున్న యువకుడు ఇలా అన్నాడు: "మాష్టరుగారూ! ఇలాంటి సన్నివేశాలు ఎదురైనప్పుడు కంగారు పడిపోయే వాళ్ళే ఎక్కువమంది ఉంటారు. నిలద్రొక్కుకొని చేయవలసింది చేయగలిగినవాళ్ళు ఎంతమంది ఉంటారని అనిపిస్తుంది.

మెరుస్తున్న కళ్ళతో స్వామి ఇలా అన్నారు : చేయవలసిందీ చేయగలగడం కోసం మానవుడు తపస్సు చేయాలి. ప్రార్థనలు, జపాలు, సాధనలూ, యాత్రలూ, పెద్దల సందర్శనాలూ, వాళ్ళ బోధలకు చెవియొగ్గటాలూ - అన్నీ దీనికోసమే! చేయవలసింది ఏమిటో తట్టడం కోసమే! ఆ తట్టినదాన్ని చక్కగా చేయడం కోసమే! దీనినే కృష్ణుడు 'కర్మాచరణంలో కౌశలం' అన్నాడు. అప్పుడు అనుభవానికి వచ్చేదే 'యోగస్థితి' అన్నారు.

రాజయోగ మార్గాన సాధన చేస్తూ, మహాత్ములను సమర్పణ బుద్ధితో ఆరాధిస్తున్నకొద్దీ చేయవలసింది చేయగలిగే స్థితి మనకు సిద్ధిస్తుంది. ఈ సాధనా సమర్పణా లేనినాడు చేయదలచింది చేయగలం తప్ప, చేయవలసింది చేయలేము. ఏమంటావు ?

"మీరు ఇస్తున్న శిక్షణంతా ఎందుకో ఇప్పుడు బాగా బోధ పడింది మాష్టారూ !" - అంటూ అంతర్ముఖుడయ్యాడా యువకుడు.

మాటతోకాదు బాటతో

ఈసారి ఇటువైపు వచ్చినప్పుడు మా ఊరికి తప్పక రావాలి. ఎప్పటినుండో ఆశిస్తున్న కార్యక్రమమిది. ఈసారి మీరు అవకాశాన్ని అనుగ్రహిస్తామంటే తగిన ఏర్పాట్లు చేసుకుంటాం.

స్వామి నవ్వుతూ ఇలా అన్నారు : "తగిన ఏర్పాట్లు చేసుకుంటే రావటానికి నాకేమీ అభ్యంతరం లేదు. అయితే మన సంప్రదాయంలో తగిన ఏర్పాట్లు అంటే ఏమిటో మీకు తెలుసుననుకుంటా? ఇ. కె. మాష్టరు గారు తమ జీవిత కాలంలో ఒక నియమాన్ని పాటించారు. ఎక్కడ సత్కర్మాచరణ సేవా రూపంలో జరుగుతున్నదో, అక్కడ మాత్రమే ఆయన అడుగుపెట్టేవారు. సత్కర్మాచరణకు సిద్ధపడిన చోటుకు గాని, సత్కర్మాచరణ జరుగుతున్న చోటుకుగాని వెళ్ళడానికి ఆయన వెంటనే తమ సంసిద్ధతను తెలియజేసేవారు. మిగిలిన చోట్లకు రమ్మన్నప్పుడు 'చూస్తున్నారుగా, ఈ కార్యక్రమాల ఒత్తిడి' అంటూ చిరునవ్వుతో తప్పుకునేవారు. అంటే "క్రమబద్ధమైన కార్యాచరణతో మాత్రమే నా రాకకై మీరు నన్ను ఒత్తిడి చేయగలరు" అన్న సూచన అందులో ఉన్నది. ఏమంటారు ?

అదే నియమం నాకూ అభ్యాసమైంది. కనుక ఈ ప్రకారం మీరు తగిన ఏర్పాట్లు చేసుకోగలిగితే, రావడానికి నాకు ఎట్టి అభ్యంతరం లేదు. ఈ కార్యక్రమానికి మామూలు వేదికలు, మామూలు మైకులు, మామూలు దండలు చాలవు. గ్రామంలో వేదిక వేయడమే కాకుండా మీ గ్రామాన్నే లోకశ్రేయస్సుకై పనిచేసే ఒక వేదికగా మీరు రూపొందించగలగాలి! నా గొంతు నలుగురికీ వినబడడానికి మైకులు పెట్టడమే కాకుండా, మీ గొంతులే నా గొంతుకు వాహికలు కావాలి! జాతి పునర్నిర్మాణ కార్య క్రమానికి మీ గొంతులు తమవంతు పాత్ర పోషించడానికి సిద్ధం కావాలి! ఈ కార్యక్రమం ఏర్పాటు కావటానికి మామూలు దండలు చాలవు. పూలతో గ్రుచ్చిన దండలు మాత్రమే కాక, ఉత్సాహంతో నిండిన మీ గుండెలతో గ్రుచ్చిన దండలు కావాలి! ప్రేమ అనే దారంతో మీ హృద యాలనే పూలను దండగా గ్రుచ్చి, లోకహితాన్ని నిర్దేశిస్తున్న మీ సారథికి మీరు సమర్పించగలగాలి! ఇదీ తగిన ఏర్పాటు! ఇలాంటి వేదిక, ఇలాంటి మైకులు, ఇలాంటి దండలు రూపొందించుకునే ప్రయత్నంలో మీరు ఉండండి. తగిన సమయంలో తప్పకుండా మీ ఊరు వస్తాను. మీరు నన్ను మాటతో పిలవటం కాదు. మీరు నడిచే బాటతో పిలువగలగాలి! మాటతో వస్తానులే అంటాను. బాటతో పిలిస్తే వస్తాను'లే'! అంటూ చేయి అందు కుంటాను.

అంతలోనే చిలిపిదనం, అంతలోనే కర్తవ్య బోధ ఆ గొంతు నుండి వ్యక్తమవుతూ ఉంటాయి. 'చిలిపిదనానికీ, కర్తవ్య బోధకూ జత ఎట్లా కుదురుతుంది?' అది తెలియాలీ అంటే ఇలాంటి చోట్ల చూడాలి. ఇలా ఆ రెండింటిని మొదట జతకలిపి నడిపినవాడు శ్రీకృష్ణుడు. భగవద్గీ తలో ఎంత చిలిపిదనం ఉందో స్వామి లాంటి వాళ్లు చెబుతున్నప్పుడు మనకు తెలుస్తుంది. అందుకే అంటారు స్వామి, "భగవద్గీతను సీరియస్‌గా మైండ్‌తో చదువుకోవడం కాదు, సరసంగా హృదయంతో చదువుకోవడం చేతకావాలి" అని.

వింటున్న మిత్రుడి మీద ఈ చిలిపితనం మేళవించిన కర్తవ్యబోధ బాగా పనిచేసింది.

"మాటతో కాక బాటతో పిలిచే రోజు త్వరలో రావాలని ఆశీర్వదించండి మాష్టారూ!" అన్నాడతను.

స్వామి "వస్తుందిలే" అన్నారు.

ఒక్క క్షణం ఆగి చిరునవ్వుతో, "వస్తుందిలే అంటే బోధపడిందా! అది వస్తుందిలే అంటే నీవు కూర్చో. అది వస్తుందిలే అని అర్థంకాదు. వస్తుంది. 'లే' లే! లేచినిలబడు! ఆరోజు అప్పుడు వస్తుంది" అని అర్థం. అంటూ సూటిగా అతనిలోనికి చూశారు.

ఆ మిత్రుడు సిగ్గుపడుతూనే స్ఫూర్తిని పొందుతున్నట్లు కనిపించాడు.

ఆ రోజు వస్తున్నట్లే కనిపించింది.

ఖర్మ యోగం

స్నేహితుడైన ఒక యువకుణ్ణి కబురు పెట్టి పిలిపించారు స్వామి. చేరవచ్చిన అతనిని చెంత కూర్చోబెట్టుకున్నారు. కుశల ప్రశ్నలు అయిన తరువాత కబురు పెట్టిన విషయాన్ని కదప దల్చుకొని, "ఏమయ్యా! పని పూర్తిచేసి పెడతానని నాకు చెప్పి ఎన్నాళ్ళయింది ? ఎన్నేళ్ళయింది ?" అని అడిగారు.

"నిజమే ననుకోండి. మీకు తెలుసు కదా నా పరిస్థితి. నాకు వెయ్యి పనులు. అన్నీ నేనే చూసుకోవాలి. నాకున్న బాధ్యతలు మీకు తెలియనివి కావు కదా!" అంటూ నసిగాడు అతను.

"అందుకని ఆ వెయ్యి పనుల్లో పేటినీ పూర్తి చేయకుండా వెయ్యి పనులు, వెయ్యి పనులు అంటూ చూస్తూ కూర్చుంటావా ? చేయడంలో

పద్ధతి అన్నది ఉంటే వెయ్యి పనులు కాదు, లక్షపనులు చేయవచ్చు. నువ్వు పనిమంతుడవే! కానీ, నీకు పద్ధతి లేదు. లోకం నిన్ను మెచ్చుకో గలదు కానీ విశ్వసించలేదు. నమ్మి నీకు పని అప్పచెప్పలేదు. ఒకవేళ అప్పచెపితే నీ నుండి బయటపడలేదు.

భగవంతుడు నీకు చక్కటి శక్తియుక్తులు ఇచ్చాడు. నలుగురితో కలసిపోగల సహృదయాన్నీ ఇచ్చాడు. ఈ రెండింటిని సద్వినియోగం చేయగల క్రమశిక్షణను మాత్రం నీవింకా సాధించుకోలేదు. లోకం నీ యెడల చూపిస్తున్న అభిమానానికి తగిన పాత్రతను నీవింకా సాధించు కోవలసి ఉంది. లేకపోతే నీ శక్తియుక్తులు, నీ సహృదయం అడవిగాచిన వెన్నెలలా వృథా అవుతాయి. లోకానికవి వినియోగ పడవు. ఇప్పుడు నేనే ఉన్నాను. నీ మీదున్న అభిమానంతో ఇంతకాలం వేచి చూస్తున్నాను. కాని నీకసలు చీమ కుట్టినట్లయినా ఉందా ? "ఆయనకు మాటిచ్చాను. ఇప్పటి కైనా పని పూర్తికాకపోతే ఎలా ?' అని నీకు ఏ కోశాన అయినా అనిపి స్తోందా ? నీదీ ఒక యోగంలా కనిపిస్తుంది. ఎవరేమన్నా పట్టించుకోకుండా నీలాగా నీవు ఉండగలుగుతున్నావు బలేవాడివయ్యా! ఇప్పుడయినా, నా కంఠశోషేగాని, గడపదాటితే నీకివేమీ గుర్తుండవు. ఎటువంటి నిశ్చల స్థితిని సాధించావయ్యా! నీకెన్ని చెప్పినా బోడిగుండు మీద నీళ్ళు గ్రుమ్మ రించినట్లే. కానీయి! ఏం చేస్తాం!" అంటూ నిట్టూర్చారు స్వామి.

"పని పూర్తి చేయటానికి ప్రయత్నం చేస్తానండీ" అన్నాడతను. "తప్పనిసరై ఇలా చేస్తున్నాను తప్ప మిమ్మల్ని కష్టపెట్టాలనా!" అన్నట్లుగా చూశాడు.

స్వామి ఇలా అన్నారు: పనులు, ప్రయత్నాలు నీవు చేయటం లేదని కాదు. కాని అవి ఎందుకు కావటం లేదో కూడా నువ్వు ఆలోచిం చావా ? పద్ధతి లేకుండా చేసుకోవడం వల్ల ఇదంతా జరుగుతోంది. నీవు చేయవలసిన పనుల్ని ఒకచోట వ్రాసుకో. వాటిలో ముందు వెనుకలను

చక్కగా నిర్ణయించుకో! వరుసగా చేసుకుంటూ రావడం మొదలుపెట్టు. అప్పుడందరికీ న్యాయం చేకూరుతుంది. నీవు చేయగలను అనుకున్న రోజుకు మరికొన్ని రోజులు కలుపుకుని, పనిని అప్పజెప్పే తేదీని చెప్పు. మాట తప్పకుండా ఆ తేదీ లోపున ఆ పనిని అప్పగించు. కాల నియమం పాటించనిదే ఏ కార్యమూ రాణించదు. పద్ధతి తప్పితే అది పని అనిపించు కోదు".

ఆయన వదనం గంభీరంగా ఉంది.

అంతావిని ఆ యువకుడిలా అన్నాడు : వ్యాపారం కదండీ చేసేది, నియమాలు పాటించటమంటే కష్టమవుతుంది" నేనున్న స్థితిని అర్థం చేసుకోండి అన్నట్లుగా చూశాడతను.

స్వామి బాధగా ఇలా అన్నారు: వ్యాపారంలో నియమాలు పాటించ డానికి వీలుకాదా! వ్యాపారంలో వీలుకాదు. ఉద్యోగంలో వీలుకాదు. కుటుంబంలో వీలుకాదు. మరెక్కడ వీలవుతుంది, నియమాలు పాటించ టానికి ? ఉపన్యాస వేదికల పైననా ? అక్కడ కూడా నియమాలు చెప్ప టమేకానీ, పాటించటం ఉండదే! అరగంటలో ముగించండీ అంటే ఆరు గంటలు వాయిస్తామే! మరింకెక్కడ పాటిస్తాం ? మనం ఇరవయ్యొశతాబ్దం భారతీయులం. నియమాలు పాటించం. నియమాలు వల్లిస్తాం. పాటించే తరాలు వెళ్ళిపోయి వల్లించే తరాలు వచ్చాయిప్పుడు!

కర్మయోగంగా ఆచరించవలసిన పనిని ఖర్మయోగంగా మార్చిన ఘనులం మనం! అంతే అవతలివాడికి ఖర్మకాలితే మన దగ్గరకు పనిచేసి పెట్టమని వస్తాడు. ఇంకొకడికి వాడూ ఇలాగే చేసిపెడుతున్నాడుకదా! అందుకని ఆ బలహీనతవల్ల ఇక్కడ మనను అంతగా అనలేక సరిపెట్టు కుంటూ ఉంటాడు. మొత్తం మీద భారతీయులం అందరం ఖర్మయోగంలో రాణిస్తున్నాం. కానీయ్! ఏం చేస్తాం ? భారతీయులందరూ బాగుపడినప్పుడు

నువ్వు బాగు పడుదువుగానిలే! అదెలాగూ అప్పుడే సాధ్యం కాదు గనుక నీకు తోచినట్లుగా నీవుండవచ్చు.

ఇష్టం వచ్చినట్లు ఉండటానికేగా మనం స్వాతంత్ర్యం తెచ్చు కున్నాం. నీకు దయకలిగినప్పుడు నా పని చేసిపెట్టు. నాకు పని ఉంది. నేను వెళతున్నాను'. అంటూ అక్కడి నుండి వెళ్ళిపోయారు స్వామి.

పురుష ప్రభలు లేవే!

ఒక రోజున స్వామి తమ పనిలో నిమగ్నమయి ఉన్నారు. ఇంతలో ఒకామె చిన్న వ్యానిటీ బ్యాగ్ చేతబట్టుకొని ప్రవేశించారు. బ్యాగులో నుండి ద్రాక్షపళ్ళు తీసి స్వామి చేతిలో పెట్టి నమస్కరిస్తూ, "మీరు మా శ్రీవారిని తొందరగా పద్ధతిలోనికి తీసుకునిరావాలి. ఇక్కడ పనిలో పాలుపంచుకోనిదే నేను ఉండలేను. ఆయనను ఒప్పించుకుని రావడమే ఒక యజ్ఞం అయిపోతోంది అని బాధపడుతూ చెప్పింది.

స్వామి మందహాసం చేస్తూ 'అలాగా' అన్నట్లు చూశారు.

ఆమె ఇంకా ఇలా అన్నది. "ఒక్కొక్కసారి నాకనిపిస్తూ ఉంటుంది, మగవాడయి పుడితే ఈ గొడవలేమీ ఉండవు కదా!" అని.

నాలిక కరుచుకుంటూ ఆమె మళ్ళీ ఇలా అన్నది. కొంపతీసి అప్పుడు గడుసు పెళ్లాం వచ్చిందీ అంటే అప్పుడూ నేను చేయగలిగేది ఏమీ ఉండదు గదా!

స్వామి నవ్వుతూ "చేయగలిగేది ఏమీ ఉండదు. అంతేకాదు. అప్పుడు ఇప్పుడున్న ఈ మాత్రం సానుభూతి కూడా దొరకదు" అన్నారు.

నిజమేనంటూ తలూపింది. పెదాలు బిగించి వస్తున్న నవ్వును ఆపు కుంటున్నదామె.

స్వామి ఆమెను ఆట పట్టిస్తూ ఇలా అన్నారు : "ఏం ? ఏమంటావ్! నేనన్నది నిజం కాదూ? ఇప్పుడయితే, 'పాపం ! ఆడవాళ్ళు అణచిపెట్టబడుతున్నారు, అని లోకమూ సానుభూతి చూపిస్తుంది. మీరూ చెప్పుకోవడానికి బోలెడంత అవకాశముంటుంది.

అదే గడుసు పెళ్లాం పిడికిలికి దొరికిపోయిన మగవాడున్నాడనుకో. వాడు ఎవడికి చెప్పుకుంటాడు ? చెప్పుకోక ముందే వీధీ, వాడా అంతా వాడికి తాటాకులు కడుతూ ఉంటారు.'చూశావా ! పాపం ఆ మగాడి జీవితం. ఎంత ఘోరమో!' అని. ఆడవాళ్ళయితే ఏ మహిళా ప్రభలోనో వ్రాస్తూ మగవాళ్ళను పట్టుకొని ఉతికి ఆరేస్తున్నారు. మరి మగాళ్ళేమి చెయ్యాలి ? వాళ్ళకు పురుషప్రభలు లేవే ! ఒకవేళ పురుషుల కోసం అలాంటి శీర్షికలు ఎవరైనా పెట్టినా, అవి చదివినవాళ్ళు నవ్వుకోవడానికి పనికి వస్తాయి తప్ప, ఈ మగవాళ్ళ బాధల్ని తీర్చడానికి పనికిరావే. ఏమంటావ్ ?" అన్నారు.

"మీరు మరీ ఆట పట్టించేస్తున్నారు" అన్నది ఆమె ఉడుక్కుంటూ.

"సరదాగా అన్నాను గానీ ఆడేమిటి ? మగేమిటి ? సరిగ్గా చూస్తే కనబడేవి మంచీ, చెడూ - ఈ రెండే.! అవి ఆడవాళ్ళలోనూ ఉంటాయి. మగవాళ్ళలోనూ ఉంటాయి. భార్యను అణచిపెట్టే భర్తలున్నట్టే, భర్తపైన స్వారీ చేసే భార్యలూ ఉంటారు. సింహంలాంటి భర్తా, గోవులాంటి భార్యా ఉన్నట్లే, మేకలాంటి భర్తా, పులిలాంటి భార్యాకూడా తారసపడుతూనే ఉంటారు. ఏమంటావ్ ? బాగుందా వివరణ" - అంటూ చిన్నగా నవ్వారు స్వామి.

ఒప్పుకుందామని ఉన్నా ఒప్పుకోవడానికి అభిమానం అడ్డువచ్చి, ఉడుక్కుంటూ కూర్చున్నదామె.

వెన్ను తట్టేవాడుంటే !

ఒక రోజు రాత్రి, సమయం పది గంటలు దాటుతుంది. స్వామి ముంజులూరులోని మన కార్యక్షేత్రంలో ఉన్నారు. ప్రశాంతమైన వాతావరణం. ఆరుబయలు. పైన చుక్కలు. క్రింద పూల మొక్కలు. స్వామి పడక కుర్చీలో కూర్చొని ఉన్నారు. ఉన్న నలుగురూ చుట్టూ చేరారు. గాలి వీస్తోంది చల్లగా. కూర్చున్నవారిలో ఏవేవో భావాలు కలుగుతున్నాయి మెల్లగా. వారిలోని ఒకతను స్వామితో మాట్లాడటానికి ఉద్యుక్తుడవుతున్నాడు.

'ఏమిటి ? చెప్పు' - అన్నట్లుగా చూశారు స్వామి అతనివైపు.

"మాష్టరుగారూ ! మనం తలపెట్టిన కార్యక్రమాలలో జరగవలసినవి చాల ఉన్నాయి కదా !"- అన్నాడతను. స్వామి నవ్వుతూ : జరగవలసిన కార్యక్రమాలు చాల ఉన్నాయి. అవి జరగవలసినవై ఉన్నాయి. అందులో మనం మన తలపెట్టాం. అంతే. ఏమంటావ్ ?" అన్నారు.

"ఏమంటాను. మేము ఏది అడిగినా మా ప్రశ్ననే సమాధానంగా ఇట్టే త్రిప్పి చెబుతారు మీరు అంటాను. అడగటానికి ఇందులో ప్రశ్న ఏముంది అనిపించేటట్లు చేసేస్తారు మీరు". అన్నాడతను నవ్వుకుంటూ.

"బాగుంది. ఇంతకూ నీవు అడగదలచినదేమిటో అడుగు" అన్నారు స్వామి.

"అడగమన్నారు కాబట్టి అడుగుతున్నాను. ఈసారి అడిగినదాన్ని త్రిప్పి చెప్పడమే కాదు, మరికొంచెం విప్పిచెప్పాలి కూడా" అన్నాడతను.

'అలాగే! తప్పకుండా చెబుతాను' అన్నారు స్వామి వాత్సల్యంగా.

"మన నుండి ప్రారంభమైన కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరగ

వలసినవి. వీటన్నిటి నిర్వహణకు కావలసిన ఆర్థిక వనరులను ఒనకూర్చు కునే మార్గమెలా అన్నది నేను తెలుసుకో గోరిన అంశం" అన్నాడతను.

స్వామి ఏం చెబుతారో అని ఉత్సుకతతో చూస్తున్నాడా యువకుడు.

స్వామి ఇలా అన్నారు : ఏ కార్యక్రమమైనా చక్కగా నిర్వహింప బడటానికి మొదట కావలసింది కార్యకర్తలు. నమ్మకస్తులు, దృఢ వ్రతులు అయిన వ్యక్తులు కార్యకర్తలుగా రూపొందినపుడు కార్యక్రమం దానికదిగా నడిచిపోతుంది. పని జరగడానికి ముందు కావలసింది మనుషులు. మనిషి ఉంటే 'మనీ' ఉన్నట్లే. 'మనిషి' అన్న పదంలోనే 'మనీ' కూడా ఉన్నది కదా ! ఏమంటావ్ !

ఆ యువకుడు చిన్నగా నవ్వుతూ బోధపడుతోందన్నట్లుగా తల ఊపాడు.

స్వామి ప్రేమగా చూస్తూ ఇంకా ఇలా అన్నారు. "ఇక నీ పెద్ద ఎత్తున అన్నమాటకు నేను జవాబు చెప్పాలి. చెబుతాను. ఒకసారి ఒకాయన నాతో ఒకమాట అన్నారు. ఆయన అన్నమాట నిజమే ననిపిస్తోంది. ఆయనేమన్నాడో తెలుసా ? ఈ దేశంలో దాతలకు కొదవలేదు. కానీ, దాతలు తమ ధనాన్ని సద్వినియోగం చేసే నమ్మకస్తులైన కార్యకర్తలున్న సంస్థలు ఒక పట్టాన దొరక్క ఇవ్వటానికి ముందుకు రాలేక పోతున్నారని. ఎంత చక్కగా చెప్పాడో చూశావా ?

ఇందుకు నేనొక ఉదాహరణ చూశాను. 1977లో దివిసీమలో ఉప్పెన వచ్చింది నీకు తెలుసుకదా ! మన కళ్ళముందు జరిగిన జల ప్రళయమది. జననష్టం, ధననష్టం పెద్ద ఎత్తున జరిగింది. చిత్రమేమిటంటే సహాయ కార్యక్రమాలు కూడా అన్నివైపుల నుండి అంత పెద్ద ఎత్తునా జరిగాయి. అప్పుడేం జరిగిందో తెలుసా ? దాతృత్వ స్వభావం కలిగిన వాళ్ళు, తాము ఈయదలచిన ధన సంపదల్ని ప్రభుత్వాని కీయకుండా,

'రామకృష్ణా మిషన్' లాంటి స్వచ్ఛంద సేవా సంస్థలకు సమర్పించు కొన్నారు. అంటే ఏమిటన్నమాట ? ప్రభుత్వం పైన కన్నా స్వచ్ఛంద సేవా సంస్థలపైన వాళ్ళు తమ విశ్వాసాన్ని ఉంచారన్నమాట. వాళ్ళు ఉంచి నట్లుగానే ఆ స్వచ్ఛంద సేవా సంస్థలు చక్కటి క్రమశిక్షణతో ఆ నిధులను సద్వినియోగం చేశాయి. మనం కూడా అలాంటి విశ్వాసాన్నే ప్రజల నుండి చూరగొనగలగాలి.

మనకు లభించిన శక్తియుక్తుల్ని, క్రమశిక్షణతో సద్వినియోగం చేస్తున్న కొద్దీ, ఆర్థిక వనరులు ప్రజల నుండి వాటికవిగా ఆనందోత్సాహాలతో నడిచి వస్తాయి. మన ప్రవర్తన క్రమశిక్షణాయుతమై, సేవా భావంతో లోకహిత కార్యక్రమాలవైపు మళ్ళుతున్న కొద్దీ, లోకరూపంలో వ్యక్తమవుతూ ఉన్న ఆ దైవం మనను అభిమానిస్తాడు. మనకు సహకరిస్తాడు. మనతో సహవసిస్తాడు. ఏమంటావ్ ?"

ఆ యువకునితోపాటు అందరూ ఒక విధమైన దివ్యానుభూతిని పొందారు. ఏదో నూతన చైతన్యం తన కౌగిలిలోనికి వారిని స్వీకరించి నట్లయింది. ఆ చైతన్యమే మనతో సహకరించటం కోసం ఇలా స్వామిగా రూపుకట్టిందా! అని అనిపించింది. వెన్ను తట్టేవాడుంటే వెనుకబడేవాడు ఎవడుంటాడు అని అనిపించింది.

మధురమైన ఆ సన్నిధిలో, మంద్రమైన ఆ అనుభూతిలో మౌనంగా ఉండిపోయాం కొంతసేపు. మౌనాన్ని వారు పాటించలేదు. మౌనమే వారిని తనలోనికి స్వీకరించింది.

★

అమలుపరచండి

సినీ రంగంలోని పాటల రచయితలలో స్వామికి సన్నిహితులైన వారు ఒకరు ఉన్నారు. ఆయన తరచు స్వామిని వచ్చి కలుస్తూ ఉండటం, అనేక అంశాలపైన స్వామితో ముచ్చటిస్తూ ఉండటం, ఆచరణకు కావలసిన సూచనలను స్వామినుండి అందుకుంటూ ఉండటం. వాటిని అమలు పరుస్తూ వచ్చిన ఫలితాలను ఎప్పటి కప్పుడు స్వామికి చెపుతూ ఉండటం చేస్తూ ఉంటారు.

ఒకరోజు మధ్యాహ్నం ఆయన వచ్చి కూర్చొని మాటల మధ్యలో, 'మీరీసారి మళ్ళీ నాకు అవసరమైన సూచనలు చేయండి. ఇంతవరకు మీరు చేసిన సూచనలన్నీ నేను అమలుపరుచుకుంటూ వస్తున్నాను కదా! అలా అమలు పరుస్తున్నందు వలన నాలో చక్కని మార్పు వస్తున్నట్లు నేను గమనించాను. మీరూ గమనించినట్లు చెపుతున్నారు కదా ! కాబట్టి ఈసారి మీరు అవసరమనిపించిన సూచనలు చేస్తే శ్రద్ధగా వాటిని అమలుపరిచే ప్రయత్నం చేస్తాను' అన్నాడు.

ఆయనలోని ఆర్తిని గమనించిన స్వామి సరస గంభీరవదనులై ఇలా అన్నారు : చూడండీ! మీ మనస్సులో ఏ మూలనో 'నాది కాని పనిని నేను చేస్తున్నాను! అన్న భావన ఉంది. ఆ భావన వీలు దొరికినప్పుడల్లా మీ మనస్సు పైపొరలలోనికి వచ్చి, అవకాశమున్నంతసేపు మిమల్ని కలవరపెట్ట గలుగుతోంది. ఆ భావనను సన్యసించండి. మీరు దైవాన్ని నమ్మినవారు. ధర్మాన్ని అనుష్ఠిస్తున్నవారు. అలాంటప్పుడు మీది కాని పని మీ దగ్గరకు ఎలా వస్తుంది? మీ జీవ లక్షణంతో ముందుకాలంలో పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని రూపొందించదలచిన దైవం, దానికి కావలసిన వేదికను మీ చుట్టూ ఇప్పుడిలా ఏర్పాటు చేస్తున్నాడు-' అని గమనించండి. కనుక ఇక అలాంటి భావనను రానీయకండి.

అలాగే నన్నట్లుగా వినమ్రతతో తల ఊపారాయన.

స్వామి ఇంకా ఇలా అన్నారు : చూడండి. మరొక్క నియమాన్ని కూడా మీరు పాటించండి. జీవితంలో పతనమైపోతున్నవారు మీకు తారస పడినప్పుడు, వారు మీకెంత ఆప్తమిత్రులైనా సరే, మనం చెప్పిన మాట వినిపించుకుంటారు అన్న విశ్వాసం మీకు ఉన్నప్పుడే వారికి మాటతో చెప్పండి. లేనప్పుడు చెప్పకండి. వారిని గూర్చి దైవాన్ని ప్రార్థించండి. 'అవతలివారిలో మనం చెప్పింది రిసీవ్ చేసుకునే రిసీవింగ్ పోల్ ఏర్పడి ఉన్నది' అని మనకు రూఢి అయినప్పుడే మనం చెప్పదలచింది వారికి మాటలతో చెప్పాలి. 'వారిలో అలాంటి రిసీవింగ్ పోల్ ఇంకా ఏర్పడలేదు, అని మనకనిపించినప్పుడు వారిని మంచి దారిలోనికి మళ్ళించమని దైవాన్ని ప్రార్థిస్తూ, మన ప్రేమతో వారిని స్పృశించడమే మనం చేయ వలసిన పని. చూడండీ! వాక్కు అనేది వ్యక్తీకరణల్లో ఒకటి మాత్రమే! దానితోనే అన్నింటినీ సాధించాలని లేదు. దానికి అవకాశమున్నచోట దానిని వినియోగించుకుంటాం. మిగిలినచోట్ల మనలో మిగిలిన వ్యక్తీకరణ మార్గా లున్నాయే! వాటిని వినియోగించుకుంటాం. కనుక సిద్ధంగా లేని వారికి నోటితో చెప్పి ఇబ్బంది కలిగించకండి.

'అన్నింటికన్నా మించినది మనలోని సంకల్ప శక్తి. అతడు బాగు పడాలని మనకు ఒక సంకల్పం కలిగింది. ఆ సంకల్పం కన్నా మించిన దంటారా మన వాక్కు? అ సంకల్పం యొక్క ఒకానొక కిరణమే కదా! అదీ చూడండీ! అరవిందుడు ఇప్పుడు నేను చెప్పిన లాంటి సంకల్ప శక్తితోనే స్వాతంత్ర్యోద్యమానికి దోహదం చేశాడు. జాతి జనుల గుండెలలోనికి సంకల్పరూపుడై ప్రవేశించాడు. తన పుట్టినరోజు పండుగ నాడు భారతమాత బంధనాలను ఊడగొట్టాడు. కనుక సంకల్పశక్తికి ఉన్న బలం అమోఘమైనది. ఇప్పుడు నేనున్నాను. జాతి పునర్నిర్మాణ ఉద్య మాన్ని తలపెట్టాను. భౌతికంగా నేను ఎంత చేయగలను? ఎందరికి చేయ గలను? ఎన్ని చోట్లకు వెళ్ళగలను? ఎంతమందికి చెప్పగలను? ఇవన్నీ

సాధ్యమైనంతవరకు వాళ్ళ వంచి చేస్తాను. కాని, వీటి అన్నింటినీ మించిన సంకల్పశక్తితో మానవజాతిలోనికి నేను వ్యాపిస్తున్నాను. ఈ సత్యాన్ని గమనించండి. గమనించి అమలు పరచండి. అప్పుడు ఎవ్వరూ 'హర్టు'కారు. అందరూ 'ఎలర్ట్' అవుతారు.

చివరిగా ఒక సూచన. 'మీరు వేసుకున్న ఈ వేషంలో కూడా మార్పు రావాలి. మీ జీవ లక్షణానికి తగిన వస్త్రధారణ మీరు చేయాలి. ఇప్పుడు మీరు అందరూ వేసుకుంటున్న డ్రస్సులనే అందరిలాగానే వేసుకుంటున్నారు. ఇందులో కొంచెం మార్పు తీసుకురండి. మీకు తగిన మార్పు తీసుకురండి. ఆహార్యాన్ని మన జీవ లక్షణానికి తగినట్లుగా మలచుకోవడం కూడా అవసరమే. కర్తవ్య నిర్వహణకు అది కూడా దోహదం చేస్తుంది'.

అలాగేనంటూ వినమ్రుడై మళ్ళీ తల వంచాడాయన. కొద్ది క్షణాల తరువాత ఇలా అన్నాడు : ఈ క్షణాలు నా జీవితంలో మరుపు రానివి. సంధ్యావందన సమయంలో ఎంతో ప్రయత్నం మీద ఏ కాసిని క్షణాల్లో అనుభవించే దివ్యానుభూతిని ఇప్పుడు, ఇక్కడ, ఇలా జాగ్రద వస్థలో ఉండగానే, ఇంద్రియాలతో ఇన్నింటినీ గమనిస్తూనే, ఇంతసేపటి నుండి నిరాఘాటంగా అనుభవిస్తున్నాను. నిజంగా నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ క్షణం నుండే మీరిచ్చిన ఈ సూచనలను అమలు పరచేటందుకు సంసిద్ధుడనవుతున్నాను.

కొద్దిక్షణాలు సన్నివేశంలోని అందరూ అదే అనుభూతిని పొందుతూ అలాగే ఉండిపోయారు.

ఆరాలు తీస్తోందా

'ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి ? మా కథంతా మీరు విన్నారు కదా! ఈ సమాజం మమ్మల్ని వెన్నాడుతోంది. వెన్నాడి వేధిస్తోంది. మేము ఎవరి సొమ్ము తిన్నామని ఈ వేధింపు. ఎవరినేమన్నామని ఈ వేధింపు. మా బ్రతుకేదో మేం బ్రతకడానికి ప్రయత్నిస్తుంటే బ్రతక నివ్వరే? అద్దిచ్చినా ఇల్లు ఇవ్వడానికి కూడా కష్టంగా ఉంది ఈ సమాజానికి. ఈ సమాజం మామీద ఎందుకింత కక్ష కడుతోంది?', ఇలా తీవ్రంగా మాట్లాడుతూ ఊగిపోతున్నదామె. ఆమె ప్రక్కన ఆమె భర్తకూడా ఉన్నాడు. దీనంగా ఏదో ఆలోచిస్తున్నాడు. వాళ్ళిరువురిదీ వర్ణాంతర వివాహం, ప్రేమ వివాహం. గత కొన్ని సంవత్సరాలుగా కుటుంబపరంగాను, సమాజపరంగానూ ఇబ్బందులు పడుతున్నారు వాళ్ళు. అతనిదీ కొంచెం తట్టుకునే స్వభావం. ఆమెది కొంచెం ఆవేశాత్మకమైన తత్త్వం. స్వామితో వివరంగా మాట్లాడటానికి ఇలాంటి అవకాశం కోసం ఆమె ఎప్పటినుండో ఎదురు చూస్తున్నది. అతను కూడా స్వామితో అన్నీ చెప్పుకొని ఉపశమనాన్ని పొందాలని చూస్తున్నాడు. ఇవాళ వాళ్ళకి దొరికింది. ఇప్పటికి దాదాపు రెండు గంటల నుండి వాళ్ళు చెబుతూనే ఉన్నారు స్వామికి. స్వామి ఓర్పుగా వింటున్నారు. సామాన్యంగా ఎదుటివాళ్ళు చెప్పటం పూర్తయ్యేదాకా స్వామి పెదవి విప్పరు. ఇక అవతలవాళ్ళు ఎప్పటికీ ఆపరు అని తోస్తేమాత్రం మధ్యలో వాళ్ళను ఆపి, కథ నడిపించటం కోసం మాట్లాడుతారు. మీరు చెప్పవలసిందంతా పూర్తయిందా ? అన్నట్లు చూశారు స్వామి.

'ఇంతకంటె ఇంకేమి చెప్పగలం' అన్నట్లు చూశారు వాళ్ళు. స్వామి ఇలా అన్నారు : మీ పరిస్థితి నాకర్థమైంది. నేను చెప్పబోతున్న ఈ మాటలు మీరు ప్రశాంతంగా వినండి. లోకరీతికన్న కొంత భిన్నంగా

ప్రవర్తించారు మీరు. దానితో లోకం మిమ్మల్ని తప్పు పట్టింది. దానికి మీరు బాధపడుతున్నారు. ఇక్కడ కొన్ని అంశాలను మనం సూక్ష్మంగా ఆలోచించాలి. లోకరీతికన్న భిన్నంగా ప్రవర్తించినపుడు ఇలా ఎందుకు ప్రవర్తించవలసి వచ్చింది? అని లోకం అడుగుతుంది. దానికి తగిన జవాబు దొరికితే లోకం ఇక మాట్లాడదు. లేదా దొరికేంతవరకూ అది ప్రశ్నిస్తూనే ఉంటుంది. మీరెందుకిలా చేయవలసి వచ్చిందా అని. ఆ ప్రశ్నించడాన్నే మనం తప్పు పడుతోంది అంటున్నాం. కక్ష కడుతోంది అంటున్నాం. నిజమే పరిస్థితి అంత దారుణంగానూ ఉంటుంది. ప్రశ్నకు జవాబు దొరికితేమాత్రం కథ మలుపు తిరుగుతుంది. మీకు నేను చెప్పేవి రెండంశాలు. నిజంగా మీరు ప్రేమించి పెళ్ళిచేసుకొని ఉంటే ఈ లోకం యొక్క సతాయింపును మీరంతగా పట్టించుకోవలసిన పని లేదు. పట్టించుకోరు కూడా! మీలో ఎక్కడో ప్రేమపాలు తగ్గితేనే ఈ ఘోషలు మీకు వినబడే సందు దొరుకుతుంది. ఇక రెండో అంశం. ఈ మీరేర్పరుచుకున్న అనుబంధం ఆధారంగా లోకహితాన్ని గనుక మీరు పెద్ద ఎత్తున సాధించినట్లయితే లోకం ఇక మిమ్మల్ని ప్రశ్నించదు. ఎందుకని ప్రశ్నించదు? దాని ప్రశ్నకు జవాబు దొరికింది కనుక! ఈ పని చేయటానికి మీరు పుట్టారు అని అది గ్రహించింది గనుక!

కనుక మీరు శ్రద్ధ పెట్టవలసింది ఈ రెండు అంశాల మీదనే. ఒకటి మీరు ఏ ప్రేమతో దగ్గరయ్యారో ఆ ప్రేమ మీ మధ్య రోజు రోజుకు పెరగాలి తప్ప తగ్గకూడదు. అది నిజంగా ప్రేమే అయితే పెరగడానికే ఇష్టపడుతుంది. తరగడానికి దానికి ప్రాణమొప్పదు. రెండవది, ఏర్పడిన ఈ అనుబంధాన్ని లోక శ్రేయస్సును సాధించడానికి అంకితం చేయడం! అలా చేయగల్గిననాడు సమాజం మిమ్మల్ని తప్పు పట్టదు సరిగదా, ఆరాధిస్తుంది. అలా ఆరాధన పొందే స్థితికి ఎదిగేటందుకు మీరు సిద్ధపడేవరకూ అది ఆరాలు తీస్తూ కూర్చుంటుంది.

ఈ సందర్భంలో మీకొక ఉదాహరణ చెప్తాను. ఈ ఊళ్ళోనే ఒక వేశ్యకు పుట్టిన బిడ్డ పెరిగి పెద్దదై డాక్టరైంది. డాక్టర్ ప్రాక్టీస్ పెట్టిన తరువాత పేరు మోసిన ఒక వ్యాపారస్తుని వివాహం చేసుకుంది. అప్పటికే ఆమె వైద్య వృత్తిలో నిలబడి తన సామర్థ్యాన్ని సేవా భావంతో సద్వినియోగం చేస్తూ ఉండటంతో ఈ సమాజం వారి వివాహానికి హర్షించి కానుకలను అర్పించిందే తప్ప తప్పు పట్టలేదు. క్రమంగా ఆమె హస్తవాసి మంచిదనే పేరు వచ్చింది. సమాజంలోని అన్నివర్గాలవాళ్ళు ఆమె సేవను పొందుతూ ఆమెను ఒక దేవతగా చూడసాగారు. ఆమెచేత పురుడు పోయించుకోవాలన్న కోర్కెతో భాగ్యవంతులూ, ఉన్నత వంశాలవారు, కోరి మరీ వస్తుంటారు. ఆమె హస్తవాసి అంతటిదీ! ఆమె విషయంలో సమాజం ఎందుకని తప్పు పట్టలేదు. పట్టకపోగా ఎందుకని ఆరాధించింది? ఆలోచించండి! ఊరికే ఉత్తి పుణ్యానికి మార్పులు చేస్తే ఎందుకు చేయవలసి వచ్చింది అని ప్రశ్నిస్తారు. అది సహజం. ఆ మార్పువల్ల పెద్ద ఎత్తున ప్రయోజనం వ్యక్తమైనప్పుడు ఇందుకు గదా ఈ మార్పు జరిగిందని గ్రహించి హర్షిస్తారు. ఆరాధిస్తారు. ఆమె కథ మనకు తెలియచెప్తున్న సత్యమిదే! మీ దాంపత్యాన్ని మీరూ అలా సద్వినియోగం చేసుకోండి. అప్పుడు ఈ లోకమే మీకు జేజేలు పలుకుతుంది. సమాజం ఎదగాలని మీరంటున్నారు. సమాజంచేత ఆరాధింపబడే స్థాయికి మీరు ఎదగాలని నేనంటున్నాను.

కొన్ని క్షణాలు నిశ్శబ్దం. ఆ దంపతులు ఆత్మ పరిశీలనకు అవకాశం కల్గిస్తున్న నిశ్శబ్దమది.

స్వామి మళ్ళీ ఇలా అన్నారు : నాకనిపిస్తుంది కదా! మనిషి ఒక స్థాయి దాటి ఎదిగేవరకే ఈ సమాజం, ఈ మనిషి ఎక్కడివాడు? ఏ కులంలో పుట్టాడు? ఏం చేస్తున్నాడు? ఎంత సంపాయించాడు? ఇలాంటివన్నీ అడుగుతుంది. ఆ స్థాయి దాటి ఎదిగిన తర్వాత ఈ సమాజం ఆత్మ

డిని ఏమీ అడగదు. వివేకానందుడు, గాంధీమహాత్ముడు, లాల్‌బహదూర్, అంబేద్కర్ లాంటి వాళ్ళ విషయంలో వారికి నమస్కరించేటప్పుడు వారిని గౌరవించేటప్పుడు ఈ సమాజం వారెక్కడ పుట్టారని చూస్తున్నదా? ప్రశ్నిస్తున్నదా? వైష్ణవ సంప్రదాయానికి ప్రవక్తలైన ఆళ్వారులలో నిమ్నజాతుల వారెందరో ఉన్నారు. మరి వారికి కులం అడ్డు వచ్చిందా? ఆలోచించండి.


ఇవాళ ప్రతిమనిషి తనని నలుగురూ గుర్తించాలని, గౌరవించాలనీ కోరుతున్నాడు. అలా కోరడంలో తప్పులేదు. కానీ, ఆ గుర్తింపు, గౌరవం లభించాలీ అంటే అతడు ఆ లోకం యొక్క హితాన్ని కోరి జీవించాలి. అందుకతడు సిద్ధపడాలి! ఏమంటారు?

మనం నిజంగా సమాధానం కోరిన వాళ్ళమయితే ఒక అంశానికి సంబంధించి అన్ని కోణాల నుండీ పరిశీలించాలి. ఏదో ఒక కోణం నుండి చూడటానికి అలవాటు పడిపోయి, అదే కరక్టు అనుకుంటే, ఇంకో కోణం నుండి చూసేవాడితో ఘర్షణ తప్పక వస్తుంది. ఇంకో కోణం నుండి చూసే వాళ్ళతో మనం ఏకీభవించక పోవచ్చు. కానీ వాళ్ళకలా ఎందుకనిపిస్తుంది? అన్న దాని యెడల మనకు అవగాహన ఉండాలి. అవగాహన ఉన్నచోట ఘర్షణకు తావులేదు. ఇలాంటి అవగాహన పెంపొందించుకున్ననాడు ఒక అంశాన్ని గూర్చి అన్ని కోణాల వారి ఆలోచనలను మనం అవగాహన చేసుకోగల్గుతాం. ఆ అవగాహనతో మన కర్తవ్యానికి రూపు దిద్దుకోగల్గుతాం. ఇక అక్కడ రాగద్వేషాలకు తావుండదు. ఇలాంటి అవగాహనతో ముందుకు సాగడానికే మనపెద్దలు 'విశ్వప్రేమ' అని పేరు పెట్టారు. ప్రేమ మార్గాన పయనించండి అన్నారు. కొంచెం పై నుంచి చూస్తూ ప్రేమతో అందరినీ అర్థం చేసుకోండి అన్నారు. కనుక మీ జీవితాలు సమాజాన్ని ద్వేషించడానికై వెచ్చపెట్టకండి. సమాజం చేత 'భేష్' అనిపించుకునే స్థితికి ఎదగడానికై మీరు దీక్ష పూనండి.

కోరి వచ్చారు మీరిక్కడికి. మీకు కావలసిన సమాధానం దొరికింది అనుకుంటున్నాను. మీ శ్రేయోభిలాషిని నేను. మీ శ్రేయస్సును కోరి చెప్పాను. మిమ్మల్ని సమర్థించలేదు నేను. అందుకు మీరేమీ అనుకోరు కదా! సమర్థిస్తే నేను మీకు సపోర్టర్ నవుతాను. మీరేం చేస్తే బాగుంటుంది అన్న అంశం చెప్పాను. ఒక గైడ్‌గా ప్రశాంత జీవనానికి మీకు మార్గం చూపదలిచాను. ఏమంటారు ?

ఆ దంపతుల కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి : అప్రయత్నంగా ఒకేసారి చేతులు జోడించి వారిలా అన్నారు. సమర్థించేవారు, వ్యతిరేకించేవారు కూడా ఎక్కువ సంఖ్యలోనే దొరుకుతారు మాస్టరుగారూ! గైడ్ చేసేవారు లేకనే ఇంతవరకూ మేం క్షోభననుభవించాం. ఇపుడు మాకాలోటు తీరింది. మీరొక్కరూ మాకు వేయిమంది పెట్టు. మీ చల్లటి చూపులతో మమ్మల్ని పెంచండి. మనుష్యులను చేసి నిలబెట్టండి. మీతో కలిసి నడిచే అవకాశాన్నివ్వండి" అంటూ స్వామి పాదాలకు నమస్కరించారు వాళ్ళు.

ఇక మీరు బెంగపడవలసిన పనిలేదు. పాజిటివ్ థింకింగ్‌తో ముందుకు సాగండి. ఆ థింకింగ్‌ను అనుగ్రహించే ప్రేయరుకు సమయమైంది. రండి! అంటూ ప్రేయరు హాలులోనికి దారితీశారు స్వామి.



మీకేనా - నాకూనా

సోదర బృందంలోని వారొకరు తమ ఇంట్లో పెట్టుకోవడం కోసం మాష్టరు గార్ల ముగ్గురి ఫొటోలను ఫొటో ఫ్రేములలో నీట్‌గా ఫిట్ చేయించారు. చూస్తున్నవారిలో కొందరు 'మన మాష్టరుగారి ఫొటో చాలా బాగా ఉంది' అని మరీ మరీ చూస్తున్నారు. ఏది అది? అని అడిగి తీసుకుని ఆ ఫొటోను అలా చూస్తూ ఉండిపోయారు. స్వామి కూడా కాసేపు చుట్టూవున్న సోదర బృందం ముఖాలలో ఆశ్చర్యానందాలు వెల్లుబుకుతున్నాయి. స్వామి తమ ఫొటోను తామే అంత ఇదిగా చూస్తున్నందుకు "చాల బాగా వచ్చింది. చక్కగా ఉంది" అన్నారు స్వామి ఆ ఫొటోను చూస్తూనే. ఆ మాటలకు ఆ బృందంలోని ఒకరిద్దరికి నవ్వొచ్చింది. "ఎందుకు నవ్వుతున్నారు?" అన్నారు స్వామి.

"మీ ఫొటోను చూసి మీరే అలా అంటున్నారు కదా! అందుకనే" అన్నారు.

ఫొటోను ప్రక్కనున్న వారికి అందిస్తూ స్వామి ఇలా అన్నారు: "ఒకసారి రమణమహర్షి ఆశ్రమంలో ఒక చిత్రం జరిగింది. ఆయన సోఫాలో విశ్రాంతి తీసుకుంటున్నారు. భక్తులు ఆయన పాదాలు వత్తుతున్నారు. వచ్చిపోయే భక్తులకు మహర్షి పాదాలకు కాసేపయినా సేవ చేసుకోవాలని తపన. ఆ సేవ చేసుకుంటే పాపం పోతుంది. పుణ్యం వస్తుంది. మానవ జీవితానికి పరమావధి ఏదో దాని కదిగా నడిచి వస్తుంది. అని వారి విశ్వాసం. పాదసేవ జరుగుతూ ఉండగా మధ్యలో మహర్షి చుట్టూ ఉన్నవారిని చూస్తూ, 'కాసేపు మీరలా ఉండండ్రా' అన్నారు. వారంతా ఒక్కసారిగా ఆశ్చర్యపడుతూ అలా కొంత దూరంగా కూర్చుని ఉన్నారు. ఇంతలో మహర్షి ఒక్క ఉదుటున ముందుకు వంగి తమ కాళ్ళను తామే నొక్కుకోవడం ప్రారంభించారు. భక్తకోటికి మరింత

ఆశ్చర్యం వేసింది. వారి స్థితిని గమనించిన మహర్షి ఇలా అన్నారు. 'పుణ్యమంతా మీకేనా ? నాకూ రావద్దూ ?' అని. అలాగే నేను ఇప్పుడు అంటున్నాను. 'ముచ్చటంతా మీకేనా ? నాకూ రావద్దూ,' అని. సోదర బృందం ముఖాలలో సంతోషం సంబరం జరుపుకుంటోంది.

పంచాంగం కథ

డిస్పెన్సరీలో కూర్చుని ఉన్నారు స్వామి. వైద్యసేవ ఇక ప్రారంభం కాబోతుంది. ముందుగా కార్యకర్తలతో ముచ్చటలాడుతున్నారు స్వామి.

ఆ ముచ్చటల్లో భాగంగా ఒక కార్యకర్త అడిగాడు. 'మాష్టరుగారూ, మాటిమాటికి పంచాంగాలూ అవీ చూడటం అవసరమంటారా ?

చిరునవ్వు నవ్వుతూ స్వామి ఇలా అన్నారు. పనిచేయటంలో పద్ధతి ఉంటే, పంచాంగంతో పెద్ద పని ఉండదు. జరగవలసిన సంఘటన, దాని ముహూర్తాన్ని అదే నిర్ణయించుకుంటుంది. ఈ సత్యాన్ని తెలియజెప్తూనే జిల్లెళ్ళమూడి అమ్మ, 'అయ్యిందే ముహూర్తం నాన్నా!' అంది. ఆ మాటలో చాల అర్థం ఉంది.

పంచాంగానికి ఇంత ప్రాధాన్యమిస్తారు కదా! మనవాళ్ళు అంత ప్రాధాన్యమూ ప్రవర్తనకిస్తే ఎంత బాగుంటుందీ అనిపిస్తుంది నాకు. మన ప్రవర్తనను మనం సరిచూసుకుంటున్నప్పుడు దినచర్యలో ఏ సన్నివేశానికి తగిన ముహూర్తం ఆ సన్నివేశానికి ప్రకృతి చేత ఏర్పాటు చేయబడుతూనే ఉంటుంది. అప్పుడు ఆ జాగ్రత్తతో ప్రకృతే పడుతుంది.

పనులు అవ్వటానికి, కాకపోవటానికి మెలికలేవో మన ప్రవర్తనలోనే ఉంటాయి. మనిషి ఆ మెలికలను సరిచేసుకోవటంమీద తన శ్రద్ధనంతా

పెట్టగలగాలి. కానీ, తన చేతిలో లేని గ్రహగోళాల మీద చూపినంత ఆతృతగా, తన చేతిలో ఉన్న ప్రవర్తనవైపు చూడలేక పోతున్నాడతను. ప్రవర్తనను సరిచూసుకుంటున్న వాడికి గ్రహగతులు వాటి తవిగా కలిసి వస్తాయి. లేనప్పుడు మనం ముహూర్తం పెట్టినా, దానిని తప్పించటం ఎలాగో వాటికి బాగా తెలుసు. గ్రహాలు తనకు కలిసిరావాలని అంతగా కోరుకుంటున్నాడు కదా! ఆ గ్రహాలు మనిషితో ఏమంటున్నాయో తెలుసునా ? 'మనిషీ ? నీకు నీవు కలిసిరావడం చేతనయితే, మేమందరం నీకు కలిసి వచ్చినట్లే' అని.

'ఇదీ పంచాంగం కథ. ఇక ఇప్పుడు జరుగవలసిన కథలోకి వెళదామా ?' అంటూ స్వామి కేస్‌షీట్ల ఫైళ్ళను అందుకున్నారు.

వినాయక విజయం

అదీ వరంగల్లులోని వినాయక చవితి నవరాత్రుల పందిరి. వరంగల్లు ప్రాంతంలో విశేషంగా జరిపే ఉత్సవాల్లో వినాయకచవితి నవరాత్రులు ఒకటి. ఆ పట్టణం పరిధిలోపల ఎన్నెన్నో వినాయకుని పందిళ్ళు వెలుస్తాయి. ఎన్నెన్నో సైజుల్లో వినాయకుడు కూడా ఆ పందిళ్ళలో కొలువు దీరుస్తాడు. ఒక ప్రత్యేకమైన కమిటీ ఈ పందిళ్ళ నన్నింటినీ పరిశీలించి, చివరి రోజున బహుమతులను కూడా ఇస్తుంది. ఆ కమిటీ వారు, తాము ప్రత్యేకంగా నిర్వహించే వినాయకుని పందిరిలో స్వామి ప్రవచనం ఏర్పాటు చేయబడింది. వినాయకుని గూర్చిన విశేషాలను సమన్వయించి శ్రోతలకు అందించారు. స్వామి సృష్టిని నిర్వహించే ముగ్గురమ్మలతోనూ అతనికి ఎలాంటి అనుబంధం ఉన్నదో బొమ్మకట్టెట్టు చెప్పారు. శ్రోతలు పరవశించారు.

ప్రవచనం పూర్తి కాగానే స్వామి వేదిక దిగి ఆ ప్రక్కగా నున్న కుర్చీలో ఆసీనులయ్యారు. నమస్కారాలు చేసేవాళ్ళు నమస్కారాలు చేస్తున్నారు. అభినందనలు తెలిపేవాళ్లు అభినందనలు తెలుపుతున్నారు. తమను తాము పరిచయం చేసుకునేందుకు వచ్చినవారు పరిచయం చేసుకుంటున్నారు. పట్టణ పెద్దల్ని కమిటీ సభ్యులు తీసుకుని వచ్చి మరీ పరిచయం చేస్తున్నారు. కొంచెం దూరంగా కుర్రవాడొకడు నిల్చొని ఉన్నాడు. కొంచెం సందు చూసుకుని 'మీతో మాట్లాడాలని ఉంది' అన్నట్లుగా స్వామి వైపు చూస్తున్నాడతను. ఎవరికి తగినట్లుగా వారితో ప్రవర్తించి, అందరినీ తృప్తి పరచిన స్వామి ఆ పైన ఆ కుర్రవాడిని చూపులతోనే పిలిచారు. అతడు నడిచి వచ్చాడు. వచ్చి వినమ్రుడై నిలుచున్నాడు. పరిచయ వాక్యాలయినాయి.

కొంచెంసేపు నిశ్శబ్దం.

"కావలసినది అడుగు. సందేహమెందుకు ?"- అన్నట్లుగా చూశారు స్వామి అతనివైపు.

ఆ ప్రోత్సాహం అతడందుకున్నాడు. అందుకొని ఇలా అన్నాడు: 'మీరేమీ అనుకోరు కదా!! నేనొకటి అడుగుతాను'

'ఏమనుకుంటాను ? అడిగావనుకుంటాను' - అన్నారు స్వామి.

కుర్రవానికి నవ్వొచ్చింది. కొంత ఈజ్‌లోనికి వచ్చాడు. వచ్చి ఇలా అన్నాడు: 'ఈ పాతకాలపు పండుగలు ఇంకా ఎందుకండీ!' ఈ పురాణాలూ, ఇతిహాసాలూ ఇంకా అవసరమంటారా ? రాముడు, కృష్ణుడు అంటూ ఇంకా చెప్పుకోవాలంటారా? ఏనాడో జరిగిన ఆ కథలెందుకు ? ఈ మధ్య జరిగిన కథల్ని చెప్పుకుంటే చాలదా? శివాజీ ఉన్నాడు. రాణా ప్రతాపుడున్నాడు. అలాంటి వీరుల చరిత్రలు చాలవా! మనం ప్రేరణ పొందడానికి ? వాటిని విడిచి ఎక్కడికో వెనక్కి వెళ్లాలంటారా ? నా

కెందుకో అవన్నీ అవసరం లేదనిపిస్తుంది. మీలాంటి పెద్దలేమో వాటిని గురించి విశేషంగా చెబుతూ ఉంటారు. నాకనిపిస్తుంది కదా! మీ లాంటి పెద్దలు కూడా ఆ పాత కథలను విడిచిపెట్టి, ఈ వీర పురుషుల కథలను ఎక్కువగా చెబితే బాగుంటుందని. ఈ వీరులు మన ధర్మానికి ఎంతో చేశారు కదా! వాళ్ళు చేసిన త్యాగాలు, చూపిన ప్రతాపాలు ఎన్నో ఉన్నాయి కదా! ఇవన్నీ చాలవంటారా? ఇంకా వెనక్కి వెళ్ళాలంటారా? వెనక్కి వెళ్ళటం అంత అవసరమంటారా?"

ఆ కుర్రవాడు అలా జిజ్ఞాసతో చూస్తూ నిలుచున్నాడు - స్వామి ఏం చెపుతారోనని.

ఆతడి కన్నులలోనికి సూటిగా చూస్తూ చిరునవ్వుతో స్వామి ఇలా అన్నారు : మంచి ప్రశ్న వేశావు. నీ వన్నట్లు ఒక శివాజీ, ఒక రాణాప్రతాప్ ఈ ధర్మానికి ఎంతో చేశారు. తమ శౌర్య ప్రతాపాలను ధారపోశారు. నిజమే. వారిని స్మరించుకోవటం మన అవశ్య కర్తవ్యం. అయితే, వారు ఏ ధర్మం కోసం త్యాగాలు చేశారో, ఏ ధర్మ రక్షణ కోసం కంకణధారులై ప్రచండశూరులై నిలిచారో, అలా నిలబడటానికి వారికి ఏ ధర్మం ప్రేరణ నిచ్చిందో, ఆ సనాతన ధర్మాన్ని గురించీ, దాని సమగ్ర స్వరూపాన్ని గురించీ, మనం తెలుసుకోవటం ఇంకా అవసరం. అలా తెలుసుకుని ఆ ధర్మానికి మనం అంకితమయినప్పుడే ఒక శివాజీ, ఒక రాణాప్రతాప్ మనని చూసి సంతోషిస్తారు. తృప్తి పడతారు. ఆ ధర్మాన్ని నిజంగా మనం అవగతం చేసుకున్నప్పుడు ఆ వీర పురుషులు ఎందు కంతటి దీక్ష పూనారో మనకు బోధ పడుతుంది. అలాంటి దీక్ష మన నుండి కూడా విజృంభిస్తుంది.

నీవు యువకుడివి. నీ ఆవేశం నాకు నచ్చింది. నేను చెబుతున్న ఈ మంచి మాటలను కూడా నీవు అవగాహన చేసుకోగలవన్న విశ్వాసం నాకుంది. ధర్మమంటే, మన సంప్రదాయమంటే నీకు ఎనలేని అభిమానం ఉందికదా! దాని రక్షణలో ఈ నీ జీవితం ధన్యం కావాలని కోరుకుంటు

న్నావు కదా! అలాంటప్పుడు మనమేం చేయాలో తెలుసునా ? ఈ మన ధర్మ స్వరూపాన్ని సాకల్యంగా ఆకళించుకోవాలి. అందుకు మనం వేదంతో ప్రారంభించి, ఈ వేళ ఈ ధర్మం కొరకు నిలబడి పనిచేస్తున్న మహనీయుల వరకూ, మన ప్రయాణాన్ని కొనసాగించాలి. అలా ప్రయాణం చేస్తున్నప్పుడు మధ్యలో నీవు పేర్కొన్న వీర పురుషులు తగులుతారు. అప్పుడు వారికి నమస్కరించి, వారి నుండి తగినంత స్ఫూర్తిని మనం పొందాలి. పొంది, ముందుకు సాగాలి. మిత్రమా! నీవు పేర్కొన్న వీర పురుషులకు అటు వెనకా, ఇటు ముందూ కూడా కథ చాలా ఉందయ్యా!

సర్వాంతర్యామి యైన భగవంతుడు ఈ సృష్టిగా దిగివస్తున్నప్పుడు ఎన్నెన్ని మూర్తులను ధరిస్తున్నాడో, వేద వాఙ్మయం మనకు వివరిస్తూ ఉన్నది. ఈనాటి మన వినాయకుడు కూడా అలా ఆయన ధరించిన మూర్తులలో ఒకడని ఇంతవరకూ నీవూ విన్నావు కదా! ఈ వినడంలో శ్రద్ధ పెడితే బ్రహ్మ, విష్ణువు, శివుడు, కుమారుడు, వినాయకుడు — ఇలా వీళ్ళందరూ సృష్టి నిర్వహణ కోసం ఆ దైవం ధరిస్తున్న మూర్తులేనని మనకు స్పష్టమవుతుంది. ఏ ద్వారం ద్వారా నైనా ఇంటిలోనికి ప్రవేశించినట్లుగా ఏ మూర్తిని ఆరాధించి అయినా ఆ దైవ సాన్నిధ్యాన్ని మనం పొందవచ్చును అని తెలుస్తుంది. అలా తెలుసుకున్నప్పుడు దేవుడి పేరిట మతాలు ఉండవు. శైవ సంప్రదాయం, వైష్ణవ సంప్రదాయం, శాక్తేయ సంప్రదాయం — అనే అనుష్ఠాన విధానాలుంటాయే తప్ప, ఆ మూర్తుల పేరిట మతాలను సృష్టించుకునే దుర్బుద్ధి మనకు పుట్టదు. ఆ మూర్తులను వేరుగా చూసుకునే అవివేకమూ మనకు కలుగదు. ఇలా వినాయకచవితి లాంటి సంప్రదాయ సిద్ధమైన పర్వదినాలను ప్రతి సంవత్సరం చిత్తశుద్ధితో జరుపుకోవడం అందుకు పనికి వస్తుంది.

ఇక శ్రీరాముడు, శ్రీకృష్ణుడూ మొదలైనవారు భూమిమీద జరుగవలసిన ధర్మ సంస్థాపన కోసం దైవం నుండి వ్యక్తమైన అవతార

మూర్తులు— తాము దిగివచ్చినప్పుడు దుష్టులను శిక్షించడం, శిష్టులను రక్షించ టమే కాకుండా నిత్య జీవితంలో ధర్మాన్ని అనుష్ఠించడం ఎలాగో తమ జీవితాల ద్వారా వ్యక్తం చేస్తూ ఉంటారు వాళ్ళు. భూలోక అవసరాన్ని బట్టి ఈ అవతారమూర్తులు కాలకాలాల్లో, దేశదేశాల్లో దిగి వస్తూనే ఉంటారు. ఎక్కడ దిగివచ్చినా, ఆ దేశానికో, ఆ జాతికో పరిమితం కాకుండా అన్ని దేశాలకూ, ఎల్లకాలాలకూ అవసరమైన ఉపదేశాన్ని చేస్తారు వాళ్ళు. సృష్టి, స్థితి, లయాల్లో— 'స్థితి' అనేది అంటే ఈ సృష్టి నిలబెట్టడం అనేది విష్ణుమూర్తి కర్తవ్యం కనుక ఈ అవతారాలన్నీ విష్ణు స్వరూపాలేనని మన పెద్దలు వివరిస్తూ వచ్చారు. వారి వివరణను మనసు పెట్టి మనం అర్థం చేసుకోగలిగిననాడు అవతారమూర్తుల మధ్య మనకు తారతమ్యాలు కనబడవు. వారి పేరిట వేరుగా మతాలను పెట్టుకోవలసిన అగత్యం కూడా మనకు ఏర్పడదు. అవతారమూర్తుల జన్మదినాలను, వారికి సంబంధించిన పర్వదినాలనూ చిత్తశుద్ధితో జరుపుకోవడం వల్ల ఇలాంటి విశాల దర్శనం మరింతగా మనకు కలుగుతుంది. తెలియవలసిన వాస్తవం మనకు తెలుస్తుంది. అప్పుడు క్రైస్తవం మొదలైన మతాలుపోయి, క్రీస్తు మొదలైన అవతారమూర్తులు అందరికీ పనికివచ్చే ఆత్మీయులుగా మిగులుతారు.

ఇక మూడవ అంశం. మనకు నచ్చిన దేవతా మూర్తితోనో, అవతార మూర్తితోనో, మన ఆధ్యాత్మిక ప్రయాణానికి మనం శ్రీకారం చుడతాం. ఆ ప్రయాణం ముందుకు సాగి, నేడు మన కన్నుల ఎదురుగుండా దేవుని మూర్తులుగా పనిచేస్తున్న మహనీయుల చెంతకు మనను చేర్చగలగాలి. అప్పటివరకూ మన ప్రయాణం పూర్తయినట్లు కాదు. ఒక దేవతామూర్తిని గాని, ఒక అవతారమూర్తిని గాని చిత్త శుద్ధితో మన సారా మనం ఉపాసించినప్పుడు ఏం జరుగుతుందో తెలుసునా! ఆ దివ్య మూర్తులు ప్రస్తుతం ఈ లోకంలో దేహాన్ని ధరించి పనిచేస్తున్న ఏ మహా

నీయుడికి మన జీవలక్షణం దగ్గరగా ఉంటుందో, ఆ మహనీయుడి దగ్గరకు మనలను చేరుస్తాడు. ఇన్నాళ్ళు మనం ఉపాసించిన ఆ దేవతా మూర్తి, లేదా ఆ అవతారమూర్తి ఇలా దేహధారిగా రూపొంది, మనకు దగ్గరవు తున్నారని మనం దర్శించ గలగాలి. అంతేగాని వారినీ, వీరినీ వేరుగా చూడకూడదు. వేరుగా చూసే స్థితి నుండి వేరుగా చూసే స్థితికి మనం ఎదగాలి. ఎదగడానికి మనం అంగీకరిస్తే చాలు. కావలసిన ఎదుగుదలను వారే అనుగ్రహిస్తారు. ఇలా వేదంతో ప్రారంభమైన మన ప్రయాణం దేవతామూర్తుల మీదుగా, అవతారమూర్తుల మీదుగా నేడు వ్యక్తమై పనిచేస్తున్న దివ్య పురుషుల వరకూ సాగవలసి ఉంది. నీవు చెప్పిన వీర పురుషులు ఉన్నారే! వారు విష్ణ్వంశ కలిగిన దివ్యమూర్తులు. దేవతా సంప్రదాయం ద్వారా, అవతారమూర్తుల పరంపర ద్వారా భూమికి అందిన దివ్య జీవన మార్గం దెబ్బతిన కూడదని, దాని కొరకు కంకణం కట్టుకుని పనిచేసినవారు, 'విశిష్టమైన ధర్మదర్శనం మనకు లభించింది' - అని అనుకో గానే సరిపోదు. గ్రహించుకోంగానే సరిపోదు. దానిని అనుష్ఠించడానికి మనం మనసా, వాచా, కర్మణా అంకితం కావాలి. అలాగే అది కనుమరుగు కాకుండా రక్షించుకోవటానికి మనం మన ప్రాణాలను త్యాగం చేయడాని కైనా సిద్ధం కావాలి. ధరాన్ని అనుష్ఠించే చిత్తశుద్ధీ, ధర్మాన్ని రక్షించు కోవడానికి కావలసిన త్యాగశీలం మనలో నెలకొనాలి అంటే, మనకు అలవడాలి అంటే ఈయన ప్రయాణం అలనాటి వేదంతో ప్రారంభించి, ఈనాటి దివ్యమూర్తుల వరకు ఆగకుండా సాగి తీరవలసిందే.

హరిహరరాయలు, బుక్కరాయల చేత విజయనగర రాజ్యాన్ని స్థాపించిన విద్యారణ్యులు, ఛత్రపతి శివాజీని నడిపించిన సమర్థ రామదాసు, ఈ సత్యాన్నే మనకు తెలియజెపుతున్నారా అంటే బోధపడిందనుకుంటాను. హరిహరరాయలు, బుక్కరాయలు గాని, ఛత్రపతి శివాజీగాని, అనాదియైన వేదం దగ్గర తమ ప్రయాణాన్ని ప్రారంభించి, తమనాటి మహనీయుల

వరకూ సాగివచ్చి, ఆ మహనీయుల ప్రేరణతో ధర్మానికి రక్షకులై నిలిచిన వారే కదా! ఏమంటావ్ ? అందుకనే అన్నాను. 'అటు వెనకా, ఇటు ముందూ ఇంకా మనం గమనించుకోవలసినది చాలా ఉందీ'. అని శివాజీ మొదలైన వీరపురుషుల ధర్మ రక్షణ శీలాన్ని స్మరించుకోవటం ఎంత అవసరమో, ఆ ధర్మరక్షణకు అంకితం కావడానికి వారి జీవితంలో సాగిన సాధనా క్రమాన్ని కూడా గమనించుకోవడం అంతే అవసరం. ఆ గమనించుకోవడం చేతనయిననాడు, వారిలాగ మనం కూడా సాధనలో సాగి, ధర్మరక్షణకు అంకితం కాగలుగుతాము.

ఆ కుర్రవాడు విప్పారిన కన్నులతో అలా స్వామివైపు చూస్తున్నాడు. అతడిలో పొంగుకొస్తున్న పారవశ్యం ఆ కన్నుల చూపుల ద్వారా బయటకు ఉబికి వస్తోంది. "తృప్తికరమైన సమాధానం లభించిందండీ నాకు మిగిలిన వారి మాట ఎలా ఉన్నా, మీరు నాకి దర్శనాన్ని కలిగించడానికే ఇలా వరంగల్లు వచ్చారేమో! అనిపిస్తోందండీ!" అంటూ అతడు తన తృప్తిని వాక్కుల ద్వారా వ్యక్తం చేసే ప్రయత్నాన్ని చేస్తున్నాడు.

స్వామి కనులు మెరుస్తున్నాయి. స్వామి కరాలు ఆ యువకుని వెన్నును తడుతున్నాయి. స్వామి పదాలు, స్వామి పాదాలు ఇక ముందుకు సాగుదామంటున్నాయి.

అదే గొంతు - అదే కథ

"ఎవరిదిరా ఆ వినిపిస్తున్న ఉపన్యాసం ? మనదా ? మాష్టరుగారిదా?" అడిగారు స్వామి తన గదిలోనికి ప్రవేశిస్తూ.

ఎదుట నిలబడిన సోదరుడు నిశ్చేష్టుడవుతున్నాడు.

'ఏం అలా చూస్తున్నావు ? ఏమిరా సంగతి ?'

'మాష్టరుగారూ ! నిజంగా మీరు కూడా గుర్తు పట్టలేరా ? ఆ ఉపన్యాసం ఎవరిదో' అడిగాడు సోదరుడు.

'నేనే కాదు. ఇ. కె. మాష్టరుగారు కూడా గుర్తుపట్టలేరు ?'

ఆ సోదరుడు మరింత నిశ్చేష్టతను పొందుతున్నాడు.

'అలా కూర్చోబెడతాను' అంటూ అతన్ని కూర్చోబెట్టి, మిగిలిన వారిని కూడా వచ్చి కూర్చోమని ఇలా చెప్పారు స్వామి. ఒకసారి పర్యటన కార్యక్రమాన్ని ముగించుకొని వచ్చిన తర్వాత విశ్రాంతిగా పడుకుని ఉన్న మాష్టరుగారిని సమీపించి ఇలా అన్నాను : "మాష్టరుగారూ ! నేను మీకు ఇప్పుడొక క్యాసెట్ వినిపిస్తాను. అది ఎవరిది అన్నది మీరు గుర్తుపట్టి చెప్పాలి" అని.

'పెట్టు. ట్రై చేద్దాం' అన్నారు మాష్టరుగారు.

పెట్టాను.

కొద్ది నిముషాలు గడిచింది. మాష్టరుగారలా వింటూనే ఉన్నారు!

'మాష్టరుగారూ ? చెప్పండి' అన్నాను.

'చెప్పడం కష్టమేనోయ్' అన్నారు మనసారా నవ్వారు.

కనుక నాకే కాదు. ఇ.కె. మాష్టరుగారికి కూడా ఈ విచిత్ర పరిస్థితి తప్పలేదు.

నిశ్చేష్టత నుండి కోలుకుంటున్న సోదరుడు ఇలా అడిగాడు. మీ ఇద్దరి గొంతులో గల ఈ వైచిత్రిని మొదటగా మీరెప్పుడు గమనించారు

గతంలోనికి చూస్తూ స్వామి ఇలా చెప్పారు: అది కూడా ఒక చిత్రమైన సన్నివేశమే. సోదర బృందంలో నందుల రమణగారని ఉన్నారు. ఆ రమణగారి శ్రీమతి సావిత్రమ్మగారు. ఈ దంపతులు మాష్టరుగారికీ, మాష్టరుగారి కార్యక్రమాలకీ చాల సన్నిహితంగా ఉండేవారు. నన్ను కన్న బిడ్డలాగా చూసుకునేవారు. వాళ్ళ అమ్మాయిలు 'అన్నయ్యా, అన్నయ్యా' అంటూ పరవశించిపోతూ ఉండేవాళ్ళు. ఆ అమ్మాయిలలో ఒకమ్మాయి పేరు కమల. ఆ కమల ఏం చేసిందీ, ఒకరోజున నేను వాళ్ళింట్లో ప్రేయరు ఇస్తూ ఉండగా టేప్ చేసింది. ప్రేయరు అయిపోయిన తర్వాత అందరూ విశ్రాంతిగా కూర్చుని ఉన్నప్పుడు, ఆ చేసిన టేప్‌ను ఆన్ చేసింది. అందరికీ ఒక్కమాటుగా గగుర్పాటు కలిగింది. ఆ టేప్‌లో నుండి మాష్టరుగారి గొంతు వినబడుతోంది. టేప్ చేసిన ఆమె కూడా అలా ఆశ్చర్యపోతూ కూర్చుండిపోయింది. నానుండి మాష్టరుగారి గొంతు వెలువడుతున్నదీ అని మొదటగా నేను గమనించిన సన్నివేశం అదీ. టేపు నడుస్తున్న కొద్దీ కమల పారవశ్యంతో పొంగిపోతున్నది. అన్నయ్యా? మీదచ్చు మాష్టరుగారి గొంతే. కాదు. కాదు. మాష్టరుగారి గొంతే మీ నుండి ఇలా వెలువడుతోంది. యూ ఆర్ వెరీ లక్కీ అన్నయ్యా! వుయ్ ఆర్ వెరీ లక్కీ అన్నయ్యా! మీరదృష్టవంతులు. మీతో ఉన్న మేము అదృష్ట వంతులం. నాకివాళ ఎంతో ఆనందంగా ఉంది. ఎంతో ఆనందంగా ఉంది. అంటూ ఇంటికి వస్తున్న వాళ్ళందరికీ మరల మరల ఆ టేపును వినిపించటమే పనిగా పెట్టుకున్నదామె.

ఆనాడు కమల పొందిన ఆనందం క్రమంగా అందరిదీ అయింది. ఒకసారి మాష్టరుగారు విదేశయాత్రకు వెళ్లారు. వారు వెళ్ళిన రెండు మూడు రోజులకు ఒకానొక ఆధ్యాత్మిక కార్యక్రమంలో కె. యస్. దత్తుగారి

అధ్యక్షతన నా ప్రవచనం జరిగింది. ప్రవచనము మైకుల ద్వారా దూర ప్రాంతాలకు కూడా వినబడుతోంది. ఆ దూరప్రాంతాల నుండి పిల్లా మేక లతో సహా ఆడా, మగా ఎందరో, ఎందరెందరో పరిగెత్తుకొని రావడం కనిపించింది. ప్రవచనం పూర్తికాగానే ఆ పరిగెత్తుకొని వచ్చిన వాళ్లు, "మా చెవులకు మాష్టరుగారి గొంతు వినబడిందండీ! అంతే. పరుగెత్తు కుంటూ వచ్చేశాం. వారు విదేశాలకు వెళ్ళలేదేమో అనుకున్నాం. వెళ్లారని మాకూ తెలుసు. కాని, ఈ గొంతు విన్న తర్వాత వెళ్ళలేదనిపించింది. ఇప్పుడు వచ్చి, చూసి మరీ ఆశ్చర్యపోతున్నాం". అంటూ ఉప్పొంగిపోతు న్నారు. వారి పారవశ్యంలో పాలు పంచుకుంటూ దత్తుగారు: మాష్టరుగారు మనలను ఎలా విడిచి పెడతారు. అందుకనే ఇలా కృష్ణస్వామిగారిగా రూపొంది ఇలా మనను అక్కున చేర్చుకుంటున్నారు. నేనొక మాట అడుగుతాను చెప్పండి. మీరు మాష్టరుగారి గొంతువిని పరుగెత్తుకొని వచ్చారు. కాని మాష్టగారు మీరుద్దేశించిన రూపంలో ఇక్కడ లేరు. లెక్క ప్రకారం మీరు డిసప్పాయింట్ అవ్వాలి. కాని అలా అవ్వలేదు. అంతకు రెట్టింపు ఆనందాన్ని మీరిప్పుడు పొందుతున్నారు. అవునా ? కాదా? అవునవు నన్నట్లుగా తలలూపారు వాళ్లు.

ప్రాంగణం అంతా అలా పరవశిస్తూ ఉండగా, డి.ఐ.జి. రామకృష్ణ శెట్టిగారు వారిని చూస్తూ, 'మీరు చాలా దురదృష్టవంతులు. మీరు మన మాష్టరుగారిని 'మిస్ అయ్యారు' అన్నారు. 'వ్వాట్ వ్వాట్' అన్నారాయన.

'వాట్, అంటారేమిటి సార్ ? యూ మిస్‌డ్ ఎ లాట్. రియల్లీ యు మిస్‌డ్ అవర్ మాష్టర్.' - అన్నారు మళ్ళీ దత్తుగారు. క్రమంగా జరిగిన సన్నివేశాన్ని బోధపరచుకొని 'అరరే! బలే సన్నివేశాన్ని మిస్ అయి పోయామే' అనుకుంటూ సారీ చెప్పారాయన.

ఏటా జనవరిలో జరిగే గురుపూజల్లో ఇలాంటి చిత్రాలు చాలా జరిగేవి, నా ప్రవచనం ప్రారంభ కాగానే అన్నివైపుల నుండి బిలబిలా

పరుగెత్తుకుంటూ వచ్చేవారు సోదర బృందం. మాష్టరుగారు మాట్లాడుతున్నా రని పరిగెత్తుకుంటూ వచ్చేవారికి ఈ చిన్న శరీరం కనబడేది. వారి ఆశ్చర్యానందాలకు అవధులుండేవి కావు. ప్రతి గురుపూజల్లోనూ వేదికకు దూరదూరంగా అనేకమైన పనుల్లో నిమగ్నమై ఉండే కార్యకర్తలకు ఇప్పుడు డయాస్ మీద మాట్లాడుతున్నదెవరు? మాష్టరుగారా? కృష్ణ స్వామిగారా? అన్న సస్పెన్స్ ఎప్పుడూ ఉండేది. ఒక్కొక్కసారి వాళ్ళు సస్పెన్స్‌కు తట్టుకోలేక వాళ్ళల్లో ఎవరో ఒకరిని మాట్లాడుతున్నది ఇంతకూ ఎవరో అని వేదిక దగ్గరకు పంపించేవారు.

కాలచక్రం గిర్రున తిరిగింది. మాష్టరుగారు భౌతికకాయాన్ని విడిచిపెట్టడం జరిగింది. అనేకచోట్ల సంస్మరణ సభలు జరిగాయి. దాదాపుగా అన్ని సభల్లోనూ నేను మాట్లాడటం జరిగింది. ఈ గొంతు ఆయనది. ఈ ఉపాధిని నిలబెట్టుకున్నది ఆయన. ఈ ఉపాధిలో తన గొంతును భద్ర పరచుకున్నదీ కూడా ఆయనే. అలాంటి ఈ గొంతును విని, చేరినవారు కొంతలో కొంత ఉపశమనాన్ని పొందడం గమనించాను నేను గుంటూరులో జరిగిన సంస్మరణ సభలో ఈ గొంతును విని ఒకామె మూర్ఛపోయింది. ఆమె మాష్టరుగారి దగ్గర చదువుకున్నదట. సంస్మరణ సభకని వచ్చింది. ఆ సభలో ఈ గొంతు వినబడింది. ఇక ఆమె తట్టుకో లేకపోయింది. మూర్ఛపోయింది. ఇలాంటివి ఎన్నెన్నో సన్నివేశాలు ఆ సంస్మరణ సభల్లో. విజయవాడలో ఒక యువకుడు నా వళ్ళంతా తడుముతూ బోరున ఏడ్చేశాడు.

'స్వామీ! ఈ గొంతు మాష్టారిదే. మాష్టారు ఈ గొంతులోనే ఉన్నారు. మీరు దేశం నలుమూలలా పర్యటించండి. ఈ గొంతును వాడ వాడలా వినిపించండి. నాలాంటి తప్త జీవులు ఎందరో ఉంటారు. ఈ గొంతుతో వారి నందరినీ సేద తీర్చండి. మీరు బాగుండాలి. మీరు మాతో ఉండాలి. మీరు మాకింకా దగ్గరైపోవాలి. అప్పటికిగాని మా కీ తపన

చల్లారదు. అప్పటికిగాని మా బ్రతుకులకు తెల్లారదు అంటూ తన చేతులతో చుట్టివేస్తున్నాడతను. తన కన్నీళ్ళతో ఈ ఉపాధికి అభిషేకం చేస్తున్నాడతను.

ఇంతలో గుంటూరులో మాష్టరుగారి రచనలపై ప్రత్యేకమైన జ్ఞాన యజ్ఞం నిర్వహింపబడింది. ఈ యజ్ఞానికి ప్రధాన నిర్వాహకులు శ్రీ జి. ఎల్. ఎన్. శాస్త్రిగారు. ఏడు రోజులపాటు జరిగిన యజ్ఞంలో నాల్గవ రోజనుకుంటా నా ప్రవచనం. మాష్టరుగారి రచనలైన లోకయాత్ర, ఇష్టాగోష్టిల గురించి మాట్లాడటం జరిగింది. ఆ రోజు సభలో ప్రముఖులందరితోపాటుగా నడవేదమని చెప్పదగిన బ్రహ్మశ్రీ సర్వా శేషయ్యగారు కూడా కూర్చొని ఉన్నారు. ఆయన జి. ఎల్. ఎన్. శాస్త్రిగారికి పిల్లనిచ్చిన మామగారు. ప్రవచనం సాగుతున్నంతసేపు మాష్టరుగారి సాన్నిధ్యం సభకంతటికీ నిండుగా అనుభవానికి వచ్చింది. మీరు ఇంకా కొంతసేపు మాట్లాడాలంటూ కాగితాలు వ్రాసి పంపించారు సభలోనివారు. 'ఇప్పటికే కాలం చాల అయింది. బస్సులసలు ఉండవేమో' అన్నాన్నేను. మీరు వాటిని వేటిని గూర్చి ఆలోచించవద్దు. మీరు మాట్లాడటమే మాకు కావలసింది. ఆ మాష్టరుగారి గొంతును ఎంత వింటే అంత తృప్తి తీరుతుంది వారికి. ప్రవచనం పూర్తయిన తరువాత శాస్త్రిగారితో కలసి కారులో ఇంటికి వెళ్ళుతూ సర్వా శేషయ్యగారు అన్నారట. 'ఇవాళ చాల సుదినం. మన సంప్రదాయంలో జీవేశ్వరుల అనుబంధాన్ని వివరిస్తూ సామీప్యము, సారూప్యము, సాయుజ్యము అన్న మూడు స్థితుల్ని చెప్తుంటారు. ఇంత కాలం ఈ స్థితులను గూర్చి వినటం, అధ్యయనం చేయటమే జరుగుతూ వస్తున్నది. ఈ రోజున కృష్ణస్వామిగారు మాట్లాడుతున్నప్పుడు ఆ మూడు స్థితులయొక్క నిజస్వరూపము నాకు సాక్షాత్కరించింది. నాకు అనుభవానికి వచ్చింది. ఈ నా సంతోషాన్ని మీరు రేపు వారికి తెలియజేయండి. నాకు చాల ఆనందం కలిగిందని చెప్పండి'.

ఆ మరునాడు శాస్త్రిగారు ఆనందబాష్పాలు తమ కనులలో తిరుగుతూ ఉండగా, ఆ మహనీయుని అనుభూతిని గూర్చి నాకు వివరించారు. నాకు చాల సంతోషం కలిగింది. వినమ్రుడనై వారికి నేను మనస్సులోనే నమస్కరించుకున్నాను. ఇలా ఈ గొంతును గూర్చి చెప్పుకుంటూ పోతే రోజులూ, నెలలు కూడా మనకు తెలియకుండా గడిచిపోతాయి. ఇంతకూ నేను చెప్పేది ఒకటే. అలాంటి ఈ గొంతును అనుక్షణం నేను ఆరాధించుకుంటున్నాను. ఆ గొంతును విని దగ్గరైన మీరు కూడా దీనిని ఆరాధించుకోండి.

చుట్టూ కూర్చున్న సోదర బృందం ఆ కాసేపటిలో నవరసాలు అనుభవించినట్లయింది. ఆ గొంతును గూర్చి తెలుసుకోవలసిన అంశాలు కొన్నింటిని, ఆ గొంతు ద్వారానే తెలుసుకోగలిగాం అన్న తృప్తి వారి ముఖాలలో కనబడుతోంది. ఆ దేహంతో ప్రాక్ - పశ్చిమ సమన్వయానికి బాటలు వేసిన ఈ గొంతు, ఈ దేహంతో జాతి పునర్నిర్మాణానికి శంఖారావమై వెలువడుతూ ఉన్నదని గుర్తించిన సోదరబృందం తమని తాము ఆ గొంతునకు సమర్పించుకుంటున్నట్లుగా గోచరించసాగారు.

ఆ అంచునుండి ఈ అంచుకు

అరబ్బు దేశాలనుండి వచ్చిన డాక్టరు ఒకాయన స్వామిని చూడ వచ్చాడు. ఆయన విజయవాడ వారేనట. డాక్టరుగా పనిచేస్తూ, కొంతకాలం ఆ దేశాలలో ఉండి వద్దామని వెళ్ళారట. అక్కడి పరిస్థితులను గూర్చి, సంస్కృతీ సంప్రదాయాలను గూర్చి సంభాషణలు నడుస్తున్నాయి.

స్వామి ఇలా అడిగారు : ఆ దేశాలలో మిగిలిన మతాలవారికి ఎలాంటి స్వేచ్ఛనిస్తారు ?

డాక్టర్ ఇలా చెప్పారు : "మిగిలిన మతాల వారికి స్వేచ్ఛ అనే ప్రసక్తి లేదక్కడ. ఇంక ఏ మతాలవారు, వారి మతాలకు సంబంధించిన గుడి గోపురాలను, మందిరాలను కట్టుకునే అవకాశం లేదక్కడ. ఇతర మతాలకు చెందిన సమావేశాలను బహిర్గంగంగా నడుపుకునేందుకు అవ కాశం లేదు. అలాగే ఇతర మతాలకు చెందిన ఊరేగింపులను, ఇతర సమావేశాలను కూడా అనుమతించరు. ఇక మనమేదైనా జరుపుకుంటే మన ఇళ్ళల్లో జరుపుకోవలసిందే! సర్వ సాధారణంగా సన్నిహితంగా మెలిగే అవకాశమున్న కుటుంబాల వారందరూ ఒక్కొక్కసారి ఒక్కొక్కళ్ళ ఇంట్లో గుంభనగా ఉత్సవాలను నిర్వహించుకుంటూ ఉంటారు. దైనందిన జీవనానికి నిత్యమూ కావలసిన సౌకర్యాలకు అక్కడ ఏ లోటూ లేదు. ఇక్కడ దొరికేవన్నీ అక్కడా దొరుకుతాయి. ఇక్కడ నుండే అక్కడకు వస్తూ ఉంటాయి. వృత్తి పరంగా కూడా మంచి గౌరవమే లభిస్తుంది. కాని ఎక్కడో ఏదో అసంతృప్తి. 'మనకు కావలసినంత స్వేచ్ఛ లేదు ఇక్కడ' అనే భావన నిరంతరం కలుగుతూనే ఉంటుందక్కడ. విజయ వాడ లాంటి ఊళ్ళో ఏదైనా మర్డర్ లాంటిది జరిగినప్పుడు కర్ఫ్యూ విధిస్తారు చూడండి. అప్పుడు మన మనస్సులకు ఎలా ఉంటుంది ? మామూలుగా అలా ఉంటుందక్కడ! అక్కడికి వెళ్ళిన తర్వాత భారత

దేశం అంటే భారతీయుడికి బాగా అభిమానం పెరుగుతుంది. ఏమున్నా, ఏం లేకపోయినా స్వేచ్ఛ ఉంది కదా మనదేశంలో అనిపిస్తుంది. స్వేచ్ఛ యొక్క విలువ కూడా తెలిసివస్తుంది. అలాగే ఇక్కడినుండి అక్కడ కొచ్చిన భారతీయుడు మన సంస్కృతికి మానసికంగా బాగా దగ్గరవుతాడు.

ఆయన మాటలను సావధానంగా వింటున్న స్వామి ఇలా అన్నారు : బాగా చెప్పారు. స్వేచ్ఛను గురించి మీరు చెప్పిన మాటలు చాలా బాగున్నాయి. అలాంటి స్వేచ్ఛను మన జాతి ఎన్ని దశాబ్దాలపాటు పోరాటాన్ని సలిపి సాధించుకొన్నదీ మనకు తెలుసు. కాని ఈ రోజున మన దేశంలో స్వేచ్ఛ అన్నది అనేక విధాల దుర్వినియోగం చేయబడుతున్నది. ఇది చాల బాధాకరమైన అంశం. ఏ స్వేచ్ఛ ప్రపంచంలోని అనేక దేశాలలో ఇవాల్టికి ఇంతగా లభించడం లేదో ఆ స్వేచ్ఛను మనం దుర్వినియోగం చేస్తున్నాము. అంటే ఇక ఆలోచించండి. ఇవాళ భారతదేశంలో ప్రధానమైన సమస్యలన్నీ ఈ స్వేచ్ఛా దుర్వినియోగం వల్లనే రూపు కట్టుకున్నాయి అని చెప్పవచ్చు. ఈ దుష్ట ఫలితాలతో ఇవాళ దేశం అట్టుడికిపోతున్నది. మన పెద్దలు స్వేచ్ఛను సాధించిపెట్టారు. బాగున్నది. ఆ స్వేచ్ఛను సద్వినియోగం చేయటం ఎలాగో మన జాతికి మనం నేర్పుకోవలసి ఉన్నది. ఇందాక మీరడిగారు. 'మీ కార్యక్రమాలు ఏమేమిటి మాష్టారూ! అని' మానవధర్మ శిక్షణ నిర్వహిస్తున్న ప్రణాళికలో స్వేచ్ఛను సద్వినియోగం చేసుకోవటం ఎలాగో ఈ జాతికి నేర్పుకోవడం అన్నది కూడా ఒక ప్రధానమైన అంశం!'

ఏ దేశానికీ లేనన్ని ప్రకృతి వనరులు మన దేశానికి ఉన్నా చూడడానికి ఈ దేశం రోతగా ఎందుకని కనబడుతుంది ? ఒకసారి అమెరికా నుండి ఒక పాప అప్పటి మన ప్రధానమంత్రి అయిన శ్రీమతి ఇందిరా గాంధీకి ఒక లేఖ వ్రాసింది. నేను భారతీయుల బిడ్డను. భారతదేశమంటే నాకు అమితమైన అభిమానం. ఈ మధ్య నేను నా తల్లిదండ్రులతో కలిసి

భారతదేశానికి వచ్చాను. ప్రధానమైన నగరాలలో తిరిగాను. తిరుగుతున్నప్పుడు ఆ రోడ్లను చూస్తుంటే చాల బాధవేసింది. రోడ్లపైన మనుష్యులతో పాటు పశువులు కూడా తిరుగుతున్నాయి. ఆ పశువులు వదలిన మల మూత్రాలతో రహదారులు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. చిత్రం! మనుషులు కూడా పశువులను అనుసరిస్తూ కనిపించారు. ఆ రోడ్లపైన నడవాలీ అంటే నాకు భయంవేసింది. బాధ కలిగింది, రోతపుట్టింది. అని నా దేశం ఎందుకిలా ఉందా? అనిపించింది, ఆ కలిగిన బాధను ఆపుకో లేక మీకు ఈ లేఖ వ్రాస్తున్నాను అన్నది. ఆ పాప వ్రాసిన లేఖయొక్క సారాంశము. దానికి మన ప్రధానమంత్రి జవాబు వ్రాస్తూ అంటుందికదా! 'పాపా! నీవు చెప్పిన దృశ్యాలు నిజమేనమ్మా! కాని మన భారతదేశం బీదదేశం. ఆర్థికంగా వెనుకబడిన దేశం ఇది. అలాంటి ఈ దేశంలో నీవు చూసిన దృశ్యాల లాంటివి తప్పవు' అని. నాకు ఆశ్చర్యం వేసింది. దేశం ఆర్థికంగా వెనుకబడటానికిన్ని, రోడ్లు ఇలా ఉండటానికిని సంబంధం ఏమిటి? అని. ఆ పాప వ్రాసిన దృశ్యాలన్నీ మన శ్రద్ధలేనితనానికి అద్దం పడుతున్నాయి. దేశం యెడల మన కెలాంటి భక్తి శ్రద్ధలు ఉన్నవో మనకు తెలియజెపుతున్నాయి. ఇది నా దేశం. ఇది బాగుండాలి. అందంగా ఉండాలి. ఇక్కడ అందరూ సుఖంగా ఉండాలి. ఎవరికీ ఇబ్బంది కలుగ కూడదు-అన్న ఆలోచన మనలో ఉన్నప్పుడు ఈ దేశం ఇలా ఉండదు. ఆ ఆలోచన మనలో లేనప్పుడు, మనకు రానప్పుడు అమితమైన ఆర్థిక వనరులున్నా ఇంకా ఇంతకింత చండాలంగ తయారవుతుంది. స్వాతంత్ర్యము వచ్చిన తరువాత, స్వేచ్ఛ మనకు లభించిన తరువాత మనకు దేశం ఎడల, దేశం యొక్క అవసరాల యెడల శ్రద్ధ తగ్గిపోయింది. ఎవరు ఏమయిపోయినా పరవాలేదు. మన పని అయిపోతే చాలు. ఎవరు ఏమయిపోయినా పరవాలేదు. మనం బాగుంటే చాలు' అన్న భావన మన మనస్సులలో విజృంభిస్తూ రాజ్యమేలుతున్నది. ఇలాంటి భావన కలిగిన మనిషి, లెక్కలేనన్ని విధాలుగా స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్నాడు.

తనకు తోచినట్లల్లా వాడుకుంటున్నాడు. తనకు లాభించేట్లుగా మలచుకుంటు న్నాడు. ఇవాళ అతను తన కొరకు ఏదైనా చేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఆశ్చర్యం.... ఒకప్పుడు ఈ దేశం కొరకు తానేమయిపోయినా పరవా లేదన్న భారతీయుడు, ఇవాళ తన కొరకు ఈ దేశం ఏమయిపోయినా పరవాలేదన్న స్థితికి వచ్చాడు. ఆలోచించండి, మనమెక్కడ ఉన్నామో?

స్వామి మాటలు ఆకళింపు చేసుకుంటున్న ఆ డాక్టరు నిట్టూర్చాడు. 'నిజమే మాష్టారూ! మీ మాటలు వింటుంటే ఒకాయన చేసిన ఒక చక్కటి కామెంట్ గుర్తుకొస్తున్నది. "జపనీయులు బీదవారు. కాని జపాన్ దేశం సంపన్నమైంది. భారతదేశం బీదదేశం. కాని భారతీయులు భాగ్య వంతులు" అన్నాడాయన. మనదేశంలో ఉన్న సంపదంతా ఇళ్లల్లోకి వచ్చేస్తుంది. ఆ ఇళ్ళల్లో ఎవరికీ కనబడని చోటుల్లోకి వెళ్ళిపోతోంది. దేశం బీదదై పోతుంది. ప్రజలు మాత్రం సంపన్నులౌతున్నారు. దేశంలో ఏ సౌకర్యాలు ఉండవు. కాని ప్రజలకు మాత్రం ఇళ్లల్లో అన్ని సౌక ర్యాలూ ఉంటాయి. అన్ని భోగభాగ్యాలూ ఉంటాయి. ఇదీ చాల చిత్రమైన దృశ్యం మాష్టరుగారూ. మన దేశాన్ని మనమే కావాలని ఇలా చేసుకుంటు న్నాం. ఇప్పుడున్న దృశ్యమదీ.

నిట్టూర్పు విడుస్తూ ఇలా అన్నారు స్వామి: స్వాతంత్ర్య సమర కాలంలో భారతీయుని ప్రవర్తన త్యాగానికి పరాకాష్ఠ. స్వాతంత్ర్య అనంతరం భారతీయుని ప్రవర్తన స్వార్థానికి పరాకాష్ఠ. అప్పుడు ఆ అంచున నిలబడిన భారతీయుడు, ఇప్పుడు వచ్చి ఈ అంచున నిలబడ్డాడు.

మరి ఇప్పుడిక మార్గమేమిటంటారు? నాకు మాత్రం 'మీవంటి ఉద్యమ శీలురే ఈ దేశంలో కావలసిన మార్పును తీసుకొని రాగల సమర్థులు అనిపిస్తుంది' అన్నాడాయన.

అతని ఆశాభావాన్ని అందుకుంటూ స్వామి ఇలా అన్నారు: మన కృషి వేగాన్ని పుంజుకొని, విస్తృతమైన పరిధిలో అనేక ముఖాల సాగవలసి ఉంది. అప్పుడు ఆ రావలసిన మార్పును, ఆ కావలసిన

మార్పును ఎదిగి వస్తున్న ఈ యువతరంలో నుండే మనం చూడటానికి వీలవుతుంది. అందుకు మీలాంటివాళ్ళందరూ కలసివచ్చి, చేతులు కలప వలసి ఉంటుంది.

'తప్పకుండా మాష్టరుగారూ ! ఆ ఉద్దేశంతోనే మిమ్మల్ని పరిచయం చేసుకుందామని ఈ రోజు ప్రత్యేకంగా వచ్చాను' అని నమస్కరిస్తూ సెలవు తీసుకున్నారు.

కథ సుఖాంతమౌతుంది

ఒక సోమవారంనాడు సద్గోష్ఠి అనంతరం సోదరుడొకరు ఇలా అడిగారు : స్వామీ! ఈ మధ్య మేము ఒక స్వామీజీ ఉపన్యాసానికి వెళ్ళాం. ఆయన 'మానవసేవే మాధవసేవ' అనటం తప్పు అని చెప్పారు. చేయవలసింది మాధవసేవేగాని మానవసేవ కాదూ!' అని చెప్పారు. అందుకాయన ఒక వివరణ కూడా చెప్పారు. 'మానవులందరూ గుణదోషాలతో నిండి ఉంటారు. వారికి సేవచేస్తే మనకు కూడా ఆ గుణదోషాలు అంటుకుంటాయి. కనుక చేయవలసింది మానవసేవ కాదు. నిర్గుణుడైన మాధవసేవే మనం చేయాలి' అన్నారు. ఈ వాక్యాలు విన్న తరువాత మా కేమిటోగా అనిపించింది. అందుకని మీరే మాకు సందేహ నివృత్తి చేసి, పుణ్యం కట్టుకోవాలి.

చేతులు జోడిస్తూ నిలబడ్డ ఆ సోదరుణ్ణి చూస్తూ స్వామి ఇలా అన్నారు : ఈ వాక్యాలు చెప్పిన ఆ పెద్దాయన నిజంగా ఆ వాక్యాలను విశ్వసిస్తూ ఉన్నట్లయితే, ఇక ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేయకూడదు. ఎందుకనంటే వారి దగ్గర జ్ఞానముంది. విషయ పరిజ్ఞానముంది. పదిమందికీ చెప్పగలిగిన నేర్పు ఉంది. ఆ నేర్పుతో ఆయన వేలాదికి మంచి మాటలు చెప్పటమనే సేవచేస్తున్నాడు. తాము చేయగలిగిన మంచి

పని అదీ, మంచి విషయములు మనుషులకు చెప్పగలగటం! అది ఆయన పెద్ద ఎత్తున చేస్తున్నారు. ఎందరో అందుకు సంతోషిస్తున్నారు. మరి వారు చేస్తున్న ప్రవచన సేవ ఈ గుణదోషాలతో నిండియున్న మానవాళికే కదా! మీరు చెప్పిన వారి వాక్యాలను వారే కనుక విశ్వసిస్తే ఈ గుణదోషాలతో ఉన్న మనుష్యులకు ఉపన్యాసాలు చెప్పడం మాని ఏ కొండగుహల లోకో వెళ్ళి నిర్గుణుడైన పరబ్రహ్మను ఉపాసిస్తూ కూర్చోవాలి. మరి వారట్లా చేయడం లేదు కదా! ఉపన్యాసాలిస్తున్నారు. జ్ఞాన యజ్ఞాలు నడుపుతున్నారు. సత్సంగాలు పెడుతున్నారు. కిందా మీదా పడుతున్నారు. ఇదంతా వారు గుణదోషాలున్న మనుషులతోనే చేస్తున్నారు. ఆ గుణదోషాలున్న మనుషుల కోసమే చేస్తున్నారు. మరి అవి వారి కంటుకుంటున్నాయో లేదో వారే చెప్పాలి.

ఇంతకూ నేను చెప్పవచ్చేదేమంటే వారు చేయగలిగిన మంచిపనిని వారు ఈ గుణదోషాలున్న మనుష్యులకే చేస్తున్నారు. మనం చేయగలిగిన మంచి పనిని కూడా అలాగే చేస్తామంటే 'తప్పు. అది వద్దు' అంటున్నారు; ఇది ఎట్లా పొసుగుతుంది? ఆయన కాదు. మనం కాదు. చివరకు అవతారమూర్తే దిగివచ్చినా పనిచేయవలసింది ఈ గుణదోషాలున్న మనుషులతోనే! సేవించవలసిందీ ఈ గుణదోషాలున్న మనుషులనే! అయితే వారు చెప్పినట్లు మనుషులలో గుణదోషాలుండటం సహజమే. ఆ గుణదోషాలు అంటుకోకుండా వారిని సేవించట మెలాగో నేర్పడానికే పెద్దలు ఉన్నది. తోటివారి గుణదోషాలు మన కంటకుండా వారిని సేవించగలగడమే కర్మాచరణంలో కౌశల మంటే! గుణదోషాలను చూసి పారిపోకూడదు. ఆగిపోకూడదు. ఆ గుణదోషాలు అంటకుండానే వారిని స్పృశించి, పరవశింప జేయగలగాలి. ఆ పారవశ్యంలో, వారు అంగీకరిస్తే, ఆ గుణదోషాలనుండి వారు బయటపడే మార్గాన్ని వారికి ఉపదేశించగలగాలి. సంగం అన్నదీ లేకుండానే సంఘసేవ చేయగలగాలి. అయినా సర్వాంతర్యామియైన దైవా

నికి అంటుకున్నవాడు మరొకదానికి అంటుకునే ప్రసక్తే ఉండదు. మరొకటి అన్నభావనే అతనికి ఉండదు. అనన్యంగా అతడిని చింతిస్తూ, లోకరూపంలో నున్న అతడికి మనం చేయగలిగింది శ్రద్ధా భక్తులతో చేయ డమే మన కర్తవ్యం. చేయడానికి కావలసిన సంకల్పం కలిగిస్తున్నది అతను. ఆ సంకల్పం కార్యరూపం ధరించడానికి కావలసిన శక్తియుక్తుల్ని అందిస్తున్నదీ అతను. ఆ కార్యక్రమ ఫలాన్ని ముచ్చటగా స్వీకరిస్తున్నదీ అతడే! ఇంకా అంటుకునేదేమిటి ? ఒకవేళ అంటుకుంటే అతడే అంటు కోవాలి. అతడు అంటుకోవటం కన్నా మనకు కావలసిందేమిటి ? ఇలా మన స్వధర్మ నిర్వహణ లోకరూపంలోనున్న అతడికి సేవగా సాగుతూ ఉండగా అతడే అంటుకుంటాడు! అతడే మనని అందుకుంటాడు! మనను తనలోనికి స్వీకరిస్తాడు, మనను తనమయంగా చేసి తన్మయస్థితిని అనుభ వింప చేస్తాడు! స్వధర్మాన్ని, జగద్ధితమైన సేవగా నిర్వహించటంలో నైపుణ్యాన్ని అభ్యసించి, ఇలాంటి తన్మయస్థితిలో తేలియాడమని భగవ ద్గీతలో కృష్ణుడు ఉపదేశిస్తున్నాడు. భగవద్గీత అంతటా పరచుకొని ఉన్నది ఈ సందేశమే! ఇపుడు మీరు చెప్పిన ఆ పెద్దాయన కూడా ఆ కృష్ణ స్మరణలో మునిగిపోవాలని చూస్తున్నవారే. తగిన సమయంలో వారికి కూడా శ్రీకృష్ణుడే సమన్వయాన్ని అందిస్తాడు. అప్పుడు వారు గుణదోషా లకు అతీతంగా ఉంటూ, మానవ రూపంలో ఉన్న మాధవుణ్ణి ఎలా సేవిం చాలో పరవశించి చెపుతారు. తొందర పడతారేం ? వారి జీవితమనే నాటకంలో కొద్ది రంగాలే ఇప్పటికి నడిచింది. వారి అంతరంగం వికసించ టానికి, ఆవిష్కరింపబడటానికి ముందు ఇంకా చాలా రంగాలున్నాయి. జరుగవలసిన నాటకం ఇంకా చాల ఉంది. కథ చివరకు సుఖాంతమే అవు తుంది.

ఆ అడిగిన సోదరుడు పులకించిపోయాడు : 'అదే కోరుకుంటున్నాను స్వామీ. నాటకం సుఖాంతం కావాలనే'! - అంటూ నమస్కరించాడు.

ధర్మతేజం దమిస్తుంది

మీ దగ్గరకు వచ్చినవాళ్లు పూర్తిగా కొనసాగకుండా మధ్యలో కొందరు ఎందుకు దూరమవుతున్నారు ? అలా నిలబడలేని లక్షణం ఉన్న వాళ్లని అసలు మీరెందుకు రానిస్తున్నారు ? కొన్నాళ్లు ఇక్కడుండి పనిచేసి, మీరే లోకంగా మీచుట్టూ తిరిగి, ఇప్పుడక్కడ జంక్షన్‌లో నిలబడి, ఇక్కడి కొచ్చేపోయేవారిని నిలబెట్టి మీ గురించి నోటి కొచ్చిన వన్నీ చెబుతున్నారూ అంటే ఎలా ఉంటుంది ? అసలు ఇలాంటి దృశ్యాలకి ఎందుకు అవకాశ మిస్తున్నారు ? కనీసం ఆ దృశ్యాలను దమించే ప్రయత్నం కూడా మీరెందుకు చేయటం లేదు ? నాకు ఏమిటో అంతా అయోమయంగా ఉంది. మీ రంటే నామనస్సు పరవశించి పోతోంది. మీ చుట్టూ ఇలాంటి సన్నివేశాలను అది ఊహించలేకపోతోంది. ఊహించలేని ఆ మనస్సు ఇలాంటివన్నీ జరుగుతుంటే చూసి తట్టుకోగలదా ? అసలు ఈ సన్నివేశాలు ఇలా జరగడంలో మర్మమేమిటో నాకు చెప్పండి. మీరుగా చెబితే నామనస్సు కొంత కుదుటపడుతుందేమో ! అలా అడుగుతూ బాధావేశంతో ఊగిపోతున్నాడొక యువకుడు.

ప్రశాంత వదనులై సూటిగా చూస్తూ స్వామి ఇలా అన్నారు : మీరడిగిన ఈ సన్నివేశాల కథలో అనేకమైన సూక్ష్మాంశాలు ఇమిడి ఉన్నాయి. మీ రడిగారు కాబట్టి చెబుతున్నాను. సావధాన చిత్తులై వినండి. ఇలా మధ్యలో వెళ్లిపోవడానికి ప్రధాన కారణాలలో ఒకటి ఆంధ్రత్వం. ఆంధ్రులు ఆరంభశూరులు అన్నపేరు ఉన్నదీ కదా ! అలా అనబడంలో అర్థం ఏమిటి ? 'వీళ్లల్లో ఎక్కువ మంది ఆరంభించకుండా ఉండలేరు. ఆరంభించింది కొనసాగించలేరు' అని ఏదో ఒక ఆవేశంలో ప్రారంభిం చేస్తారు. పని ప్రారంభించడానికి ఆవేశం సరిపోతుందిగాని, పనిని కొన సాగించటానికి ఆవేశం ఒక్కటే చాలదు. అందుకు పరిపూర్ణమైన

మానసిక సంసిద్ధత కావాలి. చక్కని క్రమశిక్షణ కావాలి. వినయ విధేయతలు కావాలి. నిరంతర కృషి కావాలి. అన్నింటినీ మించి త్యాగశీలం ఉండాలి. ఇన్ని అర్హతలు ఉంటేగాని ఒక పనిని కొనసాగించ గలిగిన స్థితి ఏర్పడదు. ఆవేశంతో ప్రారంభించిన వాడు ఈ లక్షణాలన్నీ అవసర మయ్యే సరికి క్రమంగా జంకుతాడు. ఈ లక్షణాలను అభ్యాసం చేసుకోవల సిందిపోయి, ఇన్ని లక్షణాలు ఇక్కడ అవసరమైతే ఇంక మనమేమి చేయగలం ? కనుక ఏదో ఒక వంకన ఇక్కడి నుండి తప్పుకుందామని చూస్తారు. వాడు మంచివాడయితే తనకు ఖాళీ లేదనో, పీలు కావడం లేదనో, వేరే పనులు ఏవో తగిలాయనో, లేదా ఉన్నపనులలోనే వత్తిడి పెరిగిందనో చెప్పి అక్కడ నుండి తప్పుకుంటాడు. వాడు కుసంస్కారి యైతే తన మీద పెట్టుకోకుండా, ఆ పెట్టే వంక లేవో ఆ ఉద్యమం మీద పెడతాడు. అక్కడ పద్ధతి లేదనో, ప్రవర్తన సరిలేదనో, సేవాభావం కొరవడిందనో, నైతిక విలువలు లేవనో, తానాశించినట్లుగా అక్కడ జరగడం లేదనో ప్రచారం మొదలుపెట్టి అక్కడి నుండి తప్పుకుంటాడు. ఇంతకీ ప్రధాన కారణం అసంఘ శూరత్వం. ఆ అంశాన్ని సూటిగా ఒప్పుకోవడానికి వారికి దమ్ముండదు. నేను ఈ పనిని కొనసాగించలేక పోతున్నాను అని ఒప్పుకోవాలి అంటే దానికి ధైర్యముండాలి. అలా ఒప్పుకోగలిగిన వాడు తనను తాను పరిశీ లించు కుంటాడు. క్రమంగా సంస్కరించుకుంటాడు. ఒక మంచి కార్య కర్తగా రూపొందగలుగుతాడు. నేటి సమాజంలో ఆత్మపరిశీలన తక్కువ. మనిషి తనను తాను పరిశీలించుకోవడం కన్నా, తనను తాను సమర్థించు కోవడానికే ప్రయత్నం చేస్తున్నాడు.

ఇక రెండవ అంశం. రమణ మహర్షి ఒక మాట చెప్పాడు. "ఈ ఆశ్రమంలోనికి ప్రవేశిస్తూ ప్రతివాడూ ఇక్కడి వాతావరణం బాగుంది. నేను ఇక్కడి నియమాలకు బద్ధుడనై ఉండాలి. ఉంటే బాగుపడతాను.

కనుక ఇక్కడ ఉన్నన్ని రోజులూ విధేయుడనై ఉంటాను." అనుకుంటూ ప్రవేశిస్తాడు. మూడు నాలుగు రోజులు గడుస్తాయో లేదో అతని పద్ధతి మారిపోతుంది. ఆశ్రమ నియమాల ప్రకారం తాను నడుచుకోవాలనుకున్న వాడు కాస్తా, ఈ ఆశ్రమంలో ఉన్నవాళ్లందరు మనం చెప్పినట్లుగా వింటే బాగుండును, అనుకుంటాడు. కొద్దిరోజుల్లోనే అతడిలో అంత మార్పు వస్తూ ఉన్నది. ఇది చిత్రం. ప్రతి ఒక్కడికీ అనిపించినట్లుగా ఆశ్రమాన్ని నడపడం ఎలా సాధ్యమౌతుంది. ఆ సాధ్యాసాధ్యాలతనికి పట్టవు. తన కనిపించిన ప్రకారం ఆశ్రమం నడవటం లేదు కాబట్టి ఆశ్రమంలో పద్ధతులు బాగుండలేవు. వీళ్లాట్లు బాగుండలేవు అంటూ ఏవేవో నిందలు వేయడం ప్రారంభిస్తాడతను. రమణ మహర్షి చెప్పిన ఈ మాటలు అక్షర సత్యాలు. చిత్రమైన ఈ మార్పు మనుషులలో రావడంకూడా, వారిలో కొందరు బయటకు వెళ్లిపోవటానికి దోహదం చేస్తున్నది. ఆ వెళ్లిన వాళ్ల ఊరుకోరు కదా ! కొంత కాలం పాటు అలా నిలదీస్తూనే ఉంటారు. కనబడ్డ ప్రతివాడికీ పనిగట్టుకొని చెపుతూనే ఉంటారు. ఈ సందర్భంలో కూడా కావలసింది ఆత్మపరిశీలనే. 'మనం ఏమనుకుంటూ వెళ్లాం అక్కడికి ? ఏమనుకుంటూ వచ్చేశాం అక్కడి నుండి ? ఎందుకని అక్కడ ఇమడలేక పోయాం ? మనలో ఇంతలో ఇంత మార్పు ఎలా వచ్చింది ? ఇలా కూడని మార్పులకు మనం లోనైపోతూ ఉంటే, ఇక్కడ కాకపోతే ఇంకెక్కడయినా మనం ఎంత వరకు మనగలం ? ఇలాంటి ఆత్మపరిశీలన మనిషి చేసుకోవాలి. చేసుకుంటే తను బాగుండతాడు. చేసుకోక పోతే తాత్కాలికంగా ఎదుటివాళ్లను ఇబ్బంది పెడతాడు.

ఇక మూడవ అంశం. ఒక గురువుకు శిష్యులు దగ్గరౌతారు. గురువు వారికి శిక్షణ నివ్వడం ప్రారంభిస్తాడు. ప్రారంభించిన తొలినాళ్లలో సన్నివేశాలన్నీ అనుభూతి ప్రదంగా బాగానే ఉంటాయి. కొన్నాళ్లయేటప్పటికి వాళ్లలోని పూర్వ సంస్కారాలు కదలడం మొదలుపెడతాయి. ఆ పూర్వ

సంస్కారాలలో మంచి సంస్కారాలు ఉన్నవాళ్లు, అనుభూతిలో మరింత గాఢతను పొందుతూ సమాజానికి పనికివచ్చే కార్యకర్తలుగా రూపు దిద్దుకోవడం మొదలు పెడతారు. ఆ పూర్వ సంస్కారాల్లో కూడని సంస్కారాలు ఉన్నవాళ్లు కొంతకాలంపాటు మానసికంగా వికృత స్థితులను అనుభవిస్తారు. ఎన్ని జన్మలనుండో నిక్షిప్తమై ఉన్న రాగద్వేషాలు, ఈర్ష్యాసూయలు, మద మాత్సర్యాలు మొదలైన కుసంస్కారాలన్నీ ఇప్పుడు ఒక్కసారిగా వెల్లుబికి పైకి వస్తాయి. వీటిని తట్టుకోగలిగిన వారు ఎవరు ? కుటుంబ సభ్యులా ? సమాజమా ? వారి నందరినీ ఈ కుసంస్కారాల బారినుండి రక్షించడానికై ఆ వెల్లుబికిన ప్రవాహాలను గురువు తనవైపుకు త్రిప్పుకుంటాడు. అంతే. అప్పటి నుండి కొంతకాలం వరకు ఆ వెల్లుబుకుతున్న వారందరూ తమ తమ కుసంస్కారాలతో గురువును దుమ్మెత్తి పోస్తారు. నానావిధ వికారాలన్నింటినీ ఆయనపైకే ప్రయోగిస్తారు. గురువు వాటిని ఆనందంగా స్వీకరిస్తాడు. ఇప్పటికైనా వాళ్లు కడగబడుతున్నారు కదా! అని సంతోషిస్తాడు. ఆ కుసంస్కారాల లోతులను బట్టి ఎంతకాలం వారు గురువును ద్వేషిస్తారన్నది నిర్ణయమౌతుంది. అలా కావలసినంత కాలాన్ని తీసుకున్న తర్వాత వాళ్లు మామూలు మనుషులై, గురుమూర్తికి దగ్గరై నమస్కరిస్తారు. శిష్యులను రూపుదిద్దుతున్న వేళలో గురువుకు ఇలాంటి విచిత్రమైన స్థితి గతులు తప్పవు. అన్నింటికీ సిద్ధమయ్యే అతడే గురుత్వమనే బాధ్యతను స్వీకరిస్తాడు. పవిత్రమైన ప్రేమతో అన్ని స్థాయిలలోని వారిని సహిస్తాడు. వారితో సహవసిస్తాడు. చూసేవారికి ఈ దృశ్యాలన్నీ బాధను కలిగించవచ్చు. ఇబ్బందికరంగానూ ఉండవచ్చు. గురువుకు మాత్రం ఈ సన్నివేశాలన్నీ కర్తవ్యంలోని భాగాలు.

వీటికి పైన ఒక సూక్ష్మం ఉంది. మహాభారతంలో భీష్మాచార్యుడు ధర్మజునికి ఉపదేశించిన సూక్ష్మాంశమిది. ఇద్దరు మనుష్యులు ఎలా కలుస్తున్నారు, ఎలా విడిపోతున్నారు? ఈ కలయికలు, విడిపోవటాలు వెనుక

గల కథ ఏమిటన్నది వివరిస్తూ భీష్ముడంటాడు కదా! ఒక నదీ ప్రవహిస్తూ ఉంది. ఆ నదికి రెండు వైపులా పెద్ద పెద్ద చెట్లు ఉన్నాయి. ఆ చెట్లు తన కాలం పూర్తయిన తరువాత ఎండి మ్రానులై విరిగి ఆ నదిలో పడుతున్నాయి. పడి ఆ ప్రవాహంలో కొట్టుకుపోతున్నాయి. ఇక్కడే గమనించవలసిన చిత్రం వుంది. ప్రయాణం చేస్తున్న ఆ చెట్ల మ్రానులను ఆ ప్రవాహమే దగ్గరయ్యేట్టు చేస్తుంది. ఆ దగ్గరయిన రెండు మ్రానులు కొంతకాలంపాటు కలిసి ప్రయాణం చేస్తాయి. అటుపైన ఏదో ఒక క్షణం నుండి ఆ ప్రవాహమే ఆ మ్రానుల్ని ఎడం చేయడం మొదలుపెడుతుంది. ఇక అవి క్రమంగా ఎడమై దేని మానాన అవి ప్రయాణం చేస్తుంటాయి. మళ్ళీ ఎప్పుడో ఆ ప్రవాహమే కలుపుతుంది. ఇక్కడ కలయికలూ, విడిపోవటాలు మ్రానుల వశంలో లేవు. ప్రవాహగతిపైన ఈ కలయికలూ, విడిపోవటాలు ఆధారపడి ఉన్నాయి. సరిగ్గా మానవుల కథా అంతే! ఈ మానవులు ఆ మ్రానుల లాంటివారు. ఈ మ్రానులను నడిపించే ప్రవాహమే కాలము. కాల ప్రవాహగతిపైన మానవుల కలయికలూ, ఎడబాటులూ ఆధారపడి ఉన్నాయి. ఇదీ అసలు సత్యం. భీష్మాచార్యుడు చేసిన ఈ ఉపదేశం చాల లోతయినదీ. ఈ యదార్థాన్ని గురించి వర్ణిస్తూనే పురాణ ఇతిహాసాలు అనేకచోట్ల 'సర్వము కాలవశము' అని చెబుతూ ఉంటాయి. అకారణంగా ఒక మనిషి మనకు దూరమైనప్పుడు గుర్తు తెచ్చుకోవలసింది ఈ ఉపదేశాన్నే. మళ్ళీ ఆ కాల ప్రవాహానికి తెలుసు, మనను ఎప్పుడు కలిపి నడిపించాలో! కాలగతి ఒక పట్టాన అంతుపట్టేది కాదు. కాని, మన ప్రవర్తన సరైనది అయినంతవరకు అది ఏది చేసినా మనకొరకే చేస్తుంది. మన వ్యక్తిత్వానికి మెరుగు పెట్టడానికే చేస్తుంది. మనని మరింత సమర్థులుగా రూపుదిద్దడానికే చేస్తుంది. మనను మరింత పవిత్రులుగా నిలబెట్టడానికే చేస్తుంది.

'మీరు చెబుతున్నవన్నీ నాకు బోధపడుతున్నాయి. కాని ఈ దారుణమైన దృశ్యాలవల్ల ఉద్యమం తాత్కాలికంగానైనా దెబ్బ తింటు

న్నట్లు కనబడుతోంది కదా! మరి దీనికి పరిష్కారం ఎలాగ ?' అని మీరనవచ్చు. నాకు రామాయణంలోని ఒక సన్నివేశం గుర్తొస్తున్నది. ఇతడు శత్రువుకి తమ్ముడు. అంత తొందరగా ఇతనిని నమ్మకూడదు అని విభీషణుడి గూర్చి సుగ్రీవుడు అంటాడు. అప్పుడు శ్రీరాముడంటాడుకదా : శరణువేడిన ప్రతివాడికీ అభయం పట్టడం నా వ్రతం. అలా శరణువేడిన వారినెవ్వరినీ నేను అనుమానించను. నాకు ఆత్మీయులుగానే పరిగణిస్తాను. వారి రక్షణ భారాన్ని నేను స్వీకరిస్తాను. నీవన్నట్లుగా కొంతకాలం పోయే సరికి వారిలో ఒకరికి బుద్ధి వక్రించిందనుకో. అప్పుడు వారిని దమిస్తాను. ఈ వాక్కులు నాకు బాగా నచ్చాయి. మన దగ్గరకు ఎందరో ఎన్నెన్నో విధాలుగా వస్తారు. వారిలో అన్నిస్థాయిల వాళ్ళూ ఉంటారు. వారికి అభయంపట్టి చేయూతనివ్వడం నా కర్తవ్యం. వారికి చేయవలసింది చేసి పెట్టడం నా ధర్మం. అలాంటి స్థితిలో వారిలో ఎవరికైనా బుద్ధి వక్రిస్తే వారు తప్పకుండా ఈ ఉపాధినుండి వ్యక్తమవుతున్న ధర్మతేజంచేత దమింపబడతారు. ఇంక అలాంటప్పుడు మనం అడుగడుగునా మనను చేర వస్తున్న వారిని అనుమానించడం ఎందుకు ? చేరవచ్చిన ప్రతివారినీ అనుమానించడం దారుణమైన అంశం కదా! అలా అనుమానిస్తే నానా జాగ్రత్తలు పడటంకన్నా, రాముడిలాగ నిలబడటమే సాక్ష్యం. మనం ఎవరినీ అనుమానించకూడదు. చేరవచ్చిన ప్రతి వ్యక్తినీ దేవుని రూపంగా భావించి మనం సేవ చేయవలసిందే. అతడు మధ్యలో వేరు విధంగా ప్రవర్తిస్తాడంటారా ? అతణ్ణి దమించేటందుకు ధర్మతేజం ఎలాగూ ఉండనే ఉన్నదికదా ! మనం ఆచరిస్తున్న ధర్మమే మనకు రక్ష. ఎట్టి పరిస్థితుల లోను మనలను నిలబెట్టుకునేది ఆ ధర్మమే'.

'మీ వివరణ బాగుంది. మీ విశ్వాసం ఇంకా బాగుంది. ఈ పాత్ర ధరించిన మీరు ఇలా నిలబడటమే బాగుంటుంది. మీరిలాగే ప్రవర్తించాలి. అప్పుడే మాకు ఆదర్శం దొరుకుతుంది. ఇప్పుడు నాకు చాల సంతోషంగా, తృప్తిగా ఉంది. ఏది, ఏమిటి అన్నది తెలుసుకున్న తర్వాత నాకు చాల హాయిగా ఉంది' అంటూ పరవశింపోయాడు ఆ యువ మేధావి.

స్టోరీ ఆఫ్ డాగ్

మహాభారతాన్ని గూర్చి మంచి కబుర్లు చెబుతున్నారు స్వామి. ఆయన చేతిలో మహాభారతంపైన విశ్లేషిస్తూ, ఎవరి చేతనో వ్రాయబడిన పుస్తకం ఒకటి ఉంది. ఇలాంటి పుస్తకాలు ఎన్నెన్నో స్వామి దగ్గరికి వస్తూ ఉంటాయి. అందులో కొన్నింటిని స్వామి మెచ్చుకుంటారు. కొన్నింటిని చూస్తూ నవ్వుకుంటారు. ప్రస్తుతం స్వామి పెదవుల వెంట చిరునవ్వు వెలువడుతోంది.

'ఏమిటి మాష్టరుగారూ ! నవ్వుతున్నారు ?' అడిగాడు ఒక సోదరుడు.

'ఏమీ లేదురా. పెద్దలు వ్రాసిన గ్రంథాలు ఎలా చూసినవాడికి అలా కనబడతాయి. అందులో మహాభారతం మరీను. మన కనిపించిన ఈ అంశం చెప్పడానికే వ్రాయబడింది ఇది' అని అనిపిస్తుంది. ఎవరికి వారికి ఇలా అనిపించే లక్షణం దీనిలో ఉందని నన్నయ్య తన అనువాదాన్ని ప్రారంభిస్తూనే చెప్పి మరీ ప్రారంభించాడు.

ఒక చిత్రం చెప్పనా ? ఒక రోజున ఒకాయన మహాభారతం మీద ఉపన్యసిస్తున్నాడు. ఆయన మంచి విద్వాంసుడు. యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా కూడా పనిచేస్తున్నాడు. ఆయన ఏమన్నాడో తెలుసునా ? 'ఈ మహాభారతాన్ని కుక్కకు సంబంధించిన కథగా చెప్పవచ్చు. ఎందుకని అంటే ఈ ఇతిహాసం కుక్కతో ప్రారంభమై, కుక్కతోనే పూర్తవుతుంది. నాకనిపిస్తుంది మహాభారతం ఒక కుక్క కథ. కుక్కచేత నడిపించబడిన కథ. కుక్క కొరకే రచించబడిన కథ' అని.

అందరూ ఆశ్చర్యపోతున్నారు. మహాభారతాన్ని 'స్టోరీ ఆఫ్ గాడ్' అంటారు కదా ? ఈయన 'స్టోరీ ఆఫ్ డాగ్' అంటున్నాడేమిటా ? అని.

"మీ రాశ్చర్యపడనక్కరలేదు. ఈయన మాటలు వినండి. మీకే తెలుస్తుంది" అంటూ ఆయన మళ్ళీ ఇలా కొనసాగించాడు. మొదట జనమేజయుని పరీక్షించడం కోసం ఒక కుక్క వస్తుంది. అతడు చేసిన యాగం యొక్క స్థాయిని అతనికి తెలియజెపుతుంది. కథంతా అయిపోయిన తరువాత ధర్మరాజు వెంట ఒక కుక్క నడుస్తుంది అతడిలోని ధర్మనిష్ఠ ఎంతటిదీ ? అన్నది అందరికీ తెలియ చెపుతుంది. ఇలా కుక్కయొక్క పర్యవేక్షణలో భారతమంతా నడిపించబడినిపిస్తుంది నాకు. మహాభారతం అధ్యయనం చేయగా, చేయగా నా మనస్సు చివరకు ఈ కుక్కపైన లగ్నమైంది. అసలు ఈ కుక్క ఏమిటి ? కుక్కంటే ఏమిటి ? మహాభారతంలో వ్యక్తమవుతున్న ఈ కుక్కయొక్క తత్త్వమేమిటి ? ఈ కుక్క దేనికి సంకేతంగా గ్రహించబడింది ? ఇలాంటి అంశాల మీద పరిశోధన చేయడానికి ఈ జీవితాన్ని అంకితం చేయాలని నిర్ణయించుకున్నాను. మహాభారతం మీద జరుగుతున్న పరిశోధనలకు ఇప్పటికిగాని ఒక పరిపూర్ణత రాదని నా ఉద్దేశం. అంటూ ఆనందబాష్పాలు రాల్చాడు ఆయన.

"ఇలా ఎవరి మనస్సు దేనిమీద లగ్నమౌతుందో ఎవరు చెప్పగలరు ? ఎవరికి ఎక్కడ అనుభూతి పొడసుతుందో ఎవరు చెప్పగలరు ? ఎవరి అనుభూతి వారిది. 'మహాభారతము-కుంతి' అని గ్రంథము వ్రాసినట్లే, 'మహాభారతము- కుక్క' అని ఈయన వ్రాస్తాడు. మొత్తంమీద ఈ పరిశోధనల పుణ్యమా అని ఎక్కడెక్కడి అంశాలూ బయటకు తోడబడుతున్నాయి. ఈ తోడబడుతున్న అంశాలలో ఏవి మనిషికి తోడ్పడతాయన్నది తర్వాతి సంగతి' అంటూ స్వామి చేతిలోని గ్రంథాన్ని ప్రక్కన పెట్టారు. పెడుతూ ఇలా అన్నారు: ఈ 'పరిశోధనలు చేసేవారు ఇదికూడా ఒక గమనించవలసిన అంశం' అని చెబితే బాగానే ఉంటుంది. ఇదే అసలు గమనించవలసిన అంశం అని చెబుతున్నారు. అక్కడే ఇబ్బంది వస్తున్నది. మమకారంతో కూడిన అతిశయోక్తులకు చోటు ఏర్పడుతున్నది.

పరిశోధనలో అతిశయోక్తులకు చోటుండకూడదు. అలా చోటీయబడితే ఆ పరిశోధనలో మనమే కనబడతాం. అసలు అంశం కనబడదు'

డాగ్ మైండెడ్‌గా అయిపోయారు అందరూ కాసేపు.

రామాయణం - రాయంతీలు

'మాష్టరుగారూ ! ప్రస్తుతం మీరు సావధానంగానే ఉన్నారనుకుంటూను' అంటూ ప్రవేశించారు సోదర బృందంలోని ఒకామె.

'ఏ, ఏమిటి కథ ?' అన్నారు స్వామి.

ఏమీ లేదు. ఓ చిన్న ఇది. తరచు వినబడుతున్న మాటలు కొన్ని ఉన్నాయి. వాటిని గూర్చి మిమ్మల్ని తరచి అడగాలని' అన్నదామె.

"అడుగుమరి. ఆలస్యమెందుకు !' అన్నారు స్వామి.

ఆమె గొంతు సవరించుకుంటూ ఇలా అన్నారు : రామాయణాన్ని గురించి ప్రవచనాలు చేసేవాళ్ళు తరచు కొన్ని మాటలు చెబుతుంటారు. ఆ మాటలు దాదాపు ఇలా ఉంటాయి. 'రామాయణము చాల పవిత్రమైంది. నిత్యమూ పారాయణము చేయదగ్గది. మొత్తం కాకపోయినా ఒక కాండనైనా పారాయణం చేయవచ్చు. కొండంత కాకపోయినా ఒక సర్గైనా పారాయణం చేయవచ్చు. అదీ చేయలేకపోతే కనీసం ఒక శ్లోకమైనా సరిపోతుంది. వీటిలో ఏది చేసినా ఒక పుణ్యం వస్తుంది' ఈ మాటలు నిజమేనంటారా ? ఒక్క శ్లోకం చదివినా రామాయణం మొత్తం చదివినట్లే నంటారా ?

చిరునవ్వు నవ్వుతూ స్వామి ఇలా అన్నారు : అదే నిజమైతే రామాయణంలో ఇన్నివేల శ్లోకాలను వ్రాసిన వాల్మీకి పిచ్చివాడై ఉండాలి.

ఆయన కూడా రాముని గాథను గూర్చి ఒక శ్లోకం వ్రాసి ఊరుకుంటుంటే సరిపోయేది కదా ! అంత పుణ్యమూ వచ్చేది. మోక్షమూ వచ్చేది. హాయిగా ఈ రచనా, ఈ హడావిడీ లేకుండా ఉండేది. మరెందుకనో ఆయన అలా చేయలేకపోయాడు. బహుశ అప్పటికి ఈ చెప్పేవాళ్ళెవరూ లేరేమో ! ఒకవేళ ఉండి ఉంటే, వాళ్ళ మాటలు ఆ వాల్మీకి వినివుంటే, ఆయనకు పుణ్యం మాట ఎలా ఉన్నా మనకీ రామాయణం మాత్రం లేకుండా పోయేది.

'మీరు మరీ మాష్టారూ ! బలే ఆట పట్టించేస్తారు' అన్నదామె.

చిరునవ్వులను మరింతగా వెలువరిస్తూ స్వామి ఇలా అన్నారు : "పాపం వాళ్ళ ఉద్దేశం మంచిదే. అందుకు వాళ్ళు అనుసరిస్తున్న విధానమే అర్థం లేనిదిగా తయారై, అసలు వాళ్ళు ఆశించిన ప్రయోజనమేదైతే ఉన్నదో దానిని నెరవేరకుండా చూస్తున్నది. 'రామాయణం పవిత్రమైంది. రోజూ పారాయణం చేయదగినది ! అని ప్రజలకు నచ్చచెప్పాలన్నది వారి కోరిక. ఆ నచ్చచెప్పడం ఎలాగా అన్నది ఆలోచించారు వాళ్ళు. మొత్తం చదవమంటే బద్ధకిస్తారని ఒక కాండ చదవమన్నారు. దానికి బద్ధకిస్తారేమోనని ఒక సర్గైనా చదవమన్నారు. ఇంకా రాయతీ చాలలేదని అనుకుంటున్నారేమోనని ఒక శ్లోకమైనా చదవండి. చాల పవిత్రమైంది. మిమ్మల్ని పునీతం చేస్తుంది' అని భక్తి ఆవేశంలో గొంతెత్తి అరిచారు. నిజానికి ఏం చేయాలి ? పవిత్ర గ్రంథాల అధ్యయనం ఎడల ప్రజలకున్న బద్ధకాన్ని వదలగొట్టాలి. వదల గొట్టాలంటే ఏంచేయాలి ? ఆ రామాయణ గాథలోని మాధుర్యాన్ని రుచి చూపించాలి. ఎంతగా రుచి చూపించాలీ అంటే, ఆ విన్నవాడు పూర్తిగా చదువుకోలేకుండా ఉండే తగా రుచి చూపించాలి. అప్పుడు రోజూ చదువుకుంటాడు. పారాయణం చేస్తాడు. పవిత్ర గ్రంథాల పరమార్థాన్ని జీవితంలో అన్వయించుకోవడం నేర్చుకుంటాడు. అలా వాళ్ళ బద్ధకాన్ని వదిలించే అనుభూతిప్రదమైన మార్గాన్ని

చూడాలి గాని, ఆ బిద్ధకాన్ని గౌరవిస్తూ అర్థంలేని రాయితీలన్నీ ఇస్తూ పోకూడదు.

ఇలా చెప్పేవాళ్ళల్లో బిద్ధకాన్ని గౌరవించే వాళ్లతో పాటుగా ఆయా రచయితల యెడల వీరభక్తితో చెప్పేవారు కూడ ఉంటారు. ఒక ప్రొఫెసర్‌గారు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మాట్లాడుతున్నారు. ఆయనకు నన్నయ్యగారంటే అమితమైన అభిమానం. అంతవరకూ మనకూ ఆనందమే. అభ్యంతరమేమీ లేదు. కాని ఆ మితిమీరిన అభిమానంతో ఆ నన్నయగారికే అన్యాయం చేయడం మొదలు పెట్టాడాయన. మొదలుపెడుతూ ఇలా చెప్పాడు : మహాభారతంలో పద్దెనిమిది పర్వాలున్నాయి. అందులో మొదటి రెండున్నర పర్వాలు నన్నయగారు అనువాదం చేశారు. కవిత్రయంలో నన్నయను మించినవారు లేరు. నన్నయగారి రచన వేదాన్ని మరిపిస్తుంది. మరిపిస్తుందేమిటి ? అసలు వేదమే. అందుకని తెలుగు భారతంలో ఆ రెండున్నర పర్వాలు మనం చదువుకున్నా చాలు. రెండున్నర పర్వాల దాకా ఎందుకు ? నన్నయగారు వ్రాసిన మొదటి పద్యం వ్రాసినా చాలు. మొదటి పద్యందాకా కూడా అక్కరలేదు. ఆ పద్యానికి మొదట ఉన్న 'శ్రీ' అన్న అక్షరం చదివినా చాలు. అదీ కూడా అక్కరలేదు. నన్నయ్యగారు వ్రాసిన ఆది, సభా పర్వాలు మీ ఇంట్లో ఉన్నా చాలు. మీరు తరిస్తారు. నేను చెబుతున్నాను. నన్నయ అంటే ఇది ! ఇలా కొనసాగింది ఆ వీరావేశం.

ఏతావాతా జరుగుతున్న దేమిటంటే ఇటు శ్రోతలలోని బిద్ధకాన్ని గౌరవిస్తున్న వాళ్ళగాని, అటు రచయితలపైన వీరభక్తిని ప్రదర్శిస్తున్న వారుగాని, మొత్తంమ్మీద రచయితలకూ, సమాజానికి కలిపి తీరని అన్యాయం చేస్తున్నారు. వారికి ఎంత భక్తైనా ఉండవచ్చు. గ్రంథం ప్రజల చేత చదివించాలని ఎంత కోరికైనా ఉండొచ్చు. ప్రజల్ని ఇలా తప్పుదారి పట్టించడం మాత్రం భావ్యంకాదు. రచయితలలోని విశిష్టతను గూర్చి

చెప్పండి. గ్రంథాలలోని దివ్యత్వాన్ని గురించి వివరించండి. చేతనైతే ప్రజలకు ఆ గ్రంథాలపైన మక్కువ కలిగేటట్లు చేయండి. ప్రజలు ఆ గ్రంథాలను ఆసాంతం చదువుకుని ఆనందించేటట్లుగా, నిత్యజీవితానికి వాటివి అన్వయించుకునేటట్లుగా ఉండండి. ఇవి ఆ గ్రంథాలను గూర్చి ప్రజలమధ్య మాట్లాడుతున్న వారికి నేను చెప్పదలచిన మాటలు. ఏమంటావ్ ? ఈ నా మాటలు, నీకు కూడా తృప్తి కలిగించాయని అనుకుంటాను.

'నాకిప్పుడు చాల తృప్తిగా ఉంది. ఎన్నాళ్లినుంచో ఈ అంశాన్ని గురించి అడిగాలని ప్రయత్నం. ఇవాల్టికి సానుకూలపడింది. సంతోషమైంది' అంటూ మురిసిందామె.